ఆదివారం
09-10-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 108
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
# విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

తెలంగాణ 'టైగర్' నల్లా నర్సింహులు
మహోజ్వల మునగాల రైతు పోరాటం
జీవితమంతా పోరాటమే
7లో

## కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణ

# అవశ్యం

- బీజేపీని గద్దె దించడానికి వామపక్ష, లౌకిక శక్తులు ఏకమవ్వాలి
- ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అవసరం
- సీపీఐ జాతీయ మహాసభల్లో కీలక అంశాలపై చర్చ
- 'ధర్మాన' తక్షణమే రాజీనామా చేయాలి
- 14న సీపీఐ మహాప్రదర్శన, బహిరంగ సభ
- వాల్ పోస్టర్ విడుదల కార్యక్రమంలో రామకృష్ణ

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:**
భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ వ్యవస్థలన్నింటినీ భ్రష్టు పట్టించిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడం కోసం వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులన్నీ ఏకం కావడంతోపాటు కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణ అత్యంత అవశ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. కార్పొరేట్‌లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగా అంబానీ, అదానీ ఆస్తులు లక్షల కోట్లకు పెరుగుతుండగా, పేదలు మరింత నిరుపేదలుగా మారుతున్నారని చెప్పారు. ప్రపంచంలోనే అత్యంత కటిక దరిద్రులున్న దేశంగా భారత్ ఉందని, కార్పొరేట్ విధానాలకు స్వస్తి పలికి, రైతు, కూలీ, కార్మిక, కష్టజీవుల సంక్షేమం, అభివృద్ధికి అవసరమైన ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను తీసుకురావాల్సిన అవసరం ఉందని రామకృష్ణ సూచించారు. విజయవాడలో ఈనెల 14నుంచి 18వ తేదీ వరకు జరగనున్న సీపీఐ జాతీయ మహాసభల్లో ఈ మూడు అంశాలపై ప్రధానంగా చర్చించనున్నట్లు రామకృష్ణ తెలిపారు. విజయవాడ దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ జాతీయ మహాసభలను పురస్కరించుకుని ఈనెల 14వ తేదీన విజయవాడలో జరగనున్న మహా ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్‌ను సీపీఐ రాష్ట్ర నేతలతో కలిసి రామకృష్ణ విడుదల చేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేస్తూ వ్యవస్థలన్నింటినీ నాశనం చేసిందన్నారు. పాలనాపరంగా అన్నిరంగాల్లో ఘోర వైఫల్యం చెందిందన్నారు. 2014, 2019 ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలలో ఏ ఒక్కటీ మోదీ అమలు చేయలేదన్నారు. బీజేపీకి అధికారమిస్తే రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, రైతు ఆత్మహత్యలను సంపూర్ణంగా నిషేధిస్తానని ప్రగల్భాలు పలికిన మోదీ...అన్నదాతల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. గత 8 ఏళ్లలో రైతుల ఆదాయం పెరగకపోగా, ఆత్మహత్యల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చినప్పటికీ కొత్తగా ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా ఉన్న ఉపాధి అవకాశాలను దెబ్బతీశారన్నారు. గత 45 సంవత్సరాల కాలంలో ఎన్నడూలేనంత

- మిగతా 2 లో

## సీపీఐ పతాకయాత్రకు అడుగడుగునా

# నీరాజనాలు

### కొల్లాం నుండి విజయవాడ వరకూ యంగ్ కమ్యూనిస్టు ఫ్లాగ్‌మార్చ్

### 11న ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశం, స్వాగతానికి భారీ ఏర్పాట్లు

**కొల్లాం:**
కేరళలోని కొల్లాంలో ప్రారంభమైన భారత కమ్యూనిస్టుపార్టీ పతాక యాత్ర (సీపీఐ యంగ్ కమ్యూనిస్ట్ ఫ్లాగ్‌మార్చ్)కు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. సిపిఐ 23వ మహాసభలు కొల్లాంలో నాలుగేళ్ల క్రితం జరిగిన విషయం తెల్సిందే. ప్రస్తుతం 24వ మహాసభలు ఈనెల 14 నుంచి విజయవాడలో జరుగుతాయి. ఈ సందర్భంగా కొల్లాం నుంచి విజయవాడకు సీపీఐ పతాకయాత్ర (ఫ్లాగ్ మార్చ్) మూడు రోజుల క్రితం కొల్లాంలో ప్రారంభమైంది. పార్టీ 24వ జాతీయ మహాసభలకు చిహ్నంగా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుండి వచ్చిన 24 మంది యువ కామ్రేడ్స్ కమ్యూనిస్టుపార్టీ పతాకాలు చేబూని బయలు దేరిన ఆ యాత్రను ఈనెల 5వ తేదీన పార్టీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు కనం రాజేంద్రన్ ప్రారంభించారు. ఈ ఫ్లాగ్‌మార్చ్ పాలక్కడ్, కోయంబత్తూరు, తిరుపూర్, ఈరోడ్ మీదుగా సాగింది. శనివారం సాయంత్రానికి ఈ మార్చ్ ఈరోడ్‌కు చేరింది. ఆదివారం ఉదయం 11 గంటలకు సేలం చేరుకుంటుంది. అక్కడి నుంచి ధర్మపురి, కృష్ణగిరి, తిరుప్పత్తూరు, వేలూర్ మీదుగా చిత్తూరు రానున్నది. ఈ

ఫ్లాగ్‌మార్చ్ ఎక్కడకు చేరినా అక్కడ యువకులు అద్భుతమైన రీతిలో స్వాగతం పలుకుతున్నారు. సాధారణ ప్రజలు నీరాజనాలు

- మిగతా 2 లో

## యువతి దారుణ హత్య

### నడిరోడ్డుపై గొంతు కోసిన ప్రేమోన్మాది

**విశాలాంధ్ర-కరప:**
సభ్య సమాజం తలదించుకునేలా సమాజంలో మృగాళ్లు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్ని నిర్భయ చట్టాలు తీసుకు వచ్చినా యువతులు బలైపోవడం మాత్రం తప్పడం లేదు. తాజాగా కాకినాడ జిల్లాలో ఓ ప్రేమోన్మాది చేతిలో యువతి దారుణ హత్యకు గురైంది. వివరాల్లోకి వెళ్తే.. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బాలారం గ్రామానికి చెందిన గుబ్బల వెంకట సూర్యనారాయణ(25)

- మిగతా 2 లో

## కోవిడ్ పేదల్లో 80 శాతం భారతీయులే

### ప్రపంచ బ్యాంకు నివేదిక

**న్యూఢిల్లీ :**
కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని అల్లాడించింది. లక్షలాది మంది ఆరోగ్య, ఆర్థికపరంగా ఇబ్బంది పడ్డారు. 2020లో ప్రపంచవ్యాప్తంగా పేదరికంలోని నెట్టబడిన వారిలో 80శాతం మేర భారతీయులు ఉన్నట్లు ప్రపంచ బ్యాంకు నివేదించింది. 'పేదరికం, భాగస్వామ్య శ్రేయస్సు-2022 : కోర్సును సరిదిద్దడం' పేరిట తాజా నివేదికను విడుదల చేసింది. భారత్ నుంచి పేదరికంపై అధికారిక డేటా లేకపోవడంతో అంతర్జాతీయ పేదరికం అంచనాలు ప్రభావితం అవుతున్నట్లు ప్రపంచ బ్యాంకు పేర్కొంది. కోవిడ్ కారణంగా 2020లో దాదాపు 80శాతం మంది పేదరికంలోకి నెట్టబడిన వారిలో భారత్‌కు చెందిన వారేనని ప్రపంచ బ్యాంకు అధ్యయనం తేల్చింది. మహమ్మారి కారణంగా ఆర్థిక నష్టాల కారణంగా ఆ సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా పేదలుగా మారిన 7 కోట్ల మందిలో భారతీయులు 5.6 కోట్ల మంది ఉన్నారని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా, తీవ్రమైన పేదరికం స్థాయిలు 2019లో 8.4 శాతంతో పోలిస్తే 2020లో 9.3శాతానికి పెరిగాయి. దశాబ్దాలలో మొదటిసారిగా ప్రపంచ వ్యాప్తంగా

పేదరిక నిర్మూలన కార్యక్రమాలు సాధించిన పురోగతిని నిలిపివేసింది. 2020 చివరి నాటికి ఏడు కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికంలోకి నెట్టబడ్డారు. ప్రపంచవ్యాప్తంగా పేదల సంఖ్య 70కోట్లకు పైగా పెరిగింది. దశాబ్దాలలో లేనంత పేదరికం నమోదు అయిందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది. 2011 నుంచి పేదరికంపై డేటాను భారత ప్రభుత్వం ప్రచురించలేదు. అధికారిక డేటా అందుబాటులో లేకపోవడంతో సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమిస్ (సీఎంఐఈ), కన్స్యూమర్ పిరమిడ్స్ హౌస్‌హోల్డ్ సర్వే (సీపీహెచ్ఎస్)పై ప్రపంచ బ్యాంకు ఆధారపడింది. ప్రైవేటు డేటా సంస్థ వివరాలను

- మిగతా 2 లో

## గుజరాత్ తీరానికే హెరాయిన్

### తాజాగా పాకిస్తాన్ పడవ నుంచి రూ.360 కోట్ల విలువైన మాదకద్రవ్యం పట్టివేత

**అహ్మదాబాద్:**
గుజరాత్ తీరంలో గుజరాత్ ఉగ్రవాద వ్యతిరేక బృందం (ఏటీఎస్), తీర ప్రాంత గస్తీ దళం పాకిస్తాన్‌కు చెందిన ఒక పడవ నుంచి రూ.360 కోట్ల విలువైన హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నాయి. పడవ నడుపుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు శనివారం తెలిపారు. అరేబియా సముద్రంలో 'అల్ సకర్' అనే పడవ నుంచి 50 కిలోల

- మిగతా 2 లో

## వైసీపీ రాజీనామా డ్రామా

### వికేంద్రీకరణకు మద్దతుగా జేఏసీ ఏర్పాటు

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:**
మూడు రాజధానుల అంశం ముదిరి పాకాన పడుతోంది. ఒకే రాజధాని కోసం అమరావతి రైతులు ఓ పక్క పాదయాత్ర చేస్తుంటే...మరోపక్క ఉత్తరాంధ్ర జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో వికేంద్రీకరణ ఉద్యమాన్ని వైసీపీ తీవ్రతరం చేస్తోంది. అందులో భాగంగానే శనివారం విశాఖలో వికేంద్రీకరణ జేఏసీ పేరిట రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికేంద్రీకరణ కోసం రాజీనామాకు సిద్ధమని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రకటించారు. రాజీనామా లేఖను జేఏసీ కన్వీనర్ లజపతిరాయ్‌కు ధర్మశ్రీ అందజేశారు. సీఎం జగన్ సై అంటే తాను కూడా రాజీనామాకు సిద్ధమని మాజీమంత్రి అవంతి శ్రీనివాస్ ప్రకటించారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు ఇప్పటికే వికేంద్రీకరణకు కట్టుబడి రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. మూడు రాజధానులకు మద్దతుగా రాజీనామా అంటూ

- మిగతా 2 లో

### ఇదీ లోకం!

ఈ రోజు మీ షెడ్యూల్ ఉదయం రాజధాని రైతులను తిట్టడం,మధ్యాహ్నం మూడు రాజధానులపై హామీ.. సాయంత్రం తిరిగి రైతులను ఆడిపోసుకోవడం!

# ఉద్యోగాల్లేవ్

- రిటైల్ రంగంలో 11.80 శాతం క్షీణత
- మాంద్యం, ద్రవ్యోల్బణం, ప్రస్తుత నియామకాల స్వభావమే కారణం
- తాజా నివేదిక వెల్లడి

**ముంబై:**
ఆగస్టు 2011 నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు రిటైల్ రంగంలో ఉద్యోగాల కోసం వెతుకున్న భారతీయుల సంఖ్య 11.80 శాతానికి క్షీణించిందని ఒక నివేదిక వెల్లడించింది. మహమ్మారి సమయంలో రిటైల్ ఉద్యోగాలను వెతుకుతున్న భారతీయుల సంఖ్య పడిపోయింది. ఎందుకంటే గత మూడేళ్లలో (ఆగస్టు 2019-ఆగస్టు 2022) రిటైల్ రంగంలో ఉద్యోగాలు 5.50 శాతం క్షీణతను చూశాయని అంతర్జాతీయ ఉద్యోగ వెబ్ సైట్ ఇన్‌డీడ్ ఒక నివేదికలో తెలిపింది. రిటైల్ ఉద్యోగాల కోసం శోధన ఆగస్టు 2020 - ఆగస్టు 2021 నుంచి 27.70 శాతం పెరిగినప్పటికీ, ఆగస్టు 2021 నుంచి ఈ సంవత్సరం ఆగస్టు వరకు మళ్లీ 11.80 శాతం క్షీణించినట్లు నివేదిక పేర్కొంది. గత సంవత్సరం లాక్‌డౌన్‌లు, పండుగల సమయంలో ప్రజలు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడానికి ఎంచుకున్న వర్క్ ఫ్రమ్ హోమ్ కారణంగా ఇది ఎక్కువగా ఉండవచ్చని పేర్కొంది. వాస్తవానికి ఆగస్టు 2019 నుంచి ఆగస్టు 2022 వరకు ఇన్‌డీడ్ డేటా విశ్లేషణ ఆధారంగా నివేదిక

- మిగతా 2 లో

# మానవ హక్కులను రాజకీయం చేయొద్దు: చైనా

-మానవ హక్కులను రాజకీయం చేయడం మానేయాలని చైనా అమెరికా, పశ్చిమ దేశాలను హెచ్చరించింది. మానవ హక్కుల సమస్యపై రాజకీయ అవకతవకలు, తప్పుడు సమాచారాన్ని వదిలివేయాలని పేర్కొంది. జాత్యహంకారం, వివక్ష, సాయుధ హింస, పాశ్చాత్య దేశాలలో వలసదారులపై దాడులు వంటి సమస్యలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చింది. చైనా ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం, దాని అభివృద్ధిని అడ్డుకోవడం, అసత్యాలను వ్యాప్తి చేయడం, చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కౌన్సిల్‌ను సాధనంగా ఉపయోగించుకునే ప్రయత్నాన్ని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. అమెరికా దాని మిత్రదేశాల నుండి బలమైన ఒత్తిడి ఉన్నప్పటికీ, అంతర్జాతీయ సమాజం ప్రతిపాదనపై చర్చలకు నిరాకరించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ నొక్కి చెప్పింది. జిన్‌జియాంగ్ సమస్యలకు మానవ హక్కులతో సంబంధం లేదు. హింసాత్మక ఉగ్రవాదం, వేర్పాటువాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు పేర్కొంది. రాజకీయ అవకతవకలు, తప్పుడు సమాచారం, అణచివేత విధానాలను విడిచిపెట్టి, సహకారం, మానవ హక్కులు, ప్రపంచ పురోగతికి నిజమైన సహకారం అందించాలని అమెరికా, పాశ్చాత్య దేశాలకు చైనా విజ్ఞప్తి చేసింది.

# చేగువేరాకు క్యూబన్ల ఘన నివాళి

## మరణించిన 55 సంవత్సరాల తర్వాత ఆయనకు నివాళి

హవానా: అర్జెంటీనా-క్యూబా విప్లవకారుడు, గెరిల్లా నాయకుడు ఎర్నెస్టో చే గువేరా 55వ వర్ధంతి సందర్భంగా వేలాదిమంది క్యూబన్లు శనివారం ఆయనకు ఘన నివాళులర్పించారు. హవానాకు తూర్పున 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న సెంట్రల్ సిటీ శాంటా క్లారాలో ఉన్న చేగువేరా సమాధి వద్ద దాదాపు 70వేల మంది ప్రజలు సాంప్రదాయ పద్ధతిలో నివాళి అర్పించారు. శాంటా క్లారాలో ప్రపంచవ్యాప్తంగా విప్లవాత్మక ఉద్యమానికి చిహ్నంగా, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా చిహ్నంగా పరిగణించబడే చేగువేరా స్మృతిని ఈ సందర్భంగా ప్రజలు సందర్శించుకున్నారు. ఎర్నెస్టో గువేరా జూన్ 14, 1928న అర్జెంటీనాలో జన్మించాడు. ఆయన గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించడానికి గ్రాన్మా యాచ్‌లో ఉన్న క్యూబా విప్లవ నాయకుడు ఫిడెల్ కాస్ట్రో, 80 మంది ఇతర సాహసయాత్ర సభ్యులతో కలిసి డిసెంబర్ 2, 1956న క్యూబాలో అడుగుపెట్టాడు. కాంగోలో మార్క్సిస్ట్ గెరిల్లాలతో పోరాడుతున్న క్యూబా విప్లవకారుల బృందానికి నాయకత్వం వహించిన తర్వాత, గువేరా 1966 చివరలో బొలీవియాకు వెళ్లారు. 39ఏళ్ల చేగువేరాను అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఆదేశాల మేరకు 1967న ఉరితీసింది.

## కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణ అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

నిరుద్యోగ సమస్యను సృష్టించారని ఆయన మండిపడ్డారు. విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెలికితీస్తానని ప్రజలను నమ్మించి, బ్యాంకులను కొల్లగొట్టి విదేశాల్లో తలదాచుకునే వారికి కేంద్రం అండగా నిలబడుతోందన్నారు. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరల అదుపునకు కనీస చర్యలు చేపట్టలేదన్నారు. ఇలా ఏ ఒక్క ప్రజా సమస్యను పరిష్కరించలేని మోదీ ప్రభుత్వం... ప్రజల మధ్య మత విద్వేషాలు రగిల్చి రాజకీయ లబ్ధి పొందే కుయుక్తులు పన్నుతోందన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో దాదాపు 47 సంవత్సరాల తర్వాత సీపీఐ జాతీయ మహాసభలు జరగనున్న విజయవాడ నగరం కీలక చర్చలకు వేదిక కాబోతుందన్నారు. ఈ మహాసభలకు దేశంలోని 29 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, అంతర్జాతీయంగా 20 దేశాల నుంచి కమ్యూనిస్టు పార్టీ నాయకులు సౌహార్ద ప్రతినిధులుగా రానున్నట్లు చెప్పారు. 14వ తేదీ మహా ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని, 15వ తేదీ నుంచి ప్రతినిధుల సభలు ప్రారంభమవుతాయని రామకృష్ణ వివరించారు. మహాసభల జయప్రదానికి ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**ధర్మాన వెంటనే రాజీనామా చేయాలి**

మూడు రాజధానుల కోసం మంత్రి ధర్మాన ప్రసాదరావు తక్షణమే రాజీనామా చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. నాడు అమరావతి రాజధానికి ఎందుకు అంగీకరించారు? గతంలోనూ రెవెన్యూ మంత్రిగా పనిచేసిన మీరు, భూసమీకరణలో రైతులు రాజధాని నిర్మాణం కోసం భూములు ఇవ్వొద్దని ఎందుకు చెప్పలేదు. నాడు నోరు పెగలలేదా? లేక పడిపోయిందా ? అని ప్రశ్నించారు. మీకు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేసి విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ నిధుల సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. విశాఖపట్నం ఉక్కు, గంగవరం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అప్పుడు తాము కూడా సహకరిస్తామన్నారు. మోదీని కనీసం ప్రశ్నించలేని మీరు...అమరావతి రైతులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ధర్మాన సోదరులు జగన్‌కు దాసోహమనడం తప్ప, వారి వల్ల ఏమీ కాదని ఉత్తరాంధ్ర ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు. రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చి న్యాయం కోసం రోడ్డున పడ్డ రైతు కుటుంబాలకు అండగా నిలబడాల్సింది పోయి, రైతులది దండయాత్ర అంటూ రెచ్చగొట్టడానికి సీనియర్ మంత్రిగా ధర్మానకు సిగ్గుండాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, పి.హరినాథరెడ్డి, జి.ఈశ్వరయ్య, దోనేపూడి శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎన్. లెనిన్ బాబు పాల్గొన్నారు.

# రష్యా, క్రిమియాను కలిపే కెర్చ్ వంతెనపై భారీ పేలుడు

మాస్కో: రష్యా, క్రిమియా మధ్య ఉన్న కెర్చ్ రైలు, రోడ్డు మార్గంలో భారీ పేలుడు సంభవించింది. కారు బాంబు పేలడంతో ఓ నదిపై ఉన్న బ్రిడ్జ్ ధ్వంసమైంది. పక్కనే ఉన్న రైల్వే బ్రిడ్జ కూడా దెబ్బతిన్నది. రైల్వే బ్రిడ్జ్‌పై వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్లకు నిప్పు కూడా అంటుకున్నది. ప్రమాదంకారణంగా వంతెనపై భారీ మంటలు ఎగసిపడుతున్నాయి. బ్రిడ్జ్‌పై జరిగిన పేలుడుకు సంబంధించిన వీడియోలు రిలీజ్ అయ్యాయి. మంటల తీవ్రతకు వంతెనపై కొంతభాగం కూలి సముద్రంలో పడుతున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించినట్లు సమాచారం. అజోవ్ సముద్రాని, నల్లసముద్రాన్ని కెర్చ్ జలసంధి కలుపుతుంది. ఉక్రెయిన్ అంతర్జాతీయవాణిజ్యాన్ని నల్లసముద్రం ద్వారానే నిర్వహిస్తోంది. అజోవ్ తీరం నుంచినల్లసముద్రం మీదుగా ఉక్రెయిన్ వాణిజ్యం సాగాలంటే కెర్చ్ జలసంధిన దాటాల్సిందే. ఉక్రెయిన్ నుంచి క్రిమియా ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత రష్యా ఆ రూట్లో బ్రిడ్జ్‌ను నిర్మించింది. అయితే శనివారం ఉదయం ఖార్కీవ్‌లో భారీ పేలుళ్లు చోటుచేసుకున్న కొన్ని గంటల్లోనే క్రిమియా బ్రిడ్జ్‌పై కూడా పేలుడు సంభవించింది.

# పేదల కోసం పోరాడిన భాస్కరరావు

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : నిరుపేదల కోసం ప్రాణాలు సైతం లెక్కచేయని ధీశాలి మాలెంపాటి బాల భాస్కరరావు అని సామాజిక విశ్లేషకుడు టీ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక బెల్ కంపెనీ ఆడిటోరియంలో శనివారం మోదుమూడి రామారావు అధ్యక్షతన మాలెంపాటి బాల భాస్కరరావు శత జయంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. తొలితరం సీపీఐ నాయకులు అంటే తనకు ఎంతో అభిమాన మన్నారు. 'దున్నేవాడిదే భూమి' అనే నినాదంతో జమిందారీ భూములు పేద ప్రజలకు అందే వరకు అవిశ్రాంతంగా పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, పార్లమెంట్‌లో తీర్మానాలు చేయాలని తీవ్ర స్థాయిలో ప్రయత్నించారని ఆయన అన్నారు. బాల భాస్కర్ రావు స్ఫూర్తితో తాను ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నాననీ, ఈరోజుల్లో అటువంటి వ్యక్తి గురించి చెప్పుకోవడానికి ఎంత ఆనందిస్తున్నానన్నారు. ఆయన చూపిన బాటలో రైతుల కోసం పోరాటాలు చేద్దామని, అందరం కలిసికట్టుగా నడుద్దామని పిలుపునిచ్చారు. మోదుమూడి రామారావు మాట్లాడుతూ భూస్వామిగా పుట్టి, దివి తాలూకాలోని దళితుల సమస్యలపై, వ్యవ సాయ కూలి రేట్లు పెంచేందుకు పోరాటాలు చేశారని తెలిపారు. లంక భూములు పేదలకు పంచి ఇచ్చేందుకు అనేక పోరాటాలు చేశారన్నారు. ఆయన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సీపీఎం నాయకులు కొడాలి శర్మ మాట్లాడుతూ చల్లపల్లి భూసంస్కరణల ఉద్య మంలో ఆయన పాల్గొని, పేద ప్రజల కోసం ప్రాణాలు సైతం త్యాగం చేశారని గుర్తు చేశారు. తొలుత బాల భాస్కర్ రావు చిత్రపటానికి పూలదండ వేసి ఘన నివాళి అర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు దగాని సంగీతరావు, రాష్ట్ర చేనేత సంఘం అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, కోశాధికారి యర్రంశెట్టి ఈశ్వరరావు, సీపీఐ మహిళా నాయకులు దేవభక్తుని నిర్మల, మోదుమూడి అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# రెండు గ్లాసుల పద్ధతి దారుణం

- అంటరానితనం నిర్మూలనకు కృషి చేయండి
- పోలీసులకు విక్టర్ ప్రసాద్ విజ్ఞప్తి

విశాలాంధ్ర-చెన్నేకొత్తపల్లి: అంటరానితనం నిర్మూలన కోసం పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ విక్టర్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం చెన్నే కొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామాన్ని శనివారం విక్టర్ ప్రసాద్ సందర్శించారు. దళితుల కోసం కేటాయించిన స్మశాన వాటికను పరిశీలించారు. గ్రామంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను బసంపల్లి దళితులు చైర్మన్ ఎదుట ఏకరువు పెట్టారు. దళితవాడలో అంబేద్కర్ ఇండియా మిషన్, మాల మహానాడు అధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న వేళ గ్రామాలలో ఇప్పటికీ రెండు గ్లాసుల పద్ధతి కొనసాగడం దారుణమని వ్యాఖ్యానించారు.

ఆ పద్ధతిని రూపుమాపేందు కు పోలీస్ శాఖ కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలోనూ దళితులకు స్మశాన వాటిక కోసం అరెకరం భూమిని కేటాయించాలని, రాజ్యాంగబ ద్ధంగా దళితులకు సంక్రమించిన హక్కులకు భంగం కలిగించకుండా చూడాలన్నారు. దళితులపై భూస్వాములు, అగ్రవర్ణాలు దాడులకు పాల్పడుతున్నారని, హత్యలు, అత్యాచారాలు చేస్తున్నారని, ఇలాంటి ఘటనలపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయడంలో జాప్యం చేయటం, నిందితులను వదిలివేయటం కొనసాగుతోందని చెప్పారు. అలాంటి కేసులపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా బసంపల్లిలో ఓ కులానికి చెందిన కుటుంబం దళితులకు చెందిన స్మశాన వాటికను ఆక్రమించుకుని సంవత్సరాలుగా అనుభవిస్తు న్నదని, దీనిని వ్యతిరేకించిన దళితులపై దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. దళితుల శవాలను సైతం ఖననం చేయడానికి స్థలం లేకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని బసంపల్లి గ్రామ దళితులు రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అంటరానిత నాన్ని రూపుమా పేందుకు, దళితులు స్వేచ్ఛగా తిరిగేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ తమకు ఆలయ ప్రవేశం లేదని, ధైర్యంగా వీధులలో తలెత్తుకుని తిరగలేని పరిస్థితి ఉందని చెప్పారు. ఇప్పటికీ కొన్ని గ్రామాలలో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతోందన్నారు. ధర్మవరం ఆర్డీవో తిప్పే నాయక్, డీఎస్పీ రమాకాంత్, రామగిరి సీఐ చిన్నగౌస్, సీకే పల్లి తహసీల్దార్, ఎస్ఐ, అంబేద్కర్ ఇండియా మిషన్ మాల మహానాడు సభ్యులు మల్లికార్జున, రామకృష్ణ, ఎర్రిస్వామి, వెంకట రాముడు, గద్దం ముత్యాలప్ప, రాచర్ల రామకృష్ణ, మురళీధర్ పాల్గొన్నారు.

## 80శాతం మంది భారతీయులే...

(మొదటిపేజీ తరువాయి)

ధృవీకరించనప్పటికీ అధికారిక డేటా లేకపోవడం వల్ల భారతీయ, ప్రాంతీయ, ప్రపంచ పేదరిక స్థాయిలను అంచనా వేసినట్లు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. 2020కి సంబంధించి సీపీహెచ్ఎస్-2020 డేటా ప్రకారం 2020లో పేదల సంఖ్య 5.6 కోట్లుగా ఉన్నట్లు వెల్లడి అయింది. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం భారతదేశం డేటాపై గందరగోళంగా ఉందని తెలుస్తోంది. దీంతో ఆర్థికవేత్తలు, గణాంకవేత్తలు ఆందోళన మరోమారు తెరపైకొచ్చింది. పర్యవసానంగా అభివృద్ధికి ప్రతికూలంగా పరిణమిస్తోంది. దేశంలోని పేదరికంపై అందుబాటులో ఉన్న సమాచారం జాతీయ నమూనా సర్వే కార్యాలయం 2011-12 నాటిది కావడం గమనార్హం. 2020లో దేశంలో పేదల సంఖ్య 2.3 కోట్ల నుంచి 5.6 కోట్లకు పెరిగిందని ప్రపంచ బ్యాంకు నివేదిక తెలిపింది. జాతీయ ఖాతాల ఆధారిత ప్రొజెక్షన్ 23 మిలియన్ల పెరుగుదలను సూచిస్తుంది. 2020 చివరికి అదనంగా 70 మిలియన్ల మంది ప్రజలు తీవ్ర పేదరికంలోకి నెట్టబడ్డారు. ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పేదరికం స్థాయిలను 2019లో 8.4 శాతం నుంచి 2020కి 9.4శాతానికి చేరింది. కోవిడ్ తరువాత ప్రపంచం సాధారణ స్థితికి వచ్చిన తర్వాత పెరుగుతున్న ఆహారం, ఇంధన ధరలు - వాతావరణ మార్పు; రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణల వల్ల తీవ్రతరం కావడం 'వేగవంతమైన పునరుద్ధరణకు ఆటంకం కలిగించాయి' అని పేర్కొంది.

## గుజరాత్ తీరానికే హెరాయిన్

(మొదటిపేజీ తరువాయి)

హెరాయిన్‌ను తీర ప్రాంత గస్తీ దళం, గుజరాత్ ఏటీఎస్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు వారు వివరించారు. పడవలో ఉన్న ఆరుగురు సిబ్బందిని తదుపరి విచారణ కోసం రాష్ట్రంలోని జాఖౌ నౌకాశ్రయానికి తీసుకువచ్చామని అన్నారు. భారత జలాల్లో పాకిస్తాన్‌కు చెందిన ఒక పడవ అనుమానాస్పద కదలికలను గుర్తించినప్పుడు, అక్టోబర్ 7-8 రాత్రి సమయంలో సంయుక్త ఆపరేషన్ నిర్వహించినట్లు తీర ప్రాంత గస్తీ దళం ఒక ప్రకటనలో పేర్కొంది. జాఖౌ నుంచి 40 నాటికల్ మైళ్లు, అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ (ఐఎంబీఎల్) లోపల ఐదు నాటికల్ మైళ్ల దూరంలో ఈ పడవను పట్టుకున్నట్లు వివరించింది. 'సవాలు ఎదురైనప్పుడు, పాకిస్తానీ పడవ తప్పించుకునే యుక్తిని ప్రారంభించింది. దీంతో ఐఎంబీఎల్‌కి సమీప ప్రాంతాలలో ఐసీజీతో రెండు వేగవంతమైన ఇంటర్‌సెప్టర్ క్లాస్ షిప్‌లు సి-429, సి-454ను పెట్రోలింగ్ కోసం మోహరించడం జరిగింది. పాకిస్తానీ పడవను అడ్డగించి, బలవంతంగా నిలిపివేశాం' అని వివరించింది. బోటులో సోదాలు చేయగా ఐదు గన్నీ బ్యాగుల్లో 50 కిలోల మత్తుపదార్థాలు దాచి ఉంచారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్ మార్కెట్ విలువ రూ.350 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన ఆరుగురు సిబ్బందితో పాటు అన్ని దర్యాప్తు సంస్థల సంయుక్త విచారణ కోసం పడవను జాఖౌకు తీసుకువచ్చినట్లు పేర్కొంది. సెప్టెంబరు 14న పాకిస్తాన్ పడవలో 40 కిలోల మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడంతో గత ఏడాది కాలంలో తీర ప్రాంత గస్తీ దళం, రాష్ట్ర ఏటీఎస్ సంయుక్తంగా జరిపిన ఆరో ఆపరేషన్ ఇది. కాగా ఒక నెలలోపు రెండవ ఆపరేషన్. గత ఏడాది సెప్టెంబర్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) దాదాపు 3 వేల కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. ఇది ఆఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చిన గుజరాత్‌లోని కచ్ జిల్లాలోని ముంద్రా ఓడరేవు వద్ద రెండు కంటైనర్ల నుంచి స్వాధీనం చేసుకున్న ఆ మాదక ద్రవ్యాల అంతర్జాతీయ మార్కెట్ విలువ రూ.21 వేల కోట్లు. ఇప్పటి వరకు భారత్‌లో అతిపెద్ద హెరాయిన్ రవాణా ఇదేనని చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో డీఆర్ఐ కచ్‌లోని కాండ్లా ఓడరేవు సమీపంలో కంటైనర్ నుంచి రూ.1,439 కోట్ల విలువైన 205.6 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. మే నెలలో ముంద్రా పోర్ట్ సమీపంలోని కంటైనర్ నుంచి 56 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకుంది. దీని విలువ సుమారుగా రూ.500 కోట్లు. జులైలో ఏటీఎస్ ముంద్రా పోర్టు సమీపంలోని కంటైనర్ నుంచి రూ.376.5 కోట్ల విలువ చేసే 75.3 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది.

## ఉద్యోగాల్లేవ్

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించబడింది. రిటైల్ రంగంలో 'బ్రాంచ్ మేనేజర్' వంటి మేనేజిరియల్ పాత్రలు అత్యధిక సంఖ్యలో ఉద్యోగ పోస్టింగ్‌లను (22.9 శాతం) కలిగి ఉన్నాయని నివేదిక వెల్లడించింది. అయితే సేల్స్ అసోసియేట్ స్థాయి పాత్రలు 10.07 శాతం వద్ద కొంచెం తక్కువగా ఉన్నాయి. తరువాత స్టోర్ మేనేజర్ 9.52 శాతం, లాజిస్టిక్స్ అసోసియేట్ 4.58 శాతం, మర్చండైజర్ 4.38 శాతంగా ఉన్నాయి. అయితే, ఉద్యోగార్థుల నుంచి ఆసక్తి పరంగా స్టోర్ మేనేజర్ (15 శాతం), రిటైల్ సేల్స్ అసోసియేట్ (14.4 శాతం), క్యాషియర్ (11 శాతం), బ్రాంచ్ మేనేజర్ (9.49 శాతం), లాజిస్టిక్స్ అసోసియేట్ (9.08 శాతం) వంటి కార్యాచరణ ఉద్యోగాలకు ఎక్కువ డిమాండ్ ఉంది. 'భారతదేశంలో పండుగ నెలలు సాధారణంగా పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా కాలానుగుణ ఉద్యోగాల పెరుగుదలను చూస్తాము. ఉద్యోగాల శాతం పెరుగుదల గత సంవత్సరంతో సమానంగా లేనప్పటికీ, గణనీయమైన సంఖ్యలో ఉద్యోగాలు ఉన్నాయని చెప్పలేము. 39.6 శాతానికి పైగా కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. 'ప్రపంచవ్యాప్త మాంద్యం, ద్రవ్యోల్బణం, ప్రస్తుతం నియామకాల జాగ్రత్త స్వభావం కారణంగా గత సంవత్సరంతో వ్యత్యాసాన్ని మేము చూస్తున్నాము' అని ఇన్‌డీడ్ భారతదేశ సేల్స్ హెడ్ శశి కుమార్ చెప్పారు. నివేదిక ప్రకారం, రిటైల్ రంగంలో జాతీయంగా 12.26 శాతం ఉద్యోగాలలో బెంగళూరు అత్యధిక వాటాను కలిగి ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ముంబై 8.2 శాతం, చెన్నై 6.02 శాతంగా ఉన్నాయి. బెంగళూరులో డెలివరీ ఉద్యోగాలకు అత్యధిక డిమాండ్ ఉందని, దేశంలోని డెలివరీ ఉద్యోగాల్లో 5.5 శాతం ఈ నగరంలోనే ఉత్పన్నమవుతున్నాయని నివేదిక పేర్కొంది. దీని తర్వాత చెన్నై (4.92 శాతం), ముంబై (4.16 శాతం), కోల్‌కతా (3.75 శాతం), హైదరాబాద్ (3.27 శాతం) ఉన్నాయి. అయితే ఉద్యోగార్థుల నుంచి డిమాండ్ పరంగా, డెలివరీ ఉద్యోగాల కోసం వెతుకుతున్న 6.29 శాతం ఉద్యోగార్థులతో చెన్నై మొదటి స్థానంలో ఉంది. హైదరాబాద్ (5.23 శాతం), కోల్‌కతా (4.85 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

## వైసీపీ రాజీనామా డ్రామా

(మొదటిపేజీ తరువాయి)

ధర్మశ్రీ లేఖ రాశారు. కరణం ధర్మశ్రీ రాజీనామా డ్రామాపై ప్రజలు మండిపడుతున్నారు. వికేంద్రీకరణకు వ్యతిరేకంగా దమ్ముంటే రాజీనామా చేయాలని టీడీపీ నేత అచ్చెన్నాయుడుకు ధర్మశ్రీ సవాల్ చేశారు. అమరావతికి మద్దతుగా అచ్చెన్నాయుడు టెక్కలి నుంచి తిరిగి పోటీ చేయాలని డిమాండ్ చేశారు.

**15న విశాఖలో భారీ ర్యాలీ: జేఏసీ**

విశాఖ రాజధానికి మద్దతుగా ఈనెల 15న భారీ ర్యాలీ నిర్వహిస్తామని వికేంద్రీకరణ జేఏసీ ప్రకటించింది. అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ జరుగుతుందని తెలిపింది. త్వరలో మండల, నియోజకవర్గస్థాయి సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. వికేంద్రీకరణకు మద్దతుగా ఏర్పాటు చేసిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ శాసనసభ్యుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖలో పరిపాలన రాజధాని కావాలన్నది ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష అని, రాష్ట్రంలో 29 గ్రామాల రైతుల ఆకాంక్షనే చూస్తారా? రాష్ట్రంలో మిగతా ప్రాంతాల రైతుల ఆంకాక్షను పరిగణనలోకి తీసుకోరా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనను ఉత్తరాంధ్ర ప్రజలు స్వాగతిస్తున్నారని, మూడు రాజధానులతోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని, వికేంద్రీకరణకు మద్దతుగా అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని ప్రకటించారు. 15వ తేదీన జరగబోయే విశాఖ గర్జన కార్యక్రమానికి ఉత్తరాంధ్ర ప్రజలు, వైద్యులు, న్యాయవాదులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, రైతులు పార్టీలకు అతీతంగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని వికేంద్రీకరణకు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు.

## సీపీఐ పతాకయాత్రకు అడుగడుగునా నీరాజనాలు

(మొదటిపేజీ తరువాయి)

పలుకుతున్నారు. వివిధ చోట్ల ఈ 24 మంది యంగ్ కామ్రేడ్స్ తమ యాత్ర గురించి వివరాలు చెపుతూ, కమ్యూనిస్టు పార్టీ ఆవశ్యకతను వివరిస్తున్నారు. కాగా, 24వ మహాసభల ప్రారంభోత్సవం సమయానికి ఆ ఫ్లాగ్ మార్చ్ విజయవాడలోని వేదిక వద్దకు చేరుకుంటుంది. అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్)లకు చెందిన నాయకులు, యువ కామ్రేడ్స్ ఈ యాత్రలో పాల్గొంటున్నారు. ఈ యాత్రా మార్గంలో యువ కామ్రేడ్స్ ప్రజలను కలిసి దేశంలో నెలకున్న నిరుద్యోగం, ప్రైవేటీకరణ, దారిద్ర్యం, ఆకలి, విద్యారంగ సమస్యలపై చర్చిస్తారు. ఈ సందర్భంగా ఫ్లాగ్ యాత్రలో పాల్గొంటున్న యువ కామ్రేడ్స్‌ను కనం రాజేంద్రన్ సహా ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులందరూ అభినందించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్ శక్తుల అభివృద్ధిని తప్ప ఏనాడూ ప్రజల అభివృద్ధిని కోరుకోలేదని, బూటకపు అభివృద్ధి పైనే దృష్టి సారించిందని ఈ సందర్భంగా జరిగిన సభలో రాజేంద్రన్ విమర్శించారు. దేశ ప్రజలు తమ డిమాండ్ల పరిష్కారం కోసం పాలకులపై తిరగబడకుండా ఉండేందుకే ఆర్ఎస్ఎస్ సంఘ పరివార్ శక్తులు వారిని రెండుగా చీల్చి వారు నిత్యం పరస్పర మతోన్మాద కలహాల్లో ఉంచాలనే చూస్తోందని విమర్శించారు. దేశంలో అసమానతలు యథాతథంగా కొనసాగిస్తూ ప్రజలు మనుస్మృతిని అనుసరించాలని సంఘపరివార్ కోరుకుంటోందన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యుడు ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ, బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం వెనుక కార్పొరేట్ శక్తులు అండగా ఉన్నాయని అన్నారు. పాలకులు అనుసరిస్తున్న అన్నిరకాల అసమానతలపై పోరాటం చేసి విజయం సాధించాలని, ఈ దిశగా విజయవాడలో జరిగే సిపిఐ 24వ జాతీయ మహాసభల తీర్మానాలు మార్గదర్శనం చేస్తాయన్నారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి విక్కీ మహేసరి మాట్లాడుతూ, దేశంకోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్, కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కారల్‌మార్క్స్, విప్లవ నాయకుడు వి.ఐ.లెనిన్, ఫైడల్ కాస్ట్రో తదితరులు అనుసరించిన పోరాటమార్గంలో మనం ముందుకు సాగాలని పిలుపు ఇచ్చారు. ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఏఐవైఎఫ్ జాతీయ నాయకులు వలీ ఉల్లా ఖాద్రీ, రెహమాన్, ప్రేమ్ కుమార్ పాల్గొంటున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు తెలిపారు. వలీ ఉల్లా ఖాద్రీకి బైక్ ప్రమాదానికి గురైందని, ఆయన గాయపడినట్లు తెలిపారు. అయినప్పటికీ, చికిత్స తీసుకొని తిరిగి యాత్రకు సమాయత్తమవుతున్నట్లు లెనిన్ వెల్లడించారు.

## యువతి దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

కొంతకాలంగా కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండలం, కె.గంగవరం గ్రామానికి చెందిన దేవిక(22)ను ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్నాడు. వీరిద్దరూ కూరాడలోని వారి అమ్మమ్మల ఇళ్ల వద్ద ఉంటున్నారు. కొంతకాలంగా సూర్యనారాయణ వెంటపడటంతో యువతి తరపు బంధువులు పెద్దల దృష్టికి తీసుకెళ్లి నెల క్రితం పంచాయితీ పెట్టారు. యువకుడి బంధువులు నిందితుడిని స్వగ్రామమైన బాలారం తీసుకెళ్లారు. ఈ క్రమంలో శనివారం పక్కా ప్రణాళిక ప్రకారం.. ద్విచక్రవానంపై కూరాడ వెళ్తున్న దేవికను నిందితుడు కూరాడ-కాంద్రేగుల గ్రామాల మధ్య అడ్డగించాడు. తనను ప్రేమించాలని ఒత్తిడి చేయగా.. ఆమె నిరాకరించడంతో కత్తితో మెడపై దాడి చేశాడు. కొనఊపిరితో ఉన్న యువతిని గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. ఆగ్రహించిన స్థానికులు వెంటనే యువకుడిని చెట్టుకు కట్టేసి చితకబాదారు. యువతిని జీజీహెచ్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకొని పెదపూడి పోలీసుస్టేషన్‌కు తరలించారు. యువకుడు తన వెంట యాసిడ్ సీసా సైతం తెచ్చుకున్నాడని పోలీసులు తెలిపారు.

## ముంచెత్తిన వర్షం

విశాలాంధ్ర-హైదరాబాద్: నగరాన్ని మరోసారి వర్షం ముంచెత్తింది. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయ్యాయి. అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. గచ్చిబౌలి, సనత్‌నగర్, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, మైత్రివనం, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మియాపూర్, శేరిలింగంపల్లి, మాదాపూర్, రాయదుర్గం, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, నిజాంపేట్, ప్రగతినగర్, రాజేంద్రనగర్, కిస్మత్‌పూర్, గండిపేట, ఉప్పరపల్లి, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, బేగంపేట్, అల్వాల్, చిలకలగూడ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. దీంతో కార్యాలయం నుంచి ఇంటికి వెళ్లే ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం బయటికి వచ్చిన ప్రజలు తడిసి ముద్దయ్యారు. రహదారులపై వరద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు మెట్రో రైళ్లను ఆశ్రయించారు. మెట్రో స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ కనిపించింది.

## ధర్మవరం గాయనికి జాతీయస్థాయి అవకాశం

**విశాలాంధ్ర-ధర్మవరంటౌన్:** తెలుగు జానపద సంగీతాన్ని దేశవ్యాప్తంగా వినిపించే అవకాశం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన సోమిశెట్టి సరళ దక్కించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం 75 ఏళ్ల ఆజాది కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా, ప్రసార భారతి విభాగంలోని ఆల్ ఇండియా రేడియో శాఖ, దేశవ్యాప్తంగా అనేక అంశాల్లో "ఏ" గ్రేడ్ కళాకారులైన 32 మందిని ఎంపిక చేసింది. ఈ ఎంపికలో ధర్మవరం గాయని సరళ ఉన్నారు. జానపద సంగీత అంశానికి రికార్డింగ్ నిర్వహించేందుకు ఆమెను ఆహ్వానించారు. సరళ పాడిన జానపద పాటలను నవంబర్ 3వతేదీ రాత్రి 9:30 నుంచి 10:30 గంటల వరకు ప్రసారం చేయనున్నామని ప్రసార భారతి సంగీత కార్యక్రమ విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సంతోశ్ నగర్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు సరళ తెలిపారు. తనకు జాతీయస్థాయిలో జానపద సంగీతాన్ని వినిపించేందుకు అపూర్వ అవకాశము రావడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. తెలుగు రాష్ట్రాల పరిధిలో తనను ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈ అవకాశం సరళకు రావడంపై వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పట్టణ కళాకారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పంచాయతీల నిధులు మళ్లిస్తున్నారనడం తప్పు

- వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి
- మంత్రి బూడి ముత్యాల నాయుడు

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:** పంచాయతీల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం హరిస్తుందంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, పంచాయతీల నిధులు మళ్లించడం లేదని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. స్థానిక గవర్నర్ బంగ్లాలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌ను మాత్రమే అభివృద్ధి చేయగా విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ నష్టపోయిందని, ఒకే ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే మిగతా ప్రాంతాలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. పాలన వికేంద్రీకరణ ద్వారా మూడు ప్రాంతాలు అభివృద్ధి చేయాలని సీఎం జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారని, అమరావతిని లక్ష కోట్లుతో అభివృద్ధి చేసినా చెందదని, పది వేల కోట్లతో విశాఖను పరిపాలన రాజధానిగా చేసుకోవచ్చునని బూడి అన్నారు. అమరావతిలో భూములు కొనుగోలు చేసిన వారే పాదయాత్ర చేస్తున్నారని, పాదయాత్ర పేరుతో దండయాత్ర చేస్తున్నారని, ఆ యాత్రను ఎలా తిప్పి కొట్టాలనే దానిపై జేఏసీ ఏర్పాటు చేశారన్నారు. పంచాయతీ నిధులను మళ్లిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, జన్మభూమి కమిటీల పేరుతో పంచాయతీలను నిర్వీర్యం చేసింది టీడీపీయే అని అన్నారు. సర్పంచ్ లకు ఉన్న అధికారాలను జన్మ భూమి కమిటీల పేరుతో లాక్కున్నారని, సీఎం జగన్మోహన్ రెడ్డి వచ్చాక విప్లవాత్మకమైన మార్పులను గ్రామాల్లో తీసుకువచ్చారన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారని, 12 మంది సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలకు కావాల్సిన ఏర్పాట్లు చేశారని, గ్రామ సచివాలయం ద్వారా పరిపాలన ప్రజలకు మరింత చేరువ చేశామన్నారు. రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామని, పంచాయతీలు కరెంట్ బిల్లులు కట్టకపోతే డిస్కమ్‌లు మనుగడ సాగించేది ఎలా అని ప్రశ్నించారు.

# కుల, మతాలతో బీజేపీ దేశ విభజన: ఖర్గే

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :** కుల, మతాలతో బీజేపీ విభజన రాజకీయాలు చేస్తోందని ఏఐసీసీ అధ్యక్ష అభ్యర్థి మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీ చేసే అరుదైన అవకాశం తనకు వచ్చిందని, తనను ఎన్నుకుంటే.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేస్తున్నానని, ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాలకూ వచ్చినట్లు తెలిపారు. శనివారం హైదరాబాద్ వచ్చిన ఖర్గే మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఏపీపీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్, సీనియర్ నేతలు కేవీపీ రామచంద్రరావు, కొప్పుల రాజు, జేడీ శీలం, గిడుగు రుద్రరాజు, మస్తాన్ వలి, తులసీరెడ్డి, హర్షకుమార్ తదితరులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తీసుకువచ్చారు. ఏపీ పక్షాన కర్నూలులో ఏర్పాటు చేసే ఎన్నికల కేంద్రంలో 350 మంది పీసీసీ డెలిగేట్లు ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈసందర్భంగా ఆంధ్రరత్న భవన్‌లో సీనియర్ నాయకులతో ఖర్గే ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ నెల 17న జరిగే ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల ప్రచారం కోసం తాను విజయవాడ వచ్చానని, అందరూ మద్దతు తెలిపాలని, పార్టీ బలోపేతం కోసం పని చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సుదీర్ఘ కాలంపాటు కర్ణాటకలో రాజకీయం చేశానని, 2009లో సోనియా గాంధీ సూచనల మేరకు లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసినట్లు చెప్పుకొచ్చారు. సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండడానికి నిరాకరించడంతో ఎన్నిక అనివార్యమైందని, అధ్యక్ష స్థానంలో గాంధీ కుటుంబం వ్యక్తులు లేకపోవడం బాధాకరమన్నారు. అందరి సూచనల మేరకు అధ్యక్ష స్థానానికి అభ్యర్థిగా నిలిచానని, ఏపీ నుంచి వచ్చిన వాళ్లు దేశాన్ని నిర్దేశనం చేశారన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడే బలం తనకివ్వాలని కోరుతున్నానని, ఉదయ్‌పూర్ డిక్లరేషన్ అమలు చేస్తానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 50 శాతం సీట్లను 50 ఏళ్ల వయసులోపు వారికే ఇస్తామని, యువతను ప్రోత్సహిస్తామన్నారు. రూపాయి మారకం విలువ దారుణంగా పడిపోయిందని, కుల, మతాల వారీగా బీజేపీ దేశాన్ని విభజిస్తోందని విమర్శించారు. భారత్ తోడో యాత్ర అని విమర్శలు చేయడం సరికాదని, మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడేందుకే రాహుల్ గాంధీ యాత్ర చేపట్టినట్లు చెప్పారు. దేశం కోసం బీజేపీ, ఆరెస్సెస్ నేతలు ఎటువంటి త్యాగాలు చేయలేదని, ఇందిరా, రాజీవ్ వంటి వారు దేశం కోసం ప్రాణ త్యాగం చేశారనే విషయాన్ని ప్రజలు కూడా తెలుసుకోవాలని ఖర్గే గుర్తు చేశారు.

## నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి

- ఎస్ఆర్ఎం స్నాతకోత్సవంలో డాక్టర్ చంద్రశేఖర్
- 1147 మంది విద్యార్థులకు డిగ్రీలు, 22 మందికి బంగారు పతకాల ప్రదానం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఇంజినీరింగ్ పట్టభద్రులైన విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ సూచించారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, దేశ సమగ్రత, ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసే వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రగామిగా నిలపాలని అన్నారు. ప్రపంచ దేశాలన్నింటిలోనూ కోవిడ్‌కు ముందు, తర్వాత జీవన విధానంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయనీ, ఈ పరిణామం వల్ల భారత్‌లో పరిశోధనా రంగం ఎంతో మెరుగైందన్నారు. ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు, విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలన్నారు. అన్ని దేశాల కంటే ముందుగా కోవిడ్ వ్యాక్సిన్‌ను తయారు చేసి వంద దేశాలకు పైగా ఎగుమతి చేసిన ఘనత భారత్‌కే దక్కిందన్నారు. దేశ గౌరవాన్ని, ప్రతిష్ఠనూ పెంచాలని పిలుపునిచ్చారు.

యూనివర్సిటీ వ్యవస్థాపక కులపతి డాక్టర్ టీఆర్ పారివేందర్ మాట్లాడుతూ, పట్టభద్రులైన విద్యార్థులు నిత్యం ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూ ఉన్నతంగా ఎదగాలన్నారు. పోటీతత్వాన్ని అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ మాట్లాడుతూ, కొత్త లక్ష్యాలు, విజన్‌తో విద్యార్థులు ఉన్నతులుగా మారి యూనివర్సిటీకి, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మనోజ్ ఆరోరా మాట్లాడుతూ, 1147 మంది విద్యార్థులకు డిగ్రీలు, ప్రతిభ కనబరచిన 22 మందికి బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నామన్నారు. ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ రాధాకృష్ణన్ అనివార్య కారణాల వల్ల రాలేపోవడంతో ఆయన పంపిన సందేశాన్ని యూనివర్సిటీ సలహాదారు ఆచార్య వజ్జా సాంబశివరావు చదివి వినిపించారు. మైలు రాళ్ల వంటి స్నాతకోత్సవాలు విద్యార్థుల లక్ష్యాలను నిర్దేశిస్తూ ఉంటాయని పేర్కొన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమకుమార్, డీన్లు వినాయక్ కల్లూరి, డాక్టర్ బీవీ బాబు, ప్రొఫెసర్ చౌదరి, ప్రొఫెసర్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఏఎస్‌ల బదిలీ ట్రైనీలకు పోస్టింగులు

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** ఏపీలో కొందరు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సివిల్ సప్లయిస్ డైరెక్టర్‌గా విజయ సునీత, గ్రామ, వార్డు సచివాలయాల అదనపు డైరెక్టర్‌గా భావన, శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్‌గా మల్లారపు నవీన్, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా సి.విష్ణు చరణ్, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్‌గా నిధి మీనా, ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్‌గా కట్టా సింహాచలం బదిలీ అయ్యారు. మరోవైపు 2020 బ్యాచ్ ట్రైనింగ్ ఐఏఎస్‌లకు కూడా ప్రభుత్వం పోస్టింగులు ఇచ్చింది. తెనాలి సబ్ కలెక్టర్‌గా గీతాంజలి శర్మ, రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా శుభం బన్సల్, నరసాపురం సబ్ కలెక్టర్‌గా మల్లవరపు సూర్యతేజ, టెక్కలి సబ్ కలెక్టర్‌గా రవికుమార్ రెడ్డి, పాలకొండ సబ్ కలెక్టర్‌గా నూరుల్ కుమిర్, ఆదోని సబ్ కలెక్టర్‌గా అభిషేక్ కుమార్, విజయవాడ సబ్ కలెక్టర్‌గా అథితిసింగ్, పెనుకొండ సబ్ కలెక్టర్‌గా కార్తీక్, గూడూరు సబ్ కలెక్టర్‌గా శోభిక, కందుకూరు సబ్ కలెక్టర్‌గా మాధవన్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

### 'బండి'ని అలా వదిలేయకండి...

## ఎర్రగడ్డలో చూపించండి!

**విశాలాంధ్ర-హైదరాబాద్:** 'బండిని ఇలాగే వదిలేయకండి... మతి లేని మాటలతో సమాజానికి ప్రమాదకరంగా తయారయ్యాడు. పిచ్చి ముదిరి... తొందర్లో కరవడం కూడా షురూ చేస్తడేమో.. ఎర్రగడ్డలో ఆయన కోసం బెడ్ సిద్ధం. తొందరగా చూపించండి' అంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు. మునుగోడు ఉప ఎన్నిక వేళ టీఆర్ఎస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. వ్యక్తిగత, రాజకీయ విమర్శలతో తగ్గేదేలేదంటున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కుటుంబ సమేతంగా తాంత్రిక పూజలు చేసి ద్రవాలను తీసుకెళ్లి కాళేశ్వరంలో కలిపారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి కేటీఆర్ ట్విటర్ వేదికగా పై విధంగా స్పందించారు.

**బోర్డులు గుజరాత్‌కు.. బోడిగుండ్లు మనకా?**

కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఎప్పటికప్పుడు ట్విటర్ వేదికగా స్పందించే తెలంగాణమంత్రి కేటీఆర్ మరోసారి కేంద్రం నిర్ణయంపై తనదైన శైలిలో స్పందించారు. గుజరాత్‌లో కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటుపై ట్వీట్ చేశారు. బోర్డులు గుజరాత్‌కు.. బోడిగుండ్లు తెలంగాణకా? అని వ్యంగ్యంగా విమర్శించారు. మోదీ గుండెల్లో గుజరాత్.. తెలంగాణ గుండెల్లో గునపాలా? ఎన్నాళ్లీ దగా? ఇంకెన్నాళ్లీ మోసం? అంటూ ప్రశ్నలు సంధించారు.

**కేటీఆర్ ట్వీట్**

**డిసెంబర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్**

దండుమల్కాపురంలోని ఎంఎస్ఎంఈ-గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో అతి విశాలమైన, అన్ని వసతులు ఉన్న నైపుణ్య శిక్షణా కేంద్రం (స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్) డిసెంబర్ 2022కల్లా అందుబాటులోకి వస్తుందని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ విషయాన్ని తెలపడానికి సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ పార్కులు నెలకొల్పి, వాటిల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూ, వారికి ఉపాధి అవకాశాలు పెంచడమే టీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని కేటీఆర్ ప్రకటించారు. 547 ఎకరాల్లో విస్తరించి, 589 ఎంఎస్ఎంఈ యూనిట్ల స్థాపనకు వీలుగా ఏర్పాటు చేసిన దండుమల్కాపురం ఎంఎస్ఎంఈ-గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ద్వారా ప్రత్యక్షంగా 20 వేల మందికి, పరోక్షంగా 16 వేల మందికి ఉపాధి లభిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# విశాఖ ఉక్కు ప్రజల సంపద

### 604వ రోజుకు రిలే దీక్షలు

**విశాలాంధ్ర-కూర్మన్నపాలెం:** విశాఖ ఉక్కు ప్రజల సంపదని, కార్పొరేట్‌లకు కట్టబెడితే చూస్తూ ఊరుకోబోమని పోరాట కమిటీ చైర్మన్ డీ ఆదినారాయణ హెచ్చరించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు శనివారం నాటికి 604వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మాట్లాడుతూ, ఎన్నో ఉద్యమాలు, 32 మంది ప్రాణ త్యాగాలతో ఉక్కు కర్మాగారాన్ని సాధించుకున్నామన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. పూర్తి సామర్థ్యంతో పరిశ్రమను నడిపించాలే గానీ ప్లాంట్‌ను సహజమరణం దిశగా నెట్టే ప్రయత్నం చేస్తే సహించేది లేదన్నారు. గతేడాది దాదాపు 950 కోట్ల నికర లాభలతో 28 వేల కోట్ల పైచిలుకు టర్నోవర్ చేసిన పరిశ్రమను కేవలం కొద్ది నెలల్లో నష్టాల దిశగా నెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో కోకింగ్ కోల్, బాయిలర్ కోల్ వంటి ముడిసరుకులు కొనుగోలు చేయకుండా నెలలు తరబడి బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో ఉత్పత్తి నిలిపివేసి నష్టాల దిశగా కంపెనీని నేడుపుతున్నారని ఆరోపించారు. నష్టాలను సాకు చూపి ప్రైవేట్ వ్యక్తులకు కారుచౌకగా అప్పజెప్పాలని కేంద్రం చేసే కుట్రను తిప్పి కొడతామని హెచ్చరించారు. లక్ష మందికి అన్నం పెట్టే పరిశ్రమను మూసి వేసే దిశగా ప్రణాళికలు రచించడం హర్షణీయం కాదన్నారు. బాలారిష్టాలను అధిగమించి 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి ఎదిగిన పరిశ్రమను పరిరక్షించుకుంటామన్నారు. దీక్షల్లో కోక్ ఓవెన్ ఉద్యోగులు కూర్చున్నారు. తాండ్ర కనకరాజు,కొల్లి నాగేశ్వరరావు, బి.సుబ్బారావు, జగదీశ్ పి.శ్రీను, లోకేశ్ ఎం. శ్రీనివాసు,బాబురావు, శివరామ కృష్ణ, జ్యోతి ప్రసాద్, మస్తన్నప్ప, రామక్రిష్ణ, డి.శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లను బిచ్చగాళ్లుగా చూస్తున్న సర్కార్

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** రాష్ట్రంలో పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆర్థిక సంఘం నిధుల మళ్లింపుతో పంచాయతీలు తమ ఉనికి కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా తమకు లభించిన హక్కుల కోసం పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు చేపట్టిన నిరసనలను ప్రభుత్వం అణిచివేయడం దారుణమన్నారు. సమస్యపై గళమెత్తిన సర్పంచ్‌లపై కేసులు, నిర్బంధాలు ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనంగా పేర్కొన్నారు. సర్పంచ్‌ల సంఘం డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని...అవి వారి హక్కులని గుర్తించాలన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థలతో పాటు, గ్రామీణ వ్యవస్థలో కీలకమైన పంచాయతీలు కూడా నాశనం అవుతున్నాయనీ, ప్రభుత్వం దారి మళ్లించిన 14,15 ఆర్థిక సంఘం నిధులు రూ. 8700 కోట్లు తిరిగి గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. 2014 తరువాత తమ ప్రభుత్వ హయాంలో దాదాపు 36 వేల కోట్ల 14వ ఆర్థిక సంఘం నిధులు, నరేగా నిధులు పంచాయతీలకే ఇచ్చామనీ, వీటి ద్వారానే సర్పంచ్‌లు గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. తద్వారా గ్రామాలలో సర్పంచ్‌ల గౌరవాన్ని పెంచామనీ, అలాంటిది ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌లను బిచ్చగాళ్లలా చూస్తున్న వైఖరి దారుణమన్నారు. ప్రభుత్వం ఇకనైనా తన తప్పుదిద్దుకుని ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలనీ, హక్కుల కోసం పోరాడుతున్న సర్పంచ్‌లపై నిర్బంధాలు, కేసులు వెనక్కి తీసుకోవాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

## గవర్నర్ ఈద్ మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన ఈద్ మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త జీవితం మానవాళికి ప్రేమ, సౌభ్రాతృత్వం, ధర్మం బోధిస్తుందన్నారు. మనం తోటి ప్రజలకు విశ్వాసం, నమ్మకం, శ్రద్ధ, కరుణతో సేవ చేసినప్పుడు ప్రవక్త లక్ష్యం నెరవేరుతుందని గవర్నర్ పేర్కొన్నారు. ఈద్ మిలాద్-ఉన్-నబీ శుభదినం దయ, కరుణతో పాటు పవిత్ర ప్రవక్త బోధనలను గుర్తు చేస్తుందన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం అందరిలో శాంతి, సద్భావనలను కలిగిస్తుందన్నారు. ఈ మేరకు రాజ్ భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

## తక్షణమే డీఏ బకాయిలు విడుదల చేయాలి

ఎస్టీయూ డిమాండ్

**విశాలాంధ్ర-గుంటూరు:** రాష్ట్రంలో 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఎదురుచూస్తున్న రెండు విడతల కరువు భత్యం(డీఏ) 6.37 శాతం బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ గుంటూరు జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశం మల్లయ్య లింగం భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గేరా మోహన్‌రావు అధ్యక్షతన శనివారం జరిగింది. సాయి శ్రీనివాస్, తిమ్మన్న మాట్లాడుతూ 2022 జనవరి 1 నుంచి 2.73 శాతం, 2022 జులై 1 నుంచి 3.64 శాతం మొత్తం 6.37 శాతం కరువు భత్యాన్ని వెంటనే ప్రకటించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ సంఘ నిర్మాణానికి ఉపాధ్యాయులు, కార్యవర్గ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల విషయంలో అస్పష్టతను తొలగించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రధానోపాధ్యాయులకు డ్రాయింగ్ అధికారాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ పెండింగ్ బిల్లులన్నింటినీ వెంటనే మంజూరు చేయాలని, గురుకుల, ఎయిడెడ్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. గేరా మోహన్‌రావు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ.అంబరీష్యుడు, రాష్ట్ర కార్యదర్శి కాకుమాను జోజప్ప, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు వాసిమళ్ల ప్రసాదరావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ సీహెచ్ ఉమ, జిల్లా మహిళా కన్వీనర్ పి.రమాదేవి, ఏరియా కార్యదర్శులు కొరివి అనిల్ కుమార్, డీవీ సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు జి.జోజప్ప, శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## చిన్నారుల్లో మేధోశక్తికి చదరంగం దోహదం: కోలగట్ల

**విశాలాంధ్ర-విజయనగరంటౌన్:** చిన్నారుల్లో మేధోశక్తిని పెంపొందించేందుకు చదరంగం దోహదపడుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. శనివారం విజయనగరంలోని స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో జాతీయస్థాయి చదరంగం పోటీలు జరిగాయి. శ్రీ చెస్ అసోసియేషన్ అధ్వర్యంలో జాతీయ స్థాయిలో చదరంగం పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ జాతీయస్థాయిలో చదరంగం పోటీలు నగరంలో జరగడం ఆనందంగా ఉందన్నారు. పిల్లలను చదరంగం ఆడించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో విజేతగా రాణించాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ చదరంగం మంచి స్ఫూర్తినిచ్చే క్రీడన్నారు. మెదడు చురుకుతనానికి, తెలివితేటలు పెరగడానికి చదరంగం ఎంతో దోహదపడుతుందన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ చదరంగానికి ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. చిన్నతనం నుండే తర్ఫీదు పొందినట్లయితే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చునని తెలిపారు. నగర మేయర్ విజయలక్ష్మీ, చెస్ టోర్నమెంట్ చైర్మన్ బీశెట్టి బాబ్జి, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# 'చంద్రయాన్' ప్రయోగాలు గర్వకారణం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- ముగిసిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్:** సీతం ఇంజినీరింగ్ కళాశాలలో షార్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు శనివారంతో దిగ్విజయంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో జిల్లా నలుమూలల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 100 మంది, ఎక్స్‌పోర్ పోటీలలో వివిధ కళాశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. షార్ బృందం ప్రదర్శించిన షార్ విధివిధులు, రాకెట్ లాంచింగ్ , శాటిలైట్ తయారీ-వాటి ఉపయోగాలు, షార్ శాస్త్రవేత్తలు కృషికి సంబంధించిన వీడియోలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, షార్ ప్రతినిధిగా చీఫ్ జనరల్ మేనేజర్ డా.టి.వి. రమణా రెడ్డి, అతిథిగా జేఎన్‌టీయు కాకినాడ వైస్ ఛాన్సలర్ డా.జి.వి.ఆర్.ప్రసాదరాజు, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.వి. కట్టిమణి విచ్చేశారు.

మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ, పురోభివృద్ధిలో మనం ఎక్కడ ఉన్నామో తెలుసుకోవడానికి ఇటువంటి సెలబ్రేషన్స్ దోహదపడతాయని, చంద్రయాన్ వంటి ప్రయోగాలు మనకు ఎంతో గర్వకారణమని అన్నారు. అంతరిక్షంలో వ్యర్థాలను తగ్గించడానికి తగిన కృషి చేయాలన్నారు. విద్యార్థులు, ప్రజల్లోనూ అంతరిక్షం, శాటిలైట్‌లపై అవగాహన కల్పించడానికి చేస్తున్న ఈ ప్రయత్నం అభినందించదగినదన్నారు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తయారు చేయడానికి ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రమణారెడ్డి మాట్లాడుతూ, షార్ ముఖ్య ఉద్దేశ్యం దేశాభివృద్ధికి అవసరమైన ఆవిష్కరణలు చేయడమేనని,అంతరిక్షంను మనం సద్వినియోగం చేసుకోవాలని దానికోసం విద్యార్థులు నుండి శాస్త్రవేత్తలు పుట్టాలని అన్నారు. ప్రసాదరాజు మాట్లాడుతూ, విద్యార్థులకు స్ఫూర్తి కలిగించే ఇటువంటి కార్యక్రమాలు జరగడం ముదావహమన్నారు.

సీతం సిబ్బంది, విద్యార్థుల సహకారం అభినందనీయమని, విద్యార్థులలో అంతరిక్ష పరిజ్ఞానంపై ఆసక్తి పెంచడంలో షార్ సఫలీకృతం అయిందని ఆశిస్తున్నామని బృందం ప్రతినిధి జి.అప్పన్న అన్నారు. మూడు రోజుల్లో అంతరిక్షం, శాటిలైట్ లు, రాకెట్ లాంచింగ్, వివిధ రకాల శాటిలైట్ లాంఛ్ వెహికల్స్ గురించి తాము ఎన్నో విషయాలు తెలుసుకున్నామని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులందరికీ ప్రాజెక్ట్ చేయడంలోనూ, ఉద్యోగావకాశాలు కల్పించడం లోనూ ఇస్రో సహాయ సహకారాలు అందించాలని కళాశాల సెక్రటరీ- కరస్పాండెంట్ బొత్స ఝాన్సీ లక్ష్మి అన్నారు. ఇటువంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థులు ఉత్తేజితం అవుతారని కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణ రావు పేర్కొన్నారు. ప్రొఫెసర్ కట్టిమణి మాట్లాడుతూ, టెక్నాలజీలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. డిఆర్‌ఓ ఎం.గణపతి రావు మాట్లాడుతూ, ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ రామ్మూర్తి మాట్లాడుతూ, షార్ కార్యక్రమంలో తాము పాలుపంచుకోవడం గర్వించదగ్గ విషయం అని అన్నారు. షార్ బృందం సభ్యులు ప్రసాద్, సత్య సాయిమధు, కుమర, ఆదినారాయణ, ప్రభాకర్ చైతన్య, లవకుశ, పైడిరాజు పాల్గొన్నారు.

సంపాదకీయం

# నడ్డి విరుస్తున్న పేదరికం

మన దేశం పేదది కాదు, ప్రజలే పేదలు అన్న మాట ఎప్పటి నుంచో వింటున్నాం. ప్రజలు పేదలుగా ఉన్నంత కాలం దేశం పేదది కాకుండా ఎలా పోతుంది అన్న ప్రశ్న ఎవరి మదిలోనైనా మెదలుతుంది. కానీ మన దేశంలోని పరిస్థితినిబట్టి పేద ప్రజలు అపారంగా ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నూటికి 70 మంది పేదలున్నారని అంచనా. ఆ తరవాత 75 ఏళ్ల తరవాతా 30 శాతం మంది పేదరికంలోనే కునారిల్లిపోతున్నారు. ఓ పదేళ్ల కాలంలో 27 కోట్ల 30 లక్షల మంది పేదరికం నుంచి బయట పడిన మాటా వాస్తవమే. 2011లో దేశంలో నిరుపేదలు జనాభాలో 22.5 శాతం ఉంటే 2019కల్లా వారి సంఖ్య 10.25 శాతానికి తగ్గడం ఆనందదాయకమైందే అనుకోవచ్చు. కానీ కరోనా కష్ట కాలంలో పేదరికంలోకి జారుకున్న మొత్తం ప్రపంచ జనాభాలో మన దేశంలోనే అలాంటి వారు 80 శాతం మంది ఉన్నారని ప్రపంచ బ్యాంకు క్రోడీకరించిన లెక్కల్లో తేలింది. కరోనా కాటేయక ముందు దేశంలో ఆరున్నర కోట్ల మంది నిరుపేదలున్నారనేది మరో అంచనా. కానీ కరోనా మహమ్మారి ప్రభావంవల్ల నిరుపేదల సంఖ్య 10 కోట్ల నుంచి 12 కోట్ల దాకా పెరిగిందనేది వాస్తవం. మొత్తం ప్రపంచంలో ఏడు కోట్ల మంది కరోనా కాటుకు పేదరికంలోకి జారుకుంటే అందులో 5.6 కోట్ల మంది మన దేశవాసులే. దీన్నిబట్టి పేదరికంలో మనదే అగ్రస్థానం అని రూఢి అవుతోంది. కరోనాను అదుపు చేయడంలో అద్భుతాలు సృష్టించామని మోదీ సర్కారు ఎంత బాకా ఊదినప్పటికీ వాస్తవ పరిస్థితి అత్యంత నిరాశాజనకంగానే కాదు, భయానకంగా మారుతోంది. 2019లో ప్రపంచ వ్యాప్తంగా నిరుపేదలు 8.4 శాతం ఉంటే కరోనా మహమ్మారి కారణంగా నిరుపేదల సంఖ్య 2020లో 9.3 శాతానికి చేరింది. అంటే విశ్వవ్యాప్తంగా పేదరిక నిర్మూలనకు జరుగుతున్న కృషి కరోనా వల్ల మరింత అధ్వాన స్థితికి దిగజారింది. ఈ కాలంలో పెరిగిన పేదలు ఏడు కోట్ల మంది. దీనితో ప్రపంచ పేదలు 70 కోట్లకు చేరారు. 2022 నాటి పేదరికం, సంపదలో వాటా: సరిదిద్దే మార్గాలు అని ప్రపంచ బ్యాంకు రూపొందించిన నివేదికలో ఈ భయానక వాస్తవాలు వెలికి వచ్చాయి. అయితే భారత్‌లో పేదరికాన్ని అంచనా వేయడానికి ప్రపంచ బ్యాంకుకు అధికారిక సమాచారం ఏదీ అందుబాటులో లేదు. 2011 నుంచి భారత ప్రభుత్వం పేదరికానికి సంబంధించిన సమాచారాన్ని అధికారికంగా ప్రకటించడం మానేసింది. అందువల్ల ప్రపంచ బ్యాంకు ఇతర మార్గాల ద్వారా అందిన సమాచారం ఆధారంగా కరోనా వల్ల ప్రపంచంలోనూ, భారత్ లోనూ పేదరికం ఏ మేరకు పెరిగిందో అంచనా వేయడానికి ప్రపంచ బ్యాంకు ప్రయత్నించింది. అధికారిక సమాచారం అందుబాటులో లేనందువల్ల సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సి.ఎం.ఐ.ఇ. - భారత ఆర్థిక వ్యవస్థను పరిశీలించే వ్యవస్థ) సేకరించిన సమాచారాన్ని, కన్స్యూమర్ పిరమిడ్స్ హౌజ్ హోల్డ్ సర్వే (సి.పి.హెచ్.ఎస్.) సమాచారాన్ని వినియోగించుకుని కరోనా కారణంగా పేదలైపోయిన ప్రపంచ పేదల్లో భారత్‌లోనే 80 శాతం మంది ఉన్నారని తేల్చింది.

పేదరికానికి సంబంధించిన సమాచారాన్ని వెల్లడించడం ఆపేసిన పదకొండేళ్ల కాలంలో ఎనిమిదేళ్ల నుంచి మోదీ సర్కారే అధికారంలో ఉంది. కరోనాను ఎదుర్కోవడంలో ఎంతో చేశామని, టీకాలు వేయించడంలో ప్రపంచ రికార్డు మనదేనని మోదీ సర్కారు ప్రచార బాకా నిరంతరం కొనసాగుతూనే ఉంది. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం తీసుకునే చర్యలకు తోడుగా స్వచ్ఛంద సంస్థలు కూడా యథాశక్తి పాటు పడుతుంటాయి. సమాచారం అరకొరగా ఉన్నప్పుడు పేదరిక నిర్మూలనకు అనుసరించవలసిన మార్గాలు కూడా కుంచించుకుపోతాయి. పేదరికం మన దేశంలోనూ నెమ్మదిగానైనా తగ్గుతోంది. అయితే కరోనా పేదలనే గట్టిగా కాటేసింది. గ్రామీణ ప్రాంతాలలో పేదరికం తగ్గుముఖం పడ్తోంది. అయితే ఈ తగ్గుదల అంచనాలను ఎందుకూ కొరగాకుండా చేసింది. సహజంగానే కరోనావల్ల పేదల ఆదాయం బాగా తగ్గిపోయింది. మరో వైపరీత్యం ఏమి టంటే కరోనా కాలంలోనూ సంపన్నులు మరింత సంపన్నులు అయి పోవడం మాత్రం ఆగలేదు. పైగా అనూహ్యమైన లాభాలు నొల్లుకున్నారు. అదానీ ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానానికి చేరుకోవడమే దీనికి నిదర్శనం. 2030కల్లా పేదరికాన్ని నిర్మూలించాలని ఐక్యరాజ్యసమితి లక్ష్య నిర్దేశం చేసింది. ఇక ఎనిమిదేళ్లైనా మిగలలేదు కనక పరిస్థితి ఎంత మాత్రం దానికి అనుగుణంగా కనిపించడం లేదు. పేదరిక విపత్తు నుంచి గట్టెక్కడానికి ప్రపంచ బ్యాంకు కొన్ని సూచనలు కూడా చేసింది. సబ్సిడీల మీద కాకుండా పేదలు నిలదొక్కుకునే రీతిలో ప్రభుత్వ వ్యయం ఉండాలన్నది అందులో ప్రధానమైన సూచన. దీర్ఘకాలిక అభివృద్ధి మీద దృష్టి నిలపాలన్నది రెండవ హితవు. అంటే ప్రభుత్వ వ్యయం దీనికి అనువుగా ఉండాలి. ఎన్నికల్లో విజయం మీద దృష్టితో తాయిలాల మీద ఉన్న ఆసక్తి మరి దేని మీదా ఏ ప్రభుత్వానికీ లేదు కనక దీర్ఘకాలిక అభివృద్ధి సాధ్యమవుతుందనుకోలేం. ఎడాపెడా తాయిలాలు ప్రకటించి ఓట్లు దండుకున్న మోదీ, ఆ మాటకొస్తే అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు అభివృద్ధి, ఉపాధి కల్పన కోసం ప్రభుత్వ నిధులు ఖర్చు పెట్టడానికి కాళ్లీడుస్తున్నాయి. అసలైన అభివృద్ధి ప్రసక్తి వచ్చేటప్పటికి ప్రభుత్వ బొక్కసం ఒట్టి పోతోంది. వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.) గురించి ఎన్ని మాటలు చెప్పినా అది పరోక్ష పన్ను కనక, జి.ఎస్.టి. సకల వస్తువులకూ వర్తిస్తుంది కనక పేదలపై దాని ప్రభావం తప్పకుండా ఉంటుంది. పేదల జేబులు ఖాళీ చేయని రీతిలో పన్నులు విధించడం ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో కుదిరే పని కాదు. 60 నెలలు అధికారం ఇస్తే మంత్ర దండం ప్రయోగించి సకల సమస్యలు అంతం చేస్తానన్న మోదీ ఇప్పుడు 2047 దాకా ఆగండి అంటున్నారంటే ఆ మాట ఎంత బూటకమో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అసమానతలు విపరీతంగా పెరుగుతున్నా పట్టించుకునే ఓపిక, శ్రద్ధ మోదీ సర్కారులో ఎంత మాత్రం కనిపించడం లేదు. పేదలు, నిరుపేదలను కలిపి లెక్క వేస్తే మన దేశంలో 40 కోట్ల మంది పేదలుగానే మిగిలిపోయారు. ప్రపంచంలో నిరుపేదలు ఎక్కువగా ఉన్న దేశాల్లో మనం రెండో స్థానంలో ఉన్నాం. మానవాభివృద్ధిలో మనం 131వ స్థానంలో కడగొట్టున మిగిలాం. అయిదేళ్ల లోపు బాలల్లో ఎదుగూ బొదుగూ లేదు. నిరుద్యోగం వికటాట్టహాసం చేస్తోంది. ఈ లెక్కన మోదీ నమ్మబలుకుతున్నట్టు 2047 నాటికైనా పేదల పరిస్థితి బాగుపడుతుందని నమ్మలేం. అదానీ లాంటి వారు అత్యంత సంపన్నుల్లో అగ్ర స్థానం అందుకోవడం ఖాయం అంటే సునాయాసంగా నమ్మొచ్చు.

# మానసిక అనారోగ్యంతో సామాజిక సమస్యలు

డా. సదానందం

మానసిక అనారోగ్యంతో అనేక సామాజిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో ఈ సమస్య వివిధ కారణాలతో ప్రపంచమంతటా వ్యాపించింది. ముఖ్యంగా మానసిక ఆరోగ్యం ఈ కింది వాటిపై ప్రభావాన్ని కలిగి ఉంటుంది.

విద్యా సంబంధిత ఫలితాలు, పనిలో ఉత్పాదకత, ప్రోత్సాహకరమైన వ్యక్తిగత బాంధ వ్యాలను పెంపొందించుకోవడం, నేరాల సంఖ్య, సూచిక, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం.

మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమైనది. 45 కోట్ల కన్నా ఎక్కువ మంది ప్రజలు మానసిక దుర్బలత్వంతో, వైకల్యంతో బాధపడుతున్నారు, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 2020 నాటికి ఒత్తిడి అనేది రెండవ అతిపెద్ద తీవ్రమైన వ్యాధిగా ఈ భారాన్ని మోయవలసి వచ్చింది. మానసిక దౌర్బల్యం అనే భారం చికిత్స చేయడానికి వీలుకానంత స్థాయికి చేరింది. పెరిగిపోతున్న ఈ మానసిక దౌర్బల్య భారంతో ముడిపడి ఉన్న సాంఘిక, ఆర్థిక భారం, మానసిక రుగ్మతలను నివారించడం పైన ఉండే అవకాశాలపై దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. ఆ విధంగా మానసిక ఆరోగ్యం మానవ ప్రవర్తనతో ముడిపడి ఉండి, శారీరక ఆరోగ్యానికి నాణ్యమైన జీవనశైలికి ప్రాథమిక అంశంగా గోచరిస్తాయి.

శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం అన్నవి దగ్గర సంబంధం కలిగి ఉన్నటువంటివి. అలాగే ఒత్తిడి, గుండె, రక్తనాడుల వ్యవస్థ సంబంధిత వ్యాధులకు నిస్సందేహంగా దారి తీస్తుందని రుజువు అయ్యింది. మానసిక వైకల్యాలు, మనుషుల ప్రవర్తనలను అంటే వివేకవంతంగా, విచక్షణతో ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, సరిపోయేంతగా నిద్ర పోవడం, ఆరోగ్యకరమైన, క్షేమకరమైన అలవాట్లను అనుసరిస్తూ ఉండటం, మత్తు పానీయాలు, పొగాకు వాడకం, వైద్య చికిత్సా నియమాలను జాగ్రత్తగా పాటిస్తూ ఉండటం వంటి వాటిపై కూడా చెడు ప్రభావాన్ని చూపిస్తూ శారీరక అనారోగ్యాన్ని పెంచుతూ హాని కలిగిస్తాయి.

మానసిక అనారోగ్యం సాంఘిక సమస్యలకు కూడా దారి తీస్తుంది. అంటే నిరుద్యోగం, విచ్ఛిన్నమయ్యే కుటుంబాలు, పేదరికం, మాదక ద్రవ్యాల వినియోగం, తత్సంబంధిత నేరాలు వంటివి. బలమైన మానసిక ఆరోగ్యం వ్యాధి నిరోధక శక్తిని పని చేయనివ్వకుండా క్షీణింపచేయటంలో చెప్పుకోదగ్గ పాత్ర వహిస్తుంది. వైద్యపరంగా ఒత్తిడి మాంద్యంతో పాటుగా అనారోగ్యంగా ఉండే రోగులు, ఇది లేకుండా మామూలుగా ఉండే వారికంటే చాలా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొంటూ ఉంటారు. దీర్ఘకాలిక వ్యాధులు- మధుమేహం, కేన్సర్, గుండె సంబంధిత సమస్యలు మొదలైనవి ఒత్తిడిని, మాంద్యాన్ని మరింత ప్రమాదకరంగా పెంచుతాయి.

అన్ని విషయాలను అంటే చదువులోనూ, ఉద్యోగంలోనూ, వివాహ విషయం మొదలగు వాటన్నింటిలో సమాజం తమను చిన్నచూపు చూస్తుందనే ఆత్మన్యూనతా భావన వైద్య సలహాలను తీసుకోవడంలో అలసత్వానికి దారి తీస్తుంది. రోగ నిర్ధారణకు స్పష్టమైన సంకేతాలు లేకపోవడం కూడా వ్యక్తిని అయోమయానికి దారితీస్తుంది. వైద్యం తీసుకోవడంలో పేషంట్లు మందులు పనిచేస్తాయో లేదో అని అనుమానం వ్యక్తమవుతున్నది. ఎన్‌జీవోలు సైతం మానసిక అనారోగ్యాన్ని ఇబ్బందికరమైనదిగా భావిస్తున్నాయి. న్యూరో ట్రాన్స్‌మీటర్, జన్యు వ్యాధులు, అంటు రోగాలు మెదడును పాడు చేయటం వంటివి తలకు గాయాలు భౌతిక కారకాలుగా నిరూపించటం అయింది. నేషనల్ మెంటల్ యాక్ట్‌లో కూడా మానసిక వైద్య విధానాలను పెంపొందిం చడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) ఎన్నో కార్యక్రమాల ద్వారా మానసిక ఆరోగ్యాన్ని అన్ని రంగాలకు విస్తరింప చేస్తున్నది. ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, ఎన్‌జీవోలు మొదలైన సంస్థలు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నవి. మానసిక వ్యాధులపై మూఢ నమ్మకాలను పారదోలి, మానసిక వైద్య నిపుణులకు చూపించాలి. శారీరక, మానసిక అనారోగ్యాలను తేడా లేకుండా ప్రజలకు అన్నీ ఒకటేననే భావన పెంపొందించాలి. తద్వారా ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ 2022 సంవత్సరానికి గాను "మెంటల్ హెల్త్ ఇన్ యాన్ అన్ ఈక్వల్ వరల్డ్" (మానసిక ఆరోగ్యం సమతుల్యం లేని ప్రపంచం) అనే నినాదాన్ని పరిపక్వం చేయడానికి ఉపయోగపడుతుంది.

(రేపు ప్రపంచ మానసిక దినోత్సవం)

వ్యాస రచయిత మానసిక వైద్యులు,
వెన్నెల మానసిక వైద్యశాల,
9395119989

# ఆత్మహత్యల్లో రోజువారీ కూలీలే అధికం

ఐ.ప్రసాదరావు

"జాతీయ నేర రికార్డ్స్ బ్యూరో (యన్.సి.ఆర్.బి) 2021 నివేదిక ప్రకారం దేశంలో 2021లో 1,64,033 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. వీరిలో 42,004 మంది రోజువారీ కూలీలే ఉన్నారు. ఆత్మహత్యల సంఖ్యలో 2014లో 12%గా ఉన్న రోజువారీ కూలీలు, 2021 నాటికి 25% ఉండుట దేనికి సంకేతం...? ఒకపక్క సెన్సెక్స్ నిఫ్టీ సూచికలు పైపైకి, మిలియన్లీర్ల సంఖ్య వేల సంఖ్యలో పెరగటం, జియస్టి వసూలు ప్రతీ నెలా లక్ష రూపాయలు పైబడి వసూలు కావటం, బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను పక్కకు నెట్టి మన దేశం ముందుకు వెళ్ళటం పైకి చూడటానికి, మాధ్యమాల్లో ముందు వరుసలో ఉండుట చూస్తూ ఉంటే మన అభివృద్ధి మేడిపండు చూడ మేలిమై ఉండు అనే చందంగా ఉంది అని అనుటలో సందేహం లేదు. కనీసం రోజుకు ఒకపూట తిండి లేని జనం కోకొల్లలుగా ఉన్నారు. ఆకలి కేకలు, పోషకాహార లోపంతో దేశంలో సగం మంది జనం ఆక్రందన చెందుతున్నట్లు చాలా నివేదికలు చెబుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకపోవడం. నిరుద్యోగం రోజు రోజుకు సరికొత్త రికార్డు సృష్టిస్తుంది. అధిక ధరలు, నిత్యావసర వస్తువులు కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు సామాన్య మానవుడి నడ్డి విరిస్తున్నాయి. దీనికి తోడు గత రెండు సంవత్సరాలుగా కోవిడ్ కారణంగా అనేక పరిశ్రమలు, నిర్మాణ రంగం కుదేలు అయింది. రోజూ వారీ పనులు, "ఈవెంట్ ఇండస్ట్రీ", పర్యాటక రంగం వంటివి నైపుణ్యత లేపి, ఓ మాదిరి నైపుణ్యం గల కార్మికులకు పనికల్పించేవిగా ఉండేవి. ఈ కరోనా కాలంలో లాక్ డవున్, కర్ఫ్యూలతో మొత్తం వ్యవస్థ చిందరవందరగా మారి, వలస కూలీల బతుకులు దుర్భరం అవుతున్నాయి. దిక్కుతోచని పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. క్రెడిట్ కార్డులు వినియోగం, లోన్ యాప్‌లు వాడుతూ తిరిగి చెల్లించే పరిస్థితి లేక వందలకొద్దీ ప్రజలు బతుకులు ముగించుట మనం కళ్ళారా చూస్తూనే ఉన్నాము.

2021 ఆత్మహత్యల విశ్లేషణ చేస్తే 25.6% మంది రోజువారీ కూలీలే, 14.1% గృహిణిలు, 12.3% స్వయం ఉపాధి పొందుతున్న వారు, 9.7% వేతన జీవులు, 8.4% నిరుద్యోగులు, 8% స్టూడెంట్స్, 6.6% రైతులు, 0.9% పదవీ విరమణ చేసి వారు, మిగిలిన 14% ఇతర వర్గాలకు చెందిన వారు. సాక్షాత్తు దేశరాజధాని న్యూఢిల్లీలో ఒక సెంటర్ కళ్యాణీ పూరీ జాలేబ్ చౌక్ వద్ద ఉదయాన్నే 200 మంది పనులు కోసం గుమిగూడి ఉంటారు. కేవలం ఒకరికి లేదా ఇద్దరికి మాత్రమే పని దొరుకుతుంది. మిగిలినవారు అంతా నిరాశతో వెను దిరుగుతున్నారు. ఆకలితో పడుకుంటున్నారు అని సమాచారం. వారానికి కనీసం రెండు రోజులు కూడా పని దొరకడం లేదు. కోవిడ్ అనంతరం కూడా నేటికీ అన్ని రంగాలు పూర్తి స్థాయిలో పని ప్రారంభం కాలేదు. అదే సమయంలో స్వస్థలాలకు వెళ్ళిన వలస కార్మికులు అనేక మంది అక్కడే ఉంటున్నారు. దీంతో వ్యవసాయ రంగంలో పనులు చేయడం వల్ల ప్రచ్ఛన్న నిరుద్యోగం పడగ విప్పింది. కష్టానికి తగ్గ వేతనాలు రాక, కుటుంబాలు పోషించడం కత్తి మీద సాములా తయారైంది. దీంతో పిల్లల చదువులు కొండెక్కినాయి. వివిధ రకాల అనారోగ్యాలు, తల్లిదండ్రుల సంరక్షణ వేతన జీవులపై పెనుప్రభావం చూపుతూ, నిస్సహాయ స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 32 శాతం కుటుంబ సమస్యలతో, ముఖ్యంగా ఒడిషాలో 4033 మంది అతి ఎక్కువగా కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నారు. అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నవారు పంజాబ్, సిక్కింలో అధికంగా ఉన్నారు. మొత్తం ఆత్మహత్యల్లో ఎక్కువగా 1,09,749 మంది వివాహితులు. మహారాష్ట్రలో అధికంగా 22,207 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 72% పురుషులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అదే సమయంలో మహిళలు 27% శాతం ఉంటున్నారు. 2020 నుంచి 2021 నాటికి 7.2% శాతం ఆత్మహత్యలు పెరిగాయి అని నివేదికలు చెబుతున్నాయి.

జాతీయ ఆహార భద్రత చట్టం కింద ప్రభుత్వాలు ఇచ్చిన ఆహార ధాన్యాలు కొంతమందికే అందాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఇచ్చుట వలన ఈ దశాబ్ద కాలంలో పెరిగిన జనాభాకు ఆహార ధాన్యాలు అందకపోవడంతో ఆకలి బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అని నివేదికలు చెబుతున్నాయి. జే.యన్.యు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ.ఆర్.చౌదరీ మాట్లాడుతూ "రోజువారీ కూలీల బతుకులు చిందరవందర అయ్యాయి అని, నిర్మాణ రంగం కుదేలై పనులు దొరక్క వీరి జీవితాలు దుర్భరం అవుతున్నాయి అని తెలిపారు. కేవలం ఈ ఏప్రిల్-జూలై నెలల మధ్య కాలంలో నిర్మాణం రంగం 15% వేగం మంద గించింది. ఇటువంటి పరిస్థితుల్లో దేశ వ్యాప్తంగా "పట్టణ ఉపాధి హామీ పథకం" అమలు చేసి, ప్రతీ ఒక్కరికీ పని కల్పించాలి అని పలువురు కోరుతున్నారు. ఆత్మ నిర్భర్ భారత్, గతిశక్తి వంటి పథకాల ద్వారా "యమ్.యస్.యమ్.ఇ" పరిశ్రమ లను బలోపేతం చేయాలి. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలి. పైపై అభివృద్ధి సూచికలు చూసి మురిసిపోకుండా, వాస్తవంగా దేశంలో ఉన్న పేద మధ్యతరగతి సామాన్య ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులు గుర్తించి, వారి అభివృద్ధికి కృషి చేయాలి. విద్య, వైద్య రంగాలకు నిధులు ఎక్కువగా కేటాయించి ఖర్చు చేయాలి. ప్రజల అందరికీ సామాజిక, ఆర్థిక భద్రత అందించటానికి ఇకనైనా పటిష్ట ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. పన్నుల వ్యవస్థ పునః సమీక్ష చేయాలి. స్వాతంత్ర్య సమర యోధులు, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ప్రజాస్వామ్య లౌకిక సామ్య వాద సమాఖ్య వ్యవస్థ నిర్మించడమే నేటి పాలకుల భుజస్కంధాలపై ఉన్న అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం. దేశ శతాబ్ది ఉత్సవాలనాటికైనా భారత ప్రజలందరికీ కూడు గుడ్డ గూడు అందించడానికి నేటి పాలకులు కంకణం కట్టుకోవాలి. అదే మన అందరి ఆశయం కావాలి.

వ్యాస రచయిత సెల్ 6305682733

# ఇందులేడందు లేడని సందేహం వలదు



డాక్టర్ దేవరాజు మహారాజు

కేంద్రప్రభుత్వ విధానాల్ని దేశ ప్రజలు నిశితంగా అర్థం చేసుకోవాల్సి ఉంది. గుడికి నువ్వు లక్ష రూపాయల విరాళ మిచ్చినా నిన్ను అక్కడ కేవలం భక్తుడిగానే గుర్తిస్తారు. అదే డబ్బు బయట పేదవారికి పంచి చూడు. వారు నిన్ను "దేవుణ్ణి" చేస్తారు. దేవుడు అంటే నిజంగా ఇక్కడ దేవుడు ఉన్నాడని కాదు. అత్యున్నతమైన గౌరవ భావంతో చూడడం. మనుషులుగా మనుషులకు పనికొచ్చే పని చేద్దామా? మనుషులమన్నది మరిచి పేదల ఇండ్లపైకి బుల్‌డోజర్లు పంపి కూల్చేద్దామా? ఏది మానవత్వం? హనుమాన్ ఎవరు? రామాయణ కావ్యంలో రాముడి పాత్రకు బానిసగా బతికిన పాత్ర. ఆ బానిసకు సంబంధించిన చాలీసా పఠిస్తూ శోభాయాత్రలు తీస్తూ బానిసకు బానిసలుగా బతకడమే జీవిత ధ్యేయమా? "ఇందులేడందు లేడని సందేహము వలదు! ఎందెందు వెదకి చూసిన-అందందే లేడు చక్రి!" అనేది వాస్తవం!

ఈ మధ్యన ఎటు చూసిన ఎన్నెన్నో చోద్యమ్ములు
విద్యాధిక వర్గంలో వింత వింత దృశ్యమ్ములు
టెంకాయల లంచంతో దేవునికి పిటిషన్లు
తలనీలాలిస్తామని తిరుగులేని అగ్రిమెంట్లు
- గజ్జెల మల్లారెడ్డి

కొబ్బరికాయ కొనేప్పుడు అందులో నీళ్ళున్నాయో లేదో అని చెవి దగ్గర కాయను ఊపి ఊపి నీళ్ళ శబ్దం వినడానికి ప్రయత్నిస్తారు. అదేం చిత్రమో కానీ ఆ కొబ్బరికాయ కొట్టే దేవుడు ఆ విగ్రహంలో ఉన్నాడో లేడో అని మాత్రం తెల్సుకోరు. ఏ నిర్ధారణ, నిరూపణ లేకుండానే నమ్మేస్తారు. మనువాదుల కుట్రకు బలై ఆ భావజాలాన్ని స్వీకరిస్తారు. అంతేకాదు దేవుడనేవాడు విగ్రహంలోనే కాదు ఎక్కడైనా ఉంటాడు అనే అంధ విశ్వాసంలో కూరుకుపోతారు. "ఇందుగలడందు లేడని సందేహము వలదు" అనే నమ్మకంలో కొట్టుకుపోతుంటారు.

"రాముడు దేవుడు కాదు" అని ప్రకటించారు బిహార్ మాజీ ముఖ్యమంత్రి జితిన్ రాం మాంఝీ. ఆ పేరు కేవలం ఒక కల్పిత పాత్రది మాత్రమేనని, ఆ పాత్రను సృష్టించుకున్న వాల్మీకి, తులసీదాస్ వంటి కవులు కావ్యాలు రాశారు తప్ప నిజానికి శ్రీరామచంద్రుడనేవాడు ఎప్పుడూ, ఏ కాలంలోనూ, ఏ ప్రాంతంలోనూ బతికి లేడని ఆయన వివరణ ఇచ్చారు. కవులుగా వారిని గౌరవించుకోవచ్చు. కాల్పనిక రచనలుగా వారి రచనల్ని విశ్లేషించుకోవచ్చు. అంతేగానీ ఒక కల్పిత పాత్రను గౌరవించడమేమిటి? పూజించడమేమిటీ? ఉత్సవాలు-పండుగలు జరుపుకోవడమేమిటీ? అని ఆయన ప్రశ్నించారు. పైగా మరో మాట కూడా అన్నారు. మన ముందు తరం వారికి ఉన్నన్ని అవకాశాలు లేవు. మనం సాధించినంత ప్రగతి సాధించలేకపోయారు. అది అలా వదిలేసి మన తరం కొత్తగా, హేతుబద్ధంగా ఆలోచించాలి కదా? ముందు తరం వారికి మెదడు పనిచేయకపోతే పోయింది. ఇప్పుడు ఈ కాలం మనుషులకు ఏమైందీ? అదే మూఢత్వం కొనసాగిస్తూ ఉంటారా? అని ఆ మాజీ ముఖ్యమంత్రి తీవ్రంగా మండిపడ్డారు.

సమాజంలోని అన్ని రంగాలలో తమ ఆధిపత్యం ఎలాగైనా కొనసాగుతూ ఉండాలని మనువాదులు కుట్రలు పన్నుతుంటారు. ఏవేవో పుకార్లు పుట్టిస్తుంటారు. ఇటీవల ఓ సన్యాసి బాబా గురువు తన భక్తులకు ఒక మంత్రోపదేశం చేశాడు. అదేమిటంటే 'ఏ మందు బిళ్ళయినా (టాబ్లెట్) వేసుకునే ముందు మహామృత్యుంజయ మంత్రం రెండుసార్లు చదివితే మందుబిళ్ళ బాగా పనిచేసి రోగం సత్వరమే తగ్గిపోతుందని! అదే నిజమైతే ఆసుపత్రుల ముందు, మెడికల్ షాపుల ముందు, ఫార్మా కంపెనీల ముందు అదే మాట రాసి బోర్డులు పెట్టాలి. జనం బుద్ధిగా దాన్ని పాటిస్తారా? లేక పాత చెప్పులు వెతికి తీసుకొస్తారా? చూడాలి. ఆధునిక వైద్యశాస్త్రానికున్నదా మీ పైత్యం అంటగట్టకండిరా బాబూ. కావాలంటే నమ్మకం ఉన్నవాళ్ళు టాబ్లెట్ల వాడకం మానేసి మహామృత్యుంజయ మంత్రమే చదువుకుంటూ తమ వ్యాధులు నయం చేసుకోవచ్చు కదా? ఎవరు కాదన్నారూ? ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది టాబ్లెట్లు వాడి జబ్బులు తగ్గించుకుంటున్నారు. లేదా అదుపులో ఉంచుకుంటున్నారు. పిచ్చి నమ్మకాలున్నవారికే నోరు అదుపులో ఉండడం లేదు. అదీ మన భారతదేశంలోనే. ఇతర దేశాల్లో ఎవరూ మహామృత్యుంజయ మంత్రం పేరు కూడా విని ఉండరు. మనదేశంలో కొందరు విన్నా ఆ మంత్రమేమిటో ఎవరికీ తెలియదు. అది పని చేస్తుందనడం ఒక అబద్ధం. అది నిరూపించగల వాళ్ళుంటే నిరూపించాలి. మనదేశ ఆరోగ్య రంగానికి గొప్ప మేలు జరుగుతుంది. నిరూపించడం చేతగాకే మానసిక బల హీనుల మీద ప్రభావం చూపే పుకార్లు అన్ని మాధ్యమాలలో వ్యాప్తి చేస్తున్నారు.

అడవిలో ఎన్నికలు జరుగుతుంటే చెట్లన్నీ గొడ్డలికి ఓటు వేశాయట. కారణమేమంటే 'గొడ్డలికి ఉన్న కర్ర తమ కులానికి చెందిందే' అని. ఇందులో ఏమైనా అర్థముందా? గొడ్డలి కర్రను గెలిపించుకుంటే ఏమవుతుంది? గొడ్డలి చెట్లన్నింటిని నరికేస్తుంది కదా? అమాయక జనం, మూర్ఖ జనం అందరూ కలిసి ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని రెండోసారి అధికారంలోకి తెచ్చారు. ఫలితం అనుభవిస్తున్నాం. అధికార పార్టీ విధానాల వల్ల ఎనిమిదేళ్ళల్లో 60-70 శాతం ధరలు పెరిగాయి. 2014-15లలో పెట్రోలు, డీజిల్ ధరలు రూ. 71-55 లు కాగా ఈ సంవత్సరం (2022) లో అది 120-106కి పెరిగింది. వంట గ్యాస్ 414 రూపాయల నుండి 1002 లకు పెరిగింది. ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోతూ ఉంది. ఇది ఇలాగే కొనసాగితే మనదేశం కూడా శ్రీలంకలాగా అయిపోయినా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ఇవన్నీ లోతుగా అధ్యయనం చేసిన జస్టిస్ మార్కండేయ కట్జూ నిర్మొహమాటంగా ఓ మాట చెప్పారు. 'తొంభయి శాతం భారతీయులు మూర్ఖులు' అని అన్నారు. 'ఓటు వేసే వారంతా కులం, మతం, ప్రాంతం ప్రాతిపదికన ఓటు వేస్తున్నారు. కానీ, అభ్యర్థి గుణగణాలు, శక్తి సామర్థ్యాలు చూడడం లేదు. సమాజంలో ఉన్న పేదరికం, ఆరోగ్య సదుపాయాలు, పోషకాహార లోపం అన్నింటినీ మించి నిరుద్యోగం వంటి వాటిని ప్రజలు ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు'. కాబట్టి, తన మాటలో తప్పేమీ లేదని ఆయన తనను తాను పూర్తిగా సమర్థించుకున్నారు. "90 శాతం భారతీయులు మూర్ఖులు" అనే తన మాటను తప్పని నిరూపించదలిస్తే దేశంలోని ఏ ప్రాంతపు ప్రజలనైనా ఉదాహరణగా చూపాలి! అని ఒక సవాల్ విసిరారు. జస్టిస్‌గారు చెప్పింది తప్పని చెప్పడానికి ఆస్కారమే లేకపాయె?

రెండోసారి బీజేపీని ఎన్నుకున్నందుకు ఉద్యోగులకు గొప్ప బహుమతి లభించింది. ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్ వడ్డీరేటు 8.1 శాతానికి తగ్గిపోయింది. ఇది ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయి. కోట్లాదిమంది ప్రభుత్వ ప్రయివేటు ఉద్యోగుల మీద తీవ్ర ప్రభావం పడింది. గొడ్డలి కర్రకు ఓటేస్తే వేటు పడేది పచ్చని చెట్ల మీదే కదా? ఇదిలాఉంటే అఖిల భారత ఆర్.ఎస్.ఎస్ అత్యున్నత ప్రతినిధి సభ 11 మార్చి 2022న గుజరాత్‌లోని అహ్మదాబాదులో జరిగింది. సంఘ్ చాలక్, సంఘ్ కార్యవాహ్ మొదలైన వారితో పాటు సుమారు 1200 మంది కీలక నాయకులు పాల్గొన్నారు. రెండేళ్ళల్లో దేశమంతటా మండల స్థాయి నుండి తమ శాఖలు ఏర్పాటు చేసుకోవాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. నిశ్శబ్దంగా ప్రమాద ఘంటికలు మోగుతున్న చప్పుడు దేశమంతా ప్రతిధ్వనిస్తోంది. ప్రతిపక్షాలేవీ ఎక్కడా? దేశ ప్రజలారా! మీ ప్రభుత్వాన్నుంచి మిమ్మల్ని మీరే కాపాడుకోవాలి! జాగ్ తే రహో!!

విద్యా సంస్థల కాషాయీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం కుట్రలు సాగిస్తూనే ఉంది. వ్యవస్థలన్నింటికీ కాషాయం పులిమే పని విజయవంతంగా కొనసాగిస్తూ ఉంది. అందులో భాగంగానే యుపిఎస్సి ఛైర్మెన్ పదవిలో తమకు సన్నిహితుడైన మనోజ్ సోనిని నియమించింది. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ సోని ఆయనకు ఉపన్యాసాలు రాసిచ్చేవాడు. ఆ సాన్నిహిత్యం వృథా పోలేదు. వడోదర యం.యస్.యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయ్యాడు. ఆరెస్సెస్‌కు, బీజేపీకి సన్నిహితుడు కావడం వల్లనే ఇప్పుడు మళ్ళీ యుపిఎస్సికి ఛైర్మెన్ అయ్యాడు. ఈ మనోజ్ సోనీది గతంలో ముంబైలో అగరొత్తులు అమ్ముకున్న స్థాయి. 12వ తరగతిలో సైన్స్‌లో పరీక్ష తప్పేంత మేధస్సు. అయినా కూడా మోదీ లింక్ దొరికింది గనక ఉన్నత పదవులు అందుకోగలుగుతున్నాడు. సైన్స్‌లో ఫెయిల్ అయ్యాడు గనక ఆర్ట్స్ చదవాల్సి వచ్చింది. చదివితే తప్పు లేదు. కానీ, రీజనింగ్ లేని విషయాలన్నింటినీ ప్రమోట్ చేస్తున్నాడు. పది పాస్ కాలేనివాడు ఓ యం.ఎ. డిగ్రీ కొనుక్కుని ప్రధాని కాలేదా? అక్రమ మార్గంలో పైకొచ్చినవాడు అలాంటివారినే కదా చేరదీస్తాడూ? 'మోదీకి ఎక్కాలు రావు. ఆర్థిక రంగం గురించి ఏం తెలుస్తుందీ' అని వారి బీజేపీ యం.పి. సుబ్రహ్మణ్య స్వామియే బాహాటంగా ప్రకటించాడు. అందులో రహస్యమేమీ లేదు. న్యాయశాస్త్ర కోవిదుడైన మన తెలుగువాడే సమాచార హక్కు చట్టం కింద ప్రధాని విద్యార్హతలేమిటి? అని అడిగితే "అది రహస్యంగా ఉంచవల్సిన విషయం" అని ప్రధాని కార్యాలయం బదులిచ్చింది. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జాతీయ టెలివిజన్ ఛానల్లో కరన్ థాపర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయనే స్వయంగా హైస్కూలు వరకు చదువుకున్నానని వినయంగా చెప్పుకున్నాడు. ఆ ప్రసారం నేను చూశాను కూడా!

అంబేద్కర్ జయంతి సందర్భంగా 14 ఏప్రిల్ 2022 న కర్నాటక కాంగ్రెస్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి పరమేశ్వర్ స్వయంగా తన అనుభవాలు పంచుకున్నారు. "ఈ దేశంలో కుల వ్యవస్థ వేళ్ళూనుకుని ఉందని, ఎన్ని ఉన్నత పదవులలో ఉన్నా కుల వివక్షను ఎదుర్కుంటూనే ఉన్నానని" చెప్పుకున్నారు. ప్రపంచంలో మరే ఇతర దేశంలోనూ ఇలాంటి పరిస్థితి లేదని వాపొయ్యారు. ఈ పరిస్థితులు చూసి ఒక ఉర్దూ కవి ఇలా అన్నాడు. "ఆసిఫ్-ప్యాస్ లగీతో, మజిద్, గురుద్వారా, చర్చ్, హోటల్ మె చలే జానా- బస్ మందిర్ మెమత్ జానా మెరె భాయ్-మందిర్ ఆజ్‌కల్ భగవాన్ క నహీఁ-సంఘ్ పరివార్ క ఘర్ హై - చదువుల్లేవు - ఇంగితజ్ఞానం లేదు-మతం పేరుతో కనిపించని దేవుడి పేరుతో, హనుమాన్ చాలీసా పేరుతో - శోభాయాత్రల పేరుతో మత విద్వేషాలు రగిలించి, జనాన్ని హేట్ (నారాజు) వాదంలోకి దింపే ప్రయత్నం ముమ్మరంగా చేస్తున్న కేంద్రప్రభుత్వ విధానాల్ని దేశ ప్రజలు నిశితంగా అర్థం చేసుకోవాల్సి ఉంది. గుడికి నువ్వు లక్ష రూపాయల విరాళమిచ్చినా నిన్ను అక్కడ కేవలం భక్తుడిగానే గుర్తిస్తారు. అదే డబ్బు బయట పేదవారికి పంచి చూడు. వారు నిన్ను "దేవుణ్ణి" చేస్తారు. దేవుడు అంటే నిజంగా ఇక్కడ దేవుడు ఉన్నాడని కాదు. అత్యున్నతమైన గౌరవ భావంతో చూడడం. మనుషులుగా మనుషులకు పనికొచ్చే పని చేద్దామా? మనుషులమన్నది మరిచి పేదల ఇండ్లపైకి బుల్‌డోజర్లు పంపి కూల్చేద్దామా? ఏది మానవత్వం? హనుమాన్ ఎవరు? రామాయణ కావ్యంలో రాముడి పాత్రకు బానిసగా బతికిన పాత్ర. ఆ బానిసకు సంబంధించిన చాలీసా పఠిస్తూ శోభాయాత్రలు తీస్తూ బానిసకు బానిసలుగా బతకడమే జీవిత ధ్యేయమా? "ఇందులేడందు లేడని సందేహము వలదు! ఎందెందు వెదకి చూసిన-అందందే లేడు చక్రి!" అనేది వాస్తవం!

వ్యాస రచయిత కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవ శాస్త్రవేత్త.

## కేరళ రచయిత హరీశ్‌కు 'వాయలార్ రామవర్మ' సాహిత్య పురస్కారం

**తిరువనంతపురం:** ప్రముఖ మలయాళ రచయిత ఎస్ హరీశ్ తన నవల "మీషా"కు గాను 46వ వాయలార్ రామవర్మ స్మారక సాహిత్య పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు. వాయలార్ రామవర్మ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులో రూ.లక్ష విలువైన నగదు, ప్రముఖ శిల్పి కనాయి కున్హిరామన్ రూపొందించిన శిల్పం, ప్రశంసాపత్రం ఉన్నాయని శనివారం నిర్వాహకులు తెలిపారు. సారా జోసెఫ్, వీ రామన్‌కుట్టితో సహా రచయితలతో కూడిన నిపుణుల బృందం దీనిని గుర్తింపు కోసం ఎంపిక చేసింది. అక్టోబర్ 27న స్థానికంగా జరిగే కార్యక్రమంలో రచయితకు ఈ అవార్డును అందజేస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. డీసీ బుక్స్ ప్రచురించిన ఈ నవల దక్షిణాది రాష్ట్రంలోని కుట్టనాడ్ ప్రాంతంలోని పేద, పీడిత ప్రజల జీవితాల చుట్టూ తిరుగుతుంది. ఇంగ్లీషులోకి "ముస్టాక్"గా అనువదించబడిన ఈ పుస్తకం అంతకుముందు కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, సాహిత్యం 2020 కొరకు జేసీబీ ప్రైజ్‌ని పొందింది. 2018లో సోషల్ మీడియాలో హిందుత్వ అనుకూల కార్యకర్తల బృందం తనపై, కుటుంబంపై దాడి చేసిన నేపథ్యంలో హరీష్ 'మాతృభూమి' వీక్లీలో కేవలం మూడు అధ్యాయాలను ప్రచురించిన తర్వాత నవల సీరియల్‌ని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది.

## టాపర్లకు హెలికాప్టర్ రైడ్ సన్మానం

**రాయ్‌పూర్:** చత్తీస్‌గఢ్‌లో 10, 2 తరగతుల్లో ప్రతిభ కనబరిచిన 125 మంది విద్యార్థులను శనివారం రాయ్‌పూర్‌లో సన్మానించి, హెలికాప్టర్ రైడ్‌తో సత్కరించినట్టు అధికారి ఒకరు తెలిపారు. ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ చేసిన ప్రకటనకు అనుగుణంగా 10, 12 తరగతుల బోర్డు పరీక్షల్లో రాష్ట్ర, జిల్లాల వారీగా టాపర్లకు ఏడు సీట్ల హెలికాప్టర్‌లో జాయ్‌రైడ్‌లు అందించినట్లు ప్రజా సంబంధాల అధికారి తెలిపారు. బోర్డు పరీక్షల్లో టాపర్లకు ఇంత విశిష్టమైన రీతిలో సన్మానాలు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఇక్కడి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. 10, 12 తరగతుల బోర్డు పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన టాప్ 10 మంది విద్యార్థులకు హెలికాప్టర్ రైడ్ బహుమతిగా అందజేస్తామని మే నెలలో ముఖ్యమంత్రి ప్రకటించారు. 12వ తరగతి బోర్డు పరీక్షలో రాయ్‌పూర్‌లో మొదటి ర్యాంకు, ఛత్తీస్‌గఢ్‌లో 10వ ర్యాంకు సాధించిన రాయ్‌పూర్‌కు చెందిన వర్షా దేవాంగన్ కృతజ్ఞతలు తెలుపుతూ, రైడ్‌లో తాను చాలా ఉత్సాహంగా ఉన్నానని, తన కల నిజమైందని అన్నారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న నారాయణపూర్ జిల్లాకు చెందిన 10వ తరగతి విద్యార్థి దేవానంద్ కమేటి మాట్లాడుతూ, 'నేను హెలికాప్టర్‌లో ప్రయాణించడం చాలా ఆనందంగా. ఇది నాకు చిరస్మరణీయమైన క్షణం' అని తెలిపాడు.

## రూ.3 లక్షలకు మోసపోయిన మందుల దుకాణం యజమాని

**థానే:** అమెరికా డాలర్లు ఇస్తానని ఓ మందుల దుకాణం యజమానిని కొందరు వ్యక్తులు రూ.3 లక్షలకు మోసం చేశారని థానే పోలీసులు శనివారం తెలిపారు. నిందితుడు ఇటీవల మందులు కొనడానికి వ్యక్తి దుకాణానికి వచ్చాడు, మాటలు కలిపాడు. భారతీయ కరెన్సీకి బదులుగా అతనికి అమెరికా డాలర్లు ఇస్తానని నమ్మబలికినట్టు ముంబ్రా పోలీసుస్టేషన్ అధికారి తెలిపారు.

"దివాలోని ఒక ప్రదేశంలో ఒక మహిళతో సహా నిందితుడికి రూ. 3 లక్షలు అప్పగించిన తర్వాత వ్యక్తికి ఒక బ్యాగ్ ఇచ్చారు. అయితే, బ్యాగ్‌లో వాగ్దానం చేసిన 1,673 డాలర్ నోట్లకు బదులుగా కేవలం చిత్తు కాగితాలు ఉన్నాయి" అని అతను చెప్పాడు. 'కొన్ని రోజుల క్రితం ఆటోరిక్షా డ్రైవర్‌ను కూడా ఇలానే మోసం చేశారు. ఈ రెండు కేసులకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో కేసును దర్యాప్తు చేస్తున్నాం' అని ఆయన తెలిపారు.

## రాయ్‌గఢ్ జిల్లా పరిషత్‌లో 2,600 పోస్టులు ఖాళీ

**అలీబాగ్:** దేశాన్ని నిరుద్యోగం పట్టిపీడిస్తోంది. నాయకుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. ఎన్నికల వచ్చిన సందర్భంలో తప్ప, మరెప్పుడూ రాజకీయనాయకులకు నిరుద్యోగులు గుర్తుకురారు. ఎన్నో కలలతో డిగ్రీలు, ఇంజినీరింగ్‌లు పూర్తిచేసుకున్న యువకులు ఉద్యోగాల కోసం వేచిచూడక తప్పడం లేదు. ఆయా ప్రభుత్వ సంస్థల్లో ఖాళీలు ఉన్నా, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. పైపెచ్చు ఉద్యోగాలిస్తే ప్రభుత్వ ఖజానాకు భారమని ఆ ఊసే ఎత్తడం లేదు. తాజాగా మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా పరిషత్‌లో 2600పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యాశాఖలో 1,502, ఆరోగ్యశాఖలో 556 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు శనివారం అధికారులు తెలిపారు. మొత్తంగా రాయ్‌గఢ్ జిల్లా పరిషత్‌లో 15 తాలూకాలు, 15 పంచాయతీ సమితులు, 810 గ్రామ పంచాయతీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్థిక, ప్రజాపనులు, నీటి సరఫరా, వ్యవసాయం, పశుసంక్షేమం, ఆరోగ్య, విద్యాసంబంధిత శాఖల్లో సుమారు 2,671వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయని రాయ్‌గఢ్ జెడ్పీ అధికారి ఒకరు పేర్కొన్నారు.

## పంజాబ్‌లో గ్యాంగ్‌స్టర్ అరెస్ట్

**చండీగఢ్:** బటాలా ప్రాంతంలోని ఒక గ్రామంలో పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్ అనంతరం, పొలాల్లో దాక్కుని తప్పించుకోవడానికి ప్రయత్నించిన గ్యాంగ్‌స్టర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు శనివారం తెలిపారు. బటాలా ఎస్‌ఎస్పీ సతీందర్ సింగ్ మాట్లాడుతూ, అతను పోలీసులపై అనేక రౌండ్లు కాల్పులు జరిపాడు. పోలీసులు ఎదురు కాల్పులు జరపడంతో గాయపడ్డాడు. గురుదాస్‌పూర్ సమీపంలో గ్యాంగ్‌స్టర్ రంజోద్ సింగ్‌ను అరెస్టు చేసి, అతని నుంచి రెండు తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మొత్తం ఆపరేషన్ మూడు నుంచి నాలుగు గంటలపాటు సాగిందని పోలీసులు వివకింయాకె, రంజోద్ సింగ్‌పై ఎనిమిది నుంచి తొమ్మిది కేసులు ఉన్నాయని ఆయన చెప్పారు. "ఇటీవల, బటాలా పోలీసులు అతనిపై రెండు కేసులు కూడా నమోదు చేశారని తెలిపారు. గ్యాంగ్‌స్టర్‌ను ఎలా ట్రాక్ చేశారనే వివరాలను తెలియజేస్తూ, తమ వద్ద అతని సమాచారం ఉందని, దీంతో పాటు నేరస్థులు, గ్యాంగ్‌స్టర్లపై పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించారని, శనివారం వారు ఈ ప్రాంతంలో డ్రైవ్ నిర్వహిస్తున్నారని చెప్పారు. పోలీసులు గ్యాంగ్‌స్టర్‌ను గుర్తించగా, అతడు తన మోటార్‌సైకిల్‌ను రోడ్డుపై వదిలిపెట్టి కాల్పులు జరిపి పొలాల్లోకి పారిపోయాడని ఎస్‌ఎస్పీ తెలిపారు. ఈ తర్వాత పోలీసుల కాల్పుల్లో అతడిని గాయాలయ్యాయనీ, వైద్య చికిత్స అందించామని తెలిపారు. గ్యాంగ్‌స్టర్ అనేక రౌండ్లు కాల్పులు జరపగా, పోలీసు సిబ్బంది ఎవరూ గాయపడలేదని ఆయన చెప్పారు. గ్యాంగ్‌స్టర్ ఏ ముఠాతో సంబంధాలున్నాయో విచారణ చేయనున్నట్టు ఎస్‌ఎస్పీ వివరించారు.

## థరూర్‌తో కాంగ్రెస్ పటిష్ఠం: కార్తీ

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న శశిథరూర్‌కు ఆ పార్టీ ఎంపీ కార్తీ చిదంబరం శనివారం పూర్తి మద్దతు ప్రకటించారు. బీజేపీ విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు మాజీ దౌత్యవేత్త, ఆధునిక భావజాలం గల థరూర్ అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. సాధారణ కార్యకలాపాలు కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం దోహదం చేయబోవని, పార్టీలో సంస్కరణవాది భావజాలం అవసరమని కార్తీ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా శశిథరూర్‌కు తాను పూర్తి మద్దతిస్తున్నానని, ఆధునికభావజాలం గల ఆయన పార్టీని అద్భుతంగా నడపగలరని చెప్పారు. బీజేపీ విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడే శక్తి థరూర్‌కు ఉందని అభిప్రాయపడ్డారు. 'సాదాసీదా రాజకీయాలు పార్టీకి ఎంతమాత్రం దోహదపడవు. పార్టీకి సంస్కరణవాది అవసరం చాలా ఉంది' అని కార్తీ చెప్పారు. థరూర్ నామినేషన్ పత్రాలపై కార్తీ చిదంబరం ప్రతిపాదకుడిగా సంతకం చేసిన విషయం విదితమే. ఓటేయాల్సిందిగా పార్టీ నాయకులకు శశిథరూర్ విజ్ఞప్తి చేశారని,

## ములాయం ఆరోగ్యం విషమం

**లక్నో:** సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, యూపీ మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ ఆరోగ్యం ఏమాత్రం మెరుగుపడలేదు. ఆయన ఇంకా గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో ఐసీయూలోనే చికిత్స పొందుతున్నారు. ములాయం ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగానే ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు శనివారం పేర్కొన్నాయి. ములాయంకు వెంటిలేటర్‌పైనే చికిత్స అందిస్తున్నట్లు తెలిపాయి. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందిస్తున్నామని వివరించాయి. ఆసుపత్రి వెల్లడించిన సమాచారాన్ని సమాజ్‌వాదీ పార్టీ తన అధికారిక ట్విట్టర్‌లో షేర్ చేసింది. ములాయం వయస్సు 82 సంవత్సరాలు.

## మాటలు కాదు...చేతలు ముఖ్యం

### భగవత్ వ్యాఖ్యలపై పవార్ చురకలు

నాగపూర్: సామాజిక వివక్షపై ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ స్వాగతించారు. అన్ని సమస్యలకు కారణమవుతున్న సామాజిక వివక్షకు అంతం పలకాలని భగవత్ శుక్రవారం ఓ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పేర్కొన్నారు. వర్ణం, కులం వంటి భావాలకు పూర్తిగా స్వస్తి చెప్పాలని ఆయన వ్యాఖ్యానించారు. కులవ్యవస్థకు కాలానుగుణ్యత లేదని భగవత్ చెప్పారు. భగవత్ వ్యాఖ్యలపై శరద్ పవార్ ఇక్కడ విలేకరుల సమావేశంలో స్పందిస్తూ ఆయన వ్యాఖ్యలు వినడానికి బాగానే ఉన్నాయని, కానీ ఆచరణలో పెడితే మంచిదని చెప్పారు.

ప్రవచనాలు చెప్పడానికి బాగానే ఉంటాయని, వాటిని అమలు చేస్తేనే ప్రజలు విశ్వసిస్తారని పవార్ పేర్కొన్నారు. 'వివక్ష కారణంగా సమాజంలోని అత్యధిక మంది ప్రజలు బాధపడుతున్నారు. ఇలాంటి వివక్షకు ఎవరైతే పాల్పడుతున్నారో...వారు ఆత్మ పరిశీలన చేసుకొని దానికి దూరంగా ఉండటం మంచిది' అని హితవు పలికారు. కేవలం క్షమాపణ చెబితే సరిపోదని, సమాజంలోని అణగారిన వర్గాల పట్ల వాస్తవంగా మనం ఎలా వ్యవహరిస్తున్నామో అనే దానిపై మన నిజాయతీ ఆధారపడి ఉంటుందని పవార్ చురకలంటించారు. మహారాష్ట్రలో రెండు శివసేన వర్గాల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరుపై వ్యాఖ్యానించడానికి పవార్ నిరాకరించారు. ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాన్ని అందరూ శిరసావహించాల్సిందేనని చెప్పారు.

## నాలుగేళ్ల బాలికపై అత్యాచారం

**గురుగ్రామ్:** గురుగ్రామ్‌లో దారుణం చోటుచేసుకుంది. అభంశుభం తెలియని నాలుగేళ్ల బాలికపై మైనర్ బాలుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. గురుగ్రామ్‌లోని సెక్టార్ 52 ఏరియాలో ఈ అమానుషం జరిగినట్లు పోలీసులు శనివారం తెలిపారు. నిందితుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసినట్లు చెప్పారు. బాలుడిని జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరు పర్చి...ఫరీదాబాద్‌లోని బాలనేరస్తుల గృహానికి తరలించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఈ ఘటన మంగళవారం జరిగింది. తాను పనికోసం బయటికి వెళ్లానని, బాలిక ఒక్కతే ఇంటిలో ఉందని తెలిపింది. సాయంత్రం వేళ ఇంటి బయట ఆడుకుంటున్న బాలికకు మాయమాటలు చెప్పి నిందితుడు తన ఇంటికి తీసుకెళ్లాడని, అక్కడ అమ్మాయిపై అత్యాచారానికి పాల్పడ్డాడని వివరించింది. తాను సాయంత్రం పని నుంచి తిరిగి వచ్చిన తర్వాత బాలికను చూస్తే అనుమానం వచ్చిందని, కడుపు నొప్పితో బాధపడుతోందని, వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించామన్నారు. చివరికి ఇంటి పక్క అబ్బాయి అత్యాచారం చేసినట్లు ఆ బాలిక చెప్పిందని తల్లి ఫిర్యాదులో పేర్కొంది. నిందితుడి వయస్సు 15 ఏళ్లని, అతనిని జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు హాజరు పరిచామని, నిందితుడిని బాల నేరస్తుల శిక్షణా కేంద్రానికి పంపారని పోలీసులు తెలిపారు.

# 'మహా' బీజేపీలో తారస్థాయికి కుమ్ములాటలు!

- పార్టీలో గుర్తింపు లేకపోవడంపై పంకజ ముండే ఆగ్రహం
- మోదీ... తన రాజకీయ జీవితానికి చెక్ పెట్టలేరని వ్యాఖ్య
- శివసేన, ఎన్సీపీ నుంచి ముండేకు పిలుపు

**ముంబై:** మహారాష్ట్ర బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు తారస్థాయికి చేరుకున్నట్టు బహిర్గతమైంది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని సంకీర్ణ సర్కారును కూలదోసి అధికారాన్ని చేజిక్కించుకున్న కమలదళంపై దివంగత నేత గోపీనాథ్ ముండే కుమార్తె పంకజ ముండే మరోసారి తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కారు. సీనియర్ నేతల పేర్లను ప్రస్తావించనప్పటికీ, బీజేపీతో అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమేనన్న సంకేతాలిచ్చారు. పార్టీలో తన ప్రాముఖ్యాన్ని తగ్గిస్తుండటాన్ని ప్రజాక్షేత్రంలో పరోక్షంగా ఎత్తిచూపారు. 'ప్రజల హృదయాల్లో నేను ఉన్నంత కాలం... ప్రధాని నరేంద్రమోదీ కూడా నా రాజకీయ జీవితానికి చెక్ పెట్టలేరు' అంటూ సాక్షాత్తూ బీజేపీ జాతీయ కార్యదర్శి పంకజ ముండే గతవారం మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. దీంతో అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమైనట్టుగా తెలుస్తోంది. రెండు రోజుల క్రితం బీడ్‌లో జరిగిన ఓ సభలో ఆమె మాట్లాడుతూ... 2024 ఎన్నికల కోసం అన్ని విధాలుగా తాను సిద్ధమవుతున్నట్టు పేర్కొన్నారు. పార్టీ టికెట్ ఇస్తే ఎన్నికల్లో పోటీచేస్తానని ఒకవైపు పేర్కొంటూనే... టికెట్ కోసం తాను ఎవరి ముందూ తలవంచబోనని బీజేపీ నేతలకు చురకలు అంటించారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిని కాకపోయినా తన ప్రసంగాన్ని వినడానికి వేల మంది వచ్చారని తనకున్న మద్దతును పరోక్షంగా ఎత్తిచూపారు. ఇతరులను తొక్కేస్తూ పైకి రాలేదని పార్టీ నాయకత్వంపై విమర్శలు గుప్పించారు.

**ప్రాధాన్యత తగ్గింపు...**

మరత్వాడాలో కీలక ఓటు బ్యాంకుగా ఉన్న వంజారి కమ్యూనిటీకి చెందిన పంకజ ముండే, గత ఫడ్నవీస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో తమ కుటుంబానికి కంచుకోటగా పిలిచే బీడ్ జిల్లాలోని పర్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి తనకు సోదరుడి వరుసయ్యే ధనంజయ్ ముండే (ఎన్సీపీ) చేతిలో ఘోర పరాజయాన్ని చవిచూశారు. స్థానిక బీజేపీ నేతల కుట్ర కారణంగానే తాను ఓడిపోయానని ముండే చేసిన ఆరోపణలు అప్పట్లో సంచలనంగా మారాయి. రాష్ట్రంలో తనకు కీలక పదవి దక్కుతుందని భావించిన ఆమెకు ఆ తర్వాత కూడా నిరాశే ఎదురైంది. పార్టీ జాతీయ కార్యదర్శిగా ముండేను నియమిస్తూ 2020లో అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఎంపీ, ఎమ్మెల్సీ టికెట్‌ను ఆశించినా భంగపాటు తప్పలేదు. ఇవన్నీ ఆమెలో అసహనానికి ఆజ్యాన్ని పోశాయి. అందుకే... ఇటీవల జరిగిన బహిరంగ సభలో... 'చినుకులు మహా సముద్రంగా ఎలా మారుతాయో... 2024 ఎన్నికల్లో చూపిద్దాం' అంటూ అనుచరులకు పిలుపునిచ్చారు. కాగా, ముండే తమ పార్టీలోకి రావడాన్ని స్వాగతిస్తామని శివసేన, ఎన్సీపీ ఇప్పటికే ప్రకటించాయి.

## హిమాచల్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించండి

- ఈసీని కోరిన కాంగ్రెస్
- బీజేపీది అధికార దుర్వినియోగమని ఆరోపణ

**సిమ్లా :** అధికార బీజేపీ రాష్ట్ర నిధులను, యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపణలు వస్తున్నందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చేలా హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని కాంగ్రెస్ శనివారం ఎన్నికల సంఘాన్ని కోరింది. హిమాచల్ ప్రదేశ్‌లో 'అమృతోత్సవ్' కార్యక్రమం పై నిషేధం విధించాలని కూడా రాష్ట్ర కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ పదవీ కాలం రెండు నెలలు మాత్రమే ఉంది. కానీ బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం అధికారాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రతిభా సింగ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. బీజేపీ కేంద్ర మంత్రులు, నాయకులకు ఆతిథ్యం ఇచ్చేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని ఆమె ఆరోపించారు. ఈసీ దీనిని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ ధనం, యంత్రాంగం దుర్వినియోగాన్ని వెంటనే ఆపాలని అన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు తేదీలను ప్రకటించి, వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చేలా చూడాలని ఎన్నికల సంఘాన్ని అభ్యర్థించింది.

'రాష్ట్రంలో బీజేపీ అమృతోత్సవ్ పేరుతో ఇక్కడి ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ బ్యానర్లను బహిరంగంగా వినియోగిస్తోంది' అని ప్రతిభా సింగ్ ఆరోపించారు. హిమపాతం సంభవించే లోపు లాహౌల్-స్పితి మరియు కిన్నౌర్ గిరిజన జిల్లాలతో సహా రాష్ట్రంలోని ఎత్తైన ప్రాంతాలలో ఏకకాలంలో ఓటింగ్ నిర్వహించాలని కూడా ఆమె డిమాండ్ చేశారు.

## ఆ ఆటోలను సీజ్ చేయండి

### కర్ణాటక ప్రభుత్వం ఆదేశం

**బెంగళూరు :** యాప్ ఆధారిత క్యాబ్ అగ్రిగేటర్లకు సంబంధించిన ఫిర్యాదులతో ఆటోరిక్షా సేవలను తక్షణమే ఆపాలని రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఇంకా నడుస్తున్న అలాంటి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు కర్ణాటక రవాణా మంత్రి బి.శ్రీరాములు శనివారం తెలిపారు. 'ఉల్లంఘనల'కు సంబంధించి ఓలా, ఉబెర్ వంటి అగ్రిగేటర్లకు నోటీసులు జారీ చేశామని, రెండు రోజుల్లో తదుపరి చర్యను నిర్ణయిస్తామని ఆయన చెప్పారు. 'ఓలా, ఉబర్‌లు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సహాయం చేయడానికి ఉద్దేశించినవి. అయితే మాకు ప్రతి సంవత్సరం ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్ని సాంకేతిక సమస్యలు కూడా ఉన్నాయి. అందువల్ల వారికి నోటీసులు జారీ చేశాం' అని ఒక ప్రశ్నకు సమాధానంగా శ్రీరాములు విలేకరులతో అన్నారు. లైసెన్సుల మంజూరు చేసేటప్పుడు ఇతర వాటితో పాటు రేటు స్థిరీకరణ వంటి కొన్ని షరతులు పెట్టారని పేర్కొంటూ... ఉల్లంఘనలు ఉన్నందున నోటీసులు జారీ చేశామని, వాటి నుంచి స్పష్టత వస్తే ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. నోటీసులు ఇచ్చినా, వాహనాలను ఆపాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాహనాలు నడుస్తున్నాయని మంత్రి చెప్పారు. 'ఆదేశాలు ఉన్నప్పటికీ నడుస్తున్న ఓలా, ఉబర్ వాహనాలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించాను' అని అన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని పేర్కొంటూ, యాప్ ఆధారిత క్యాబ్ అగ్రిగేటర్‌లు నగరంలో తమ 'చట్టవిరుద్ధమైన' ఆటోరిక్షా సేవలను తక్షణమే నిలిపివేయాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. ఓలా, ఉబర్ వంటి యాప్‌ల కింద పనిచేసే ఆటోరిక్షాలు అధిక చార్జీలు వసూలు చేస్తున్నాయని అనేక మంది ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో ఈ చర్య తీసుకుంది. అయితే కంపెనీలు అందిస్తున్న ఆటోరిక్షా సేవలపై రవాణా శాఖతో వివరాలు పంచుకునేందుకు మూడు రోజుల సమయం ఇచ్చారు.

## నేను చూశాను... ఆ కేసులో ఏమీ లేదు

### లాలూకు వ్యతిరేకంగా సీబీఐ అభియోగాలపై నితీశ్ ఆగ్రహం

**పాట్నా :** రైల్వే మంత్రిగా పని చేసిన కాలంలో నమోదయిన ఒక కేసులో తన కొత్త మిత్రుడు, ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలు ప్రసాద్‌కు వ్యతిరేకంగా సీబీఐ అభియోగాలు మోపడంపై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషలిస్టు నాయకుడు జయప్రకాశ్ నారాయణ్ వర్ధంతి సందర్భంగా ఆయన జన్మస్థలమైన సీతాబ్ దియారా నుంచి బయలుదేరి వెళ్లే ముందు ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ, ఈబీసీ కోటాను రద్దు చేస్తూ పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పు పై బీజేపీ తనను నిలదీసేందుకు ప్రయత్నిస్తోందని కూడా నితీశ్ ధ్వజమెత్తారు. 'ఐదేళ్ల క్రితం నేను కూటమి నుంచి బయటకు వచ్చేందుకు కారణమైన సంఘటన మీ అందరికీ గుర్తుండే ఉంటుంది' అని తన సహచర మంత్రి, లాలు ప్రసాద్ కుమార్ తేజస్వి యాదవ్ పక్కన ఉండగా వ్యాఖ్యానించారు. జేడీ(యూ) నాయకుడు ఆర్‌జేడీతో తెగదెంపులు చేసుకునేందుకు దారితీసిన మరొక కేసులో వీరి పేరు వచ్చింది. 'ఆ కేసులో ఏమీ లేదు. ప్రస్తుతం నేను కూటమిలోకి వచ్చిన తర్వాత కొత్త విషయం ప్రారంభమైంది. ఇదేనా మార్గం? వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది' అని సీఎం అన్నారు. దర్యాప్తు సంస్థల ద్వారా రాజకీయ ప్రతీకార ఆరోపణలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలు, ఆయన సతీమణి, మాజీ సీఎం రబ్రీ దేవి, పెద్ద కుమార్తె, రాజ్యసభ ఎంపీ మిసా భారతి సహా 14 మంది పై అభియోగాల నమోదును పూర్తి చేసినట్లు సీబీఐ అధికారులు శుక్రవారం వెల్లడించడం గురించి అడిగిన ప్రశ్నలకు నితీశ్ స్పందించారు. మునిసిపల్ ఎన్నికలకు సంబంధించి పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుకు సంబంధించి తనను బీజేపీ నిందించడం గురించి కూడా బీహార్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న నితీశ్ ప్రశ్నించారు. 'వారు అబద్ధాలు (గలాత్ బోల్ రహే హై) చెబుతున్నారు' అని నితీశ్ అన్నారు. ఎన్నికల్లో ఓబీసీలు, ఈబీసీల కోటాల రాష్ట్ర విధానం దశాబ్ద కాలంగా అమలులో ఉందని, గతంలో సుప్రీం కోర్టుతో పాటు హైకోర్టు కూడా సమర్థించిందని తెలిపారు. 'వారు (బీజేపీ) కూడా తమ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. నేను వారితో సఖ్యతగా ఉన్న కాలమంతా, పట్టణాభివృద్ధి శాఖ వారి వద్దనే ఉంది. వారు ఓబీసీల పట్ల శత్రుత్వం కలిగి ఉన్నారా అని నేను ఆశ్చర్యపోతున్నాను' అని నితీశ్ అన్నారు. 'మరికొన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్ల కోసం సుప్రీం కోర్టు ఆదేశాలపై ఆధారపడిన ఉత్తర్వులపై మేము అప్పీల్ చేస్తాము. బీహార్‌లో గతంలో కోటా విధానంలోనే ఎన్నికలు జరిగాయని మేము నొక్కి చెబుతున్నాం. ఓబీసీలు, ఈబీసీల వర్గీకరణ, ఇందులో ముస్లింలు కూడా ఉన్నారు. 1970లలో మా గురువు కర్పూరీ ఠాకూర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగింది' అని అన్నారు.

## దిల్లీ మద్యం పాలసీ

## ఈడీ దాడి తర్వాత రూ.కోటి స్వాధీనం

**న్యూదిల్లీ :** దిల్లీ మద్యం పాలసీలో అక్రమాల ఆరోపణల్లో మనీ లాండరింగ్ దర్యాప్తునకు సంబంధించి దాడులు నిర్వహించిన తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కోటి రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికార వర్గాలు శనివారం తెలిపాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్, పంజాబ్, దిల్లీ-ఎన్‌సీఆర్‌ల్లో దాదాపు 35 ప్రాంతాల్లో శుక్రవారం దాడులు నిర్వహించింది. మద్యం వ్యాపారి, కంపెనీల పంపిణీదారు, వాటితో సంబంధం ఉన్న సంస్థల పై దాడులు నిర్వహించిన సమయంలో ఒక ప్రాంతం నుంచి దాదాపు రూ.కోటి నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆ వర్గాలు వివరించాయి. కొన్ని డిజిటల్ ఉపకరణాలు, పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపాయి. ఒక తెలుగు దినపత్రిక బోర్డు సభ్యుడు, దిల్లీకి చెందిన టీవీ వార్తా సంస్థకు చెందిన డైరెక్టర్, వేర్వేరు మద్యం పానీయాల పంపిణీదారులు, కంపెనీ దిగుమతిదారుడిగా ఉన్న నగరానికి చెందిన వ్యాపారవేత్త, అలాగే పంజాబ్ మాజీ ఎమ్మెల్యేకు చెందిన ప్రాంగణాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించినట్లు ఆ వర్గాలు వివరించాయి. దర్యాప్తు సంస్థ ఈ కేసులో ఇప్పటి వరకు 103కు పైగా దాడులు చేసింది. గత నెలలో ఇండోస్పిరిట్ అనే మద్యం తయారీ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, మద్యం వ్యాపారి సమీర్ మహేంద్రును అరెస్టు చేసింది. మనీ లాండరింగ్ కేసులో దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాతో పాటు ఇతరులను నిందితులుగా సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. దిల్లీ మద్యం పాలసీ 2021-22 అమలులో అక్రమాల ఆరోపణల పై దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా సీబీఐ దర్యాప్తునకు సిఫార్సు చేసిన తర్వాత ఇది వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో 11 మంది ఎక్సైజ్ అధికారులను కూడా ఆయన సస్పెండ్ చేశారు. కాగా ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్, మంత్రి సత్యేంద్ర జైన్‌ను ఈడీ ప్రశ్నించింది. అలాగే అరెస్టయిన వ్యాపారవేత్త విజయ్ నాయర్, అనేక మంది ప్రజలను సీబీఐ ప్రశ్నించింది. దిల్లీ ఎక్సైజ్ నిబంధనలు-2010, దిల్లీ ఎక్సైజ్ చట్టం-2009, వ్యాపార నిబంధనల లావాదేవీలు (టీవోబీఆర్)-1993, దిల్లీ జాతీయ రాజధాని ప్రాంత ప్రభుత్వం (జీఎన్‌సీటీడీ)కు చెందిన ప్రాథమిక ఉల్లంఘనలను చూపుతూ దిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివేదిక పై సీబీఐ దర్యాప్తునకు సిఫార్సు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇదిలాఉండగా, శుక్రవారం సీబీఐ దాడుల పై దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పందిస్తూ, కేంద్ర దర్యాప్తు సంస్థలు వందల దాడులు చేసినప్పటికీ, సిసోడియాకు వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాన్ని కనుగొనలేకపోయాయని, ఇందులో ఏమీ లేదని స్పష్టమవుతుందని అన్నారు. 'చెత్త రాజకీయాలు' కోసం సీబీఐ, ఈడీ సమయం వృథా అవుతుందని పేర్కొన్నారు.

## గడ్చిరోలిలో ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

**ముంబై:** మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో రూ.10 లక్షల రివార్డు ఉన్న ఇద్దరు మావోయిస్టులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అరెస్టయిన మావోయిస్టులలో ఒకరు ఉత్తర గడ్చిరోలిలో దళాలను పునరుద్ధరించడానికి సీనియర్లు పంపిన వ్యక్తి అని, 2021 మార్దింటోలా అటవీ ఎన్‌కౌంటర్‌లో 27మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందేనని అధికారి తెలిపారు. శుక్రవారం మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లో ధనోరాలోని సావర్‌గావ్ ప్రాంతానికి చెందిన కృష్ణ అలియాస్ సన్నిరామ్ నరోటే (24), సంకురామ్ నరోటే (22)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిద్దరిపై రూ.10 లక్షల రివార్డు ఉందని ఆయన తెలిపారు. ఏఓపీ సావర్‌గావ్ అధికార పరిధిలోని మోర్చుల్‌లో నివసిస్తున్న కృష్ణ, కంపెనీ 10 దళంలో భాగమని, ఆయనపై రూ.8లక్షల రివార్డు ఉందని అధికారి పేర్కొన్నారు.

మోర్చుల్ నివాసి అయిన సంకురామ్ కూడా జన్ మిలిషియా ర్యాంక్‌కు చెందినవాడనీ, అతనిపై రూ.2లక్షల రివార్డ్ ఉన్నట్టు అధికారి తెలిపారు. పట్టుబడ్డ ఇద్దరు మావోయిస్టులు హత్య, దహనం, కాల్పులు వంటి అనేక నేరాలకు పాల్పడ్డారని, గడ్చిరోలిలో ఇతర నేరాల్లో వీరి ప్రమేయంపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

విశాలాంధ్ర

6

ఆదివారం

09 అక్టోబర్ 2022

# బీజేపీ మిషన్ 2024

- మోదీ మెగా ర్యాలీలకు ప్రణాళికలు

**న్యూఢిల్లీ :** దేశంలో తాము తప్ప మరో పార్టీ అధికారంలో ఉండేందుకు వీల్లేదన్నట్లుగా బీజేపీ వ్యవహరిస్తోంది. ప్రతి రాష్ట్రాన్ని ఏలాలని భావిస్తోంది. ఇదే క్రమంలో సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మిషన్ 2024కు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రధాని నరేంద్రమోదీతో డజన్ల కొద్దీ మెగా ర్యాలీలు నిర్వహించాలని యోచిస్తోంది. 144 లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకోవాలని వ్యూహాలు రచిస్తోంది. ఆయా స్థానాల్లో పార్టీ బలోపేతానికి 'కస్టర్ ప్లాన్'ను బీజేపీ సిద్ధం చేసినట్లు శనివారం అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ విస్తృత ప్రణాళిక తొలి దశలో అనేకమంది కేంద్ర మంత్రులు అక్కడ పర్యటిస్తారని, బీజేపీ కార్యకర్తలు, వేర్వేరు వర్గాల ప్రజలతో సమావేశమవుతారని తెలుస్తోంది. గతనెలలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్‌షా సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పార్టీ క్లస్టర్ ప్రణాళిక పురోగతిపై వేర్వేరు కేంద్రమంత్రుల నుంచి సమాచారాన్ని సేకరించారు.

# చరిత్ర వక్రీకరణ

## చలసాని జయప్రద సంస్మరణ సభలో జేవీ సత్యనారాయణమూర్తి

**విశాలాంధ్ర-నూజివీడు:** అమరుల స్ఫూర్తితో పోరాటాలు, ఉద్యమాలతో పునీతమైన దేశ చరిత్రను నేటి తరానికి తెలియజెప్పాల్సిన బాధ్యత చరిత్ర తెలిసిన అందరిపై ఉన్నదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి చెప్పారు. కమ్యూనిస్టు ఉద్యమ మహిళా నాయకు రాలు చలసాని జయప్రద ప్రథమ సంస్మరణ కార్యక్రమం నూజివీడు కార్మికభవన్‌లో సీపీఎం నాయకులు వై.కేశవరావు అధ్యక్షతన శనివారం జరిగింది. జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మతోన్మాదులు దేశ చరిత్రను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. భారతదేశ స్వాతంత్ర్యో ద్యమ చరిత్రకు పాలకులు కొత్త భాష్యం చెబుతూ...తమకు అనుకూలంగా మలుచుకుంటు న్నారని విమర్శించారు. దేశానికి సంపూర్ణ స్వాతం త్ర్యం కావాలని మొట్టమొదట కాంగ్రెస్ సభలో తీర్మానం పెట్టి ఆమోదింప చేసిన ఘనత నాటి కమ్యూనిస్టు ఉద్యమానిదని గుర్తుచేశారు. చలసాని జయప్రద జీవితం మహత్తరమైనదన్నారు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని, భావజాలాన్ని ఆచరించడం కోసం చివరివరకు శ్రమించారని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డేగా ప్రభాకరరావు, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నెం కృష్ణచైతన్య, మహిళా సమాఖ్య నాయకులు పెన్మత్స దుర్గా భవాని, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు, సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయ కుడు జి.రాజు, జయప్రద కుమారులు చలసాని వెంకట రామారావు, రాఘవేంద్రరావు పాల్గొన్నారు. తొలుత చలసాని జయప్రద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## జాతీయ మహాసభలకు రూ.1.22 లక్షల విరాళం

విజయవాడలో జరగనున్న సీపీఐ జాతీయమహాసభలకు చలసాని జయప్రద కుమారులు, కుమార్తెలు, ఇతరులు రూ.1.22 లక్షల విరాళం ఇచ్చారు. చెక్కును జేవీ సత్యనారాయణమూర్తికి జయప్రద పెద్ద కుమారుడు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు అందజేశారు.

# ఒకట్రెండు రోజుల్లో పూర్తి కావాల్సిందే

## వాంగ్మూలాల సేకరణపై సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:**
ఏదేని కేసులో క్రాస్ ఎగ్జామినేజన్ జరిగినప్పుడు వాది, ప్రతివాదుల వాంగ్మూలాలను అదే రోజు లేక మరుసటి రోజు తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈ ప్రక్రియను నెలల తరబడి వాయిదా వేయడంలో అర్థం లేదని పేర్కొంది. ఓ హత్య కేసులో ఇద్దరు వ్యక్తులకు అలహాబాద్ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ దాఖలైన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది. ప్రాసిక్యూషన్ సాక్షుల్లో ఒకరి వాంగ్మూలాన్ని తీసుకునేందుకు మూడు నెలల సమయం పట్టిందని తమ దృష్టికి రావడంతో జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ సీటీ రవికుమార్ ధర్మాసనం స్పందించింది. ఎగ్జామినేషన్-ఇన్‌చీఫ్/క్రాస్-ఎగ్జామినేషన్ రికార్డింగ్ వాయిదా వేయడానికి ఎలాంటి కారణం ఉండరాదని సెప్టెంబరు 30న జారీ చేసిన ఉత్తర్వుల్లో కోర్టు పేర్కొంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇచ్చిన రెండు వేర్వేరు తీర్పుల్లో ఇద్దరు వ్యక్తులకు బెయిల్ ఇచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని భదోహి జిల్లాలో నమోదు అయిన కేసుతో పాటు హత్య తదితరల ఆరోపణలు ఆ ఇద్దరిపై ఉన్నాయి. కేసులో సాక్షుల జాబితా, చార్జిషీటు ప్రకారం ముగ్గురు ప్రత్యక్ష సాక్షులు ఉన్నట్లు కోర్టు దృష్టికి వచ్చింది. ఇందులో ఒకరి వాంగ్మూలం సేకరించేందుకు మూడు నెలలు పట్టినట్లు తెలిసింది. దీంతో వాది, ప్రతివాదుల వాంగ్మూలాల సేకరణ క్రాస్ ఎగ్జామినేషన్ రోజున లేదా మరుసటి రోజున పూర్తి కావాలని, అంతకుమించిన జాప్యం తగదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. తదుపరి విచారణ ఆరు వారాల తర్వాత జరుగుతుందని వెల్లడించింది.

## శ్రీనివాస్ కుటుంబ సభ్యులు రూ.50 వేల విరాళం

**విశాలాంధ్ర-విజయవాడ:**
ఇటీవల మృతిచెందిన సీపీఐ విజయవాడ నగర నాయకుడు సీహెచ్ శ్రీనివాస్ కుటుంబసభ్యులు సీపీఐ జాతీయ మహాసభల జయప్రదాన్ని కాంక్షిస్తూ రూ.50వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావుకు దాసరి భవన్‌లో శనివారం అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్, శ్రీనివాస్ కుమారుడు సీహెచ్ శ్రీధర్(చంటి), పార్టీ నగర కార్యవర్గ సభ్యులు దుగ్గిరాల సీతారావమ్మ, డివిజన్ నాయకులు సీహెచ్ రాజు, బందుల రామకోటయ్య తదితరులు ఉన్నారు.

## ఆంజనేయరాజు రూ.50 వేల విరాళం

**విశాలాంధ్ర-విజయవాడ:**
సీపీఐ 24వ జాతీయ మహాసభల జయప్రదాన్ని కాంక్షిస్తూ గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ టీవీఎస్ ఆంజనేయరాజు 50 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావుకు దాసరి భవన్‌లో శనివారం అందించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ప్రోగ్రెసివ్ ఫోరమ్ రాష్ట్ర నాయకులు బుడ్డిగ జమిందార్ పాల్గొన్నారు.

## మూడోరోజూ 'వందే'కు చిక్కులు

**బులంద్‌షహర్:** మరో వందే భారత్ రైలులో సాంకేతిక సమస్య ఏర్పడింది. శనివారం వారణాసి బయల్దేరిన ఈ ఎక్స్‌ప్రెస్ రైలులో ట్రాక్షన్ మోటార్ జామ్ అవడంతో మధ్యలోనే ఆగిపోయింది. దిల్లీ నుంచి వారణాసి బయల్దేరిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో.. మార్గమధ్యంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ సమీపంలో దన్‌కౌర్, వేర్ స్టేషన్ల మధ్య రైలు సీ8 కోచ్‌కు సంబంధించిన ట్రాక్షన్ మోటార్‌లో బేరింగ్ పనిచేయలేదు. సిబ్బంది ఆపరేషన్స్ కంట్రోల్ వ్యవస్థను అప్రమత్తం చేశారు. సాంకేతిక సిబ్బంది తనిఖీ చేసి.. ఎక్స్‌ప్రెస్ రైలును ఖుర్జా రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి ఆపారు. అక్కడ మరమ్మతులు చేసినా ఫలితం లభించలేదు. అందులోని ప్రయాణికులను శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో గమ్యస్థానాలకు చేర్చారు.

# మహా పాదయాత్రకు విశేషాదరణ

- వర్షంలోనూ తగ్గని ఉత్సాహం
- అమరావతి రాజధానిని సాధిస్తామని నినాదాలు

**విశాలాంధ్ర-పాలకొల్లు:**
అమరావతి నుంచి అరసవల్లి వరకు మూడు రాజధానులు వద్దు... ఒక రాజధాని ముద్దు అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి తమ భూములు ఇచ్చిన అమరావతి రైతులు చేపట్టిన మహా పాదయాత్ర 27వ రోజు శనివారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. శివదేవుని చిక్కాల, బల్లిపాడు, దగ్గులూరు, లంకల కోడేరు, బగ్గేశ్వరం వరకు పాదయాత్ర సాగిన తర్వాత మధ్యాహ్నం భోజన విరామ సమయం తీసుకున్నారు. అనంతరం పూలపల్లి మీదుగా పాలకొల్లు పట్టణంలోకి సాయంత్రం 6 గంటలకు ప్రవేశించి 15 కిలోమీటర్ల మేర కొనసాగింది. ఈ సందర్భంగా పాదయాత్ర రైతు రథం వద్ద కొబ్బరి కాయలు కొట్టి పూజల అనంతరం దారి పొడవునా స్థానిక మహిళలు పూలు జల్లి, హారతి పట్టి, డప్పు విన్యాసాలతో హోరెత్తించారు. జోరున వర్షం కురుస్తున్నా లెక్కచేయక, ఏమాత్రం ఉత్సాహం తగ్గకుండా పాదయాత్రను కొనసాగించారు.

### టీడీపీ సంఘీభావం... పాదయాత్రలో శాసనసభ్యులు

ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అధ్వర్యంలో అమరావతి రైతులకు పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల వద్ద ఘన స్వాగతం పలికారు. 250 ట్రాక్టర్లతో రైతులు ర్యాలీగా నడుస్తూ జై అమరావతి నినాదాలు చేశారు. పోలపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత రాజధాని అమరావతి అంటూ అంబేద్కర్ చిత్రపటం ఉన్న ఫ్లెక్సీలతో నినాదాలు చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ అమరావతి రాజధానిగా కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా సమైక్యంగా కోరుకుంటున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అసలైన రాజధాని అమరావతి మాత్రమే అని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ అమరావతి రాజధానిగా ఉండడం అనేది చారిత్రక అవసరమన్నారు. ఈ విషయంలో అమరావతి రైతుల మనోభావాలను ముఖ్యమంత్రి జగన్ అర్థం చేసుకోవాలని కోరారు. మూడు రాజధానుల వల్ల రాష్ట్రానికి ఏమి ఉపయోగమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్ పునరాలోచించుకోవాలని, లేదంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఇదే వైఖరి కొనసాగితే రాబోయే ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కవన్నారు. టీడీపీ నుంచి శాసన మండలి మాజీ చైర్మన్, పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ.షరీఫ్, నరసాపురం నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు, పాలకొల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ, భగవాన్ రాజు, పిచ్చెట్టి బాబు, చామంతుల సత్యనారాయణ, కోడి విజయభాస్కర్, ధనాన్ని సూర్య ప్రకాష్, అనేక మంది టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. జనసేన నాయకుడు ప్రేమ్ కుమార్ తదితరులు మద్దతు తెలిపి పాదయాత్రలో పాల్గొన్నారు.

### సీపీఐ మద్దతు

అమరావతి నుంచి అరసవల్లికి రైతులు తలపెట్టిన మహా పాదయాత్రకు శివదేవుని చిక్కాల వద్ద సీపీఐ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు, జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు, పార్టీ నరసాపురం ఏరియా కార్యదర్శి నెక్కంటి క్రాంతి కుమార్, కార్యకర్తలు స్వాగతం పలికి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానుల ముక్కలాటలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పాలకులకు చిత్తశుద్ధి ఉంటే సరిపోతుందని, పాలనా వికేంద్రీకరణతో అభివృద్ధి చెందుతుందని చెప్పటం ముఖ్యమంత్రి అసమర్థ వైఖరికి నిదర్శనమని, అమరావతి రాజధానిగా ప్రకటించే వరకు సీపీఐ నుంచి రైతులు చేసే పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొని మద్దతు తెలుపుతామని అన్నారు.

# మీడియా ప్రజల పక్షాన నిలవాలి

## విశ్రాంత జస్టిస్ సత్యనారాయణమూర్తి

**విశాలాంధ్ర- విజయవాడ:**
మీడియా నిత్యం ప్రజల పక్షమే ఉండాలని, అదే అత్యంత ప్రాధాన్యతగా ఉండాలని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి అన్నారు. అక్టోబరు 30, 31 తేదీలలో చెన్నైలో జరిగే ఇండియన్ జర్నలిస్టు యూనియన్ 10వ ప్లీనరీకి సన్నాహకంగా విజయవాడలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) అధ్వర్యంలో విజయవాడలోని ఆలపాటి రామారావు ఫంక్షన్ హాల్‌లో 'ప్రజలు, ప్రభుత్వం-మీడియా బాధ్యత' అనే అంశంపై శనివారం సదస్సు జరిగింది. జస్టిస్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలు, సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలన్నారు. సహేతుక ఆధారాలు లేకుండా వార్తలు రాస్తున్నారని, దీంతో ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా ప్రజల్లో నమ్మకం కోల్పోతుందన్నారు. పరిశోధనాత్మక జర్నలిజం కూడా పూర్తి పారదర్శకంగా ఉండటం లేదన్నారు. సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించే జర్నలిస్టులకు గుర్తింపు ఉంటుందన్నారు. సోషల్ మీడియా కారణంగా జర్నలిస్టుల విలువ మరింత దిగజారిందన్నారు. న్యాయ చిక్కులతో అనవసరంగా ఇబ్బందులు తెచ్చుకోవద్దని హితవు పలికారు.

### మీడియా స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వాలు: శ్రీనివాసరెడ్డి

ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛను హరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సమాజంలో మీడియా కీలక పాత్ర పోషిస్తున్నా జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వార్తలు రాస్తే, కార్టూన్లు గీస్తే ప్రభుత్వాలు కన్నెర్ర చేస్తున్నాయన్నారు. వార్తా కథనం పాలకులకు నచ్చకపోతే దేశద్రోహం కేసులు పెడుతున్నారని ఆరోపించారు. అధికారులను కలిసి సమాచారం సేకరించే హక్కు లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వాలకు మంచి-చెడు చెప్పే స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారని, ఇది భవిష్యత్తులో మీడియా ఉనికికే ప్రమాదమన్నారు. జర్నలిజం ప్రమాదకర వృత్తిగా ఐక్యరాజ్యసమితి ఇటీవల ప్రకటించిందని తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి జి.అనిత మాట్లాడుతూ నిజమైన జర్నలిస్టులకు కనీస వేతనం అందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సోర్స్ క్రెడిబిలిటీ అనేది జర్నలిజంలో చాలా కీలకమన్నారు. ఇప్పుడు ఆ సోర్స్ అనేది లేకుండా పాలకులు చంపేస్తున్నారని తెలిపారు. పెద్ద మీడియాలో పని చేసినంత మాత్రాన సంతృప్తిగా ఉన్నారనేది అవాస్తవమన్నారు. ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు మాట్లాడుతూ వ్యాపారులు మీడియాలోకి వచ్చిన తరువాత విలువలు దిగజారిపోయాయని చెప్పారు. నిజమైన జర్నలిస్టులు ఉన్నా యాజమాన్యం చెప్పినట్లు వార్తలు రాయాల్సి ఉందన్నారు. ఐజేయూ కార్యవర్గ సభ్యులు సోమసుందర్ మాట్లాడుతూ పచ్చమీడియా, నీలిమీడియా యాజమాన్యాలు కలిసి జర్నలిస్టు సమ్మె విచ్ఛిన్నానికి ఒడిగట్టిన విషయాన్ని గుర్తు చేశారు. జర్నలిస్టుల సమస్యలపై యాజమాన్యాలు స్పందించటం లేదన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉన్న హక్కులను ప్రభుత్వాలు నాశనం చేశాయని విమర్శించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టులపై కేసులు పెట్టడం సర్వసాధారణమైందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులను ప్రభుత్వాలు యాజమాన్య కోణంతో చూడకూడదన్నారు. ఐజేయూ కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేశ్ మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకురావల్సిన గురుతర బాధ్యత మీడియాపై ఉందన్నారు. వాస్తవాలతో కూడిన జర్నలిజం అవసరమని ఆయన పేర్కొన్నారు. తొలుత ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ అతిథులకు స్వాగతం పలికారు. సదస్సుకు జర్నలిస్టులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు.

# కాంగ్రెస్ అధ్యక్ష బరిలో ఖర్గే, థరూర్

- 17న ఎన్నిక
- 19న ఓట్ల లెక్కింపు

**న్యూఢిల్లీ:**
కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సీనియర్ నాయకులు మల్లికార్జున ఖర్గే, శశిథరూర్ మధ్య పోటీని పార్టీ శనివారం అధికారికంగా ప్రకటించింది. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసిన క్రమంలో ఈనెల 17న ఎన్నికలు జరుగుతాయని పేర్కొంది. 2000లో ఈ పదవికి చివరిసారిగా ఎన్నికలు జరిగాయి. సోనియాగాంధీ చేతిలో జితేంద్ర ప్రసాద ఓటమి పాలయ్యారు. 24ఏళ్ల తర్వాత గాంధీ కుటుంబయేతరుడు పార్టీ అధ్యక్ష బాధ్యతలను చేపట్టనుండటంతో ఈ ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడింది. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంక పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నారు. ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వారు మల్లికార్జున ఖర్గే, శశిథరూర్. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. వీరిద్దరూ వాటిని వెనక్కి తీసుకోలేదు కాబట్టి ఇద్దరి అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తున్నాం' అని ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల యంత్రాంగానికి చైర్మన్‌గా ఉన్న మధుసూదన్ మిస్త్రీ తెలిపారు. అధికారికంగా ప్రచారం మొదలు కాగా ఇద్దరు అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఇప్పటికే ప్రారంభించారని చెప్పారు. 17వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని, రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ఉంటుందని మిస్త్రీ తెలిపారు. బ్యాలెట్ బాక్సులను దిల్లీకి తరలించిన అనంతరం 19వ తేదీన ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటిస్తామన్నారు. కర్ణాటకలో భారత్ జోడో యాత్ర క్యాంపునకూ బ్యాలెట్ పేపర్లు పంపుతామని, యాత్రీకులు ఓటు వేసేందుకు బూత్ ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఎన్నికల కోసం మార్గదర్శకాలు జారీ చేశామని, అందరూ వాటిని అనుసరిస్తున్నారని అన్నారు. ఇద్దరు అభ్యర్థులకు సమాన అవకాశాలు ఉన్నాయని, ఎవరో ఒకరికి అనుకూలంగా ఉండే పరిస్థితి లేదని మిస్త్రీ చెప్పారు. ఎన్నికల ప్రక్రియ క్రమంలో ఒక ఫిర్యాదు రాగా దానిని పరిష్కరిస్తామన్నారు. ఖర్గేకు కొందరు ఆఫీసు బేరర్లు బహిరంగంగానే మద్దతు ప్రకటిస్తున్నట్లు థరూర్ వర్గీయులు ఫిర్యాదు చేసినట్లు వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు.

# సమైక్యతే భారత్ జోడో ఉద్దేశం

## రాహుల్ గాంధీ

**తురువెకెరా:** కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న ఇద్దరిలో ఎవరినీ నియంత్రించే పరిస్థితి లేదని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. పార్టీ తదుపరి అధ్యక్షుడిని గాంధీ కుటుంబం రిమోట్‌తో నియంత్రిస్తుందన్న వాదనలను తోసిపుచ్చారు. అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న ఖర్గే, శశిథరూర్ శక్తిమంతులు. అవగాహన ఉన్న నాయకులు. వారిని ఎవరూ నియంత్రించలేరని రాహుల్ అన్నారు. ఆయన శనివారం భారత్ జోడో యాత్ర క్రమంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాత్రలో తనకు లక్షలాది మంది తోడున్నారని, బీజేపీ రాజకీయాలతో వారంతా విసిగిపోయి ఉన్నారని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అసమానతలు, అసహనం పెట్రేగిపోయాయని రాహుల్ గాంధీ చెప్పారు. ఈ పదవి కోసం మీరు ఎందుకని పోటీ చేయలేదని ఓ విలేకరి ప్రశ్నించగా 2019లో సమర్పించిన రాజీనామా లేఖలో అందుకుగల కారణాలను స్పష్టం చేశానని రాహుల్ బదులిచ్చారు. తాము కార్పొరేట్లకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. రాజస్థాన్‌లో అదానీ పెట్టుబడులు, గెహ్లాట్ ప్రశంసలపై ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క వ్యాపారవేత్తకో ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. రాజస్థాన్ ప్రభుత్వం అదానీకి తప్పుడు మార్గాల్లో వ్యాపారాన్ని కట్టబెడితే తప్పక వ్యతిరేకిస్తానని తేల్చిచెప్పారు. 'రాజకీయాలు చేసి, కొంత మందికే ప్రాధాన్యం ఇస్తూ పనులు అప్పగించడాన్నే వ్యతిరేకిస్తాను. ఇద్దరు, ముగ్గురు లేదా నలుగురు పారిశ్రామికవేత్తలకు మాత్రమే రాజకీయపరమైన సాయం అందుతున్నది. దేశంలోని ప్రతి వ్యాపారాన్ని గుత్తాధిపత్యానికి ఇచ్చేస్తున్నారు. ఇలా చేస్తే దేశం బలహీనమవుతుంది. దీనిని వ్యతిరేకిస్తాను. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం అన్ని వ్యాపారాలను కొందరికే కట్టబెడుతోంది. రాజస్థాన్‌లో రూ.60వేలకోట్ల పెట్టుబడులు పెడతామని అదానీ చెప్పారు. ఏ ముఖ్యమంత్రీ ఈ అవకాశాన్ని వదులుకోరు. వదులుకోవాలని అనుకోవడం.. చెప్పడం కూడా సరైనది కాదు. రాజస్థాన్ ప్రభుత్వం వద్ద అదానీకి ప్రత్యేక విధానాలేమీ లేవు' అని రాహుల్ అన్నారు. తాను స్వతహాగా 'తపస్య'ను నమ్ముతానని, భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజలను చేరుకుంటూ వారి బాధలను పంచుకోవాలని కోరుకుంటున్నానని ఆయన తెలిపారు.

# చదువు స్వల్పం జ్ఞానం అపారం

"పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది" అన్నది ఒక నానుడి. ఇది కొందరి విషయంలో అక్షర సత్యమవుతుంది. అట్టివారే కేరళ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకరైన ఎన్‌ఈ బలరాం. మంత్రిగా పనిచేసింది ఏడాది కాలమే అయినా కేరళ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఎన్‌ఈ బలరాం అవిరళ కృషి చేశారు. బలరాం మృదు స్వభావి. నిబద్ధతగల విప్లవయోధ. కార్మికవర్గం, అణగారిన వర్గాల ప్రయోజనాల కోసం అవిశ్రాంత కృషి చేశారు. బలరాం (1919 నవంబరు 20 - 1994 జులై 16) సంస్కృత భాషా పండితుడు కూడా. మలయాళ సాహిత్యంలో ఆయన రచనలను ముఖ్యంగా సాహిత్య విమర్శలకు ప్రామాణికంగా భావిస్తారు. స్వాభావికంగా ఆయన సౌమ్యుడు. కేరళ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల గౌరవాభిమానాలను పొందినవ్యక్తి. సాహిత్యం , చరిత్ర, తత్వశాస్త్రం, రాజకీయాలు ఆయన అభిమాన విషయాలు. 1919 నవంబరు 20న జన్మించిన నలీల్ ఇదువలత్తు బలరామన్ (తరువాత బలరాంగా కుదించారు) కేవలం 8వ తరగతి వరకు మాత్రమే చదివారు. అయితే డజనుకు పైగా పుస్తకాలు రచించి మంచి వక్తగా మారటానికి ఈ నామమాత్రపు చదువు ఆయనకు ఆటంకంగా నిలువలేదు. ఆయన రచించిన పుస్తకాల్లో ఇంగ్లీషులో రాసిన "హిస్టరీ ఆఫ్ ది కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర)" ఒకటి. బలరాంను సీపీఐలో గొప్ప సిద్ధాంతవేత్తగా పరిగణించేవారు.


ఎన్‌ఈ బలరాం

55 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఆయన సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ సమితి, కార్యవర్గ సభ్యుడితో సహా అనేక పదవులను నిర్వహించారు. ఎం.ఎన్. గోవిందన్ నాయర్, అచ్యుత మీనన్ తరానికి చెందిన రాజకీయ వేత్త, పార్టీ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ సభ్యునిగా, ఇతర నిర్మాణ బాధ్యతలను నిర్వహించారు. హిందూత్వ భావజాలం పై ఆయన రాసిన చిన్న పుస్తకం అనేక భాషలలోకి అనువాదమైంది.

కేరళలో అనేక మంది కమ్యూనిస్టులు, మార్క్సిస్టుల వలే బలరాం కూడా కాంగ్రెసు నుంచి సీపీఐలో చేరారు. 1934 లో భారత జాతీయ కాంగ్రెసు (ఐఎన్‌సి)లో చేరకముందు ఆయన పెరవూరులో పాఠశాల ఉపాధ్యాయుడిగానూ, రామకృష్ణ మిషన్లోనూ చురుకుగా పనిచేశారు. 1936లో కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో చేరారు. కాంగ్రెసు సోషలిస్టుగా వున్న బలరాం 1939లో కమ్యూనిస్టుగా మారారు. కేరళ శాసనసభకు ఆయన 1957, 1960, 1970లో మూడుసార్లు ఎన్నికయ్యారు. అచ్యుత మీనన్ మంత్రివర్గంలో 1970 అక్టోబర్ నుంచి 1971 సెప్టెంబర్ వరకు పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ సంవత్సర కాలంలోనే కేరళ పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు అనేక చర్యలు చేపట్టారు. 1994 జులై 16న కన్నుమూయటానికి ముందు పది సంవత్సరాలుగా బలరాం సీపీఐ తరపున రాజ్యసభలో కేరళ నుంచి ప్రాతినిధ్యం వహించారు.

రైతు, కార్మిక ఉద్యమాల్లో కూడా ఆయన చురుకుగా పనిచేశారు. అనేకసార్లు జైలు జీవితాన్ని అనుభవించారు. బీడీ కార్మికుల ఆందోళనకు నాయకత్వం వహించిన బలరాం 1938లో రెండు మాసాలు జైలులో ఉన్నారు. వల్లూరు జైలులో 1941, 1942 లో డిటెన్యూగా వున్నారు. రైతు ఆందోళనలో పాల్గొన్నందుకు 1963లో 45 రోజులపాటు జైలు జీవితాన్ని గడిపారు. పార్టీపై నిషేధం అమలులోవున్న సమయంలో 1939, 1940లో అనేకసార్లు, 1947 నుంచి 1952 వరకు ఆయన ప్రవాస జీవితాన్ని గడిపారు.

బలరాం రచించిన గ్రంథాల్లో "ఇండియా యుదేవరని (భారత ఆవిర్భావం), మనుష్యోతి (మానవుని పుట్టక), ధనశాస్త్ర శిల్పికల్, మనషాన్‌ఆశావయుం (మనిషి, ఆలోచనలు), మూను ఇంటర్నేషనల్ కలుడే చరిత్రం (మూడో ఇంటర్నేషన్ చరిత్ర) తార్కతింటె త్వేవేరి (తత్వశాస్త్ర మూలం) ఇదతు పక్ష కమ్యూనిజం - చరిత్ర పరమేప దనం. (వామపక్ష కమ్యూనిస్టులు- చారిత్రాత్మక అధ్యయనం), ఆధునిక ముతలలలితం (ఆధునిక పెట్టుబడిదారీ విధానం) వున్నాయి. ఈ గ్రంథాలు అన్నీ మళయాళంలో రాసినవే.

-మోదుమూడి మురళీకృష్ణ

# తెలంగాణ 'టైగర్' నల్లా నర్సింహులు

"జనగామ పులి" తెలంగాణ టైగర్" ఇవి నల్లా నర్సింహులకు పోలీసులు పెట్టిన పేర్లు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో విసునూరు దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి అతని తల్లి జానికమ్మ దొరసానులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు విఖ్యాతమైనవి. పోరాట ప్రారంభానికి పూర్వం జరిగిన బందగీ హత్య, చాకలి ఐలమ్మ తిరుగుబాటు జరిగిన పాలకుర్తి, పోరాట ప్రారంభానికి గుర్తుగా పేర్కొనే దొడ్డి కొమరయ్య హత్య జరిగిన కడివెండి గ్రామం, దేవరుప్పల, కామారెడ్డి గూడెం, ధర్మారం గ్రామాలు-ఇవన్నీ విసునూరు దేశ్‌ముఖ్ ఆధీనంలోని గ్రామాలే. ఈ కడివెండి గ్రామంలోనే 1926 అక్టోబర్ 2న చేనేత కుటుంబంలో నల్లా నర్సింహులు జన్మించాడు. ఆంధ్రమహాసభ జనగామ తాలూకా అధ్యక్షునిగా పోరాట ప్రారంభానికి ముందే ఎన్నికైన నర్సింహులు పోరాటకాలంలో ఆ ప్రాంత దళనాయకునిగా పనిచేశాడు.

నల్లా నర్సింహులు

"నిజాం సంస్థానానికి వచ్చిన పేరు నిజాం దగ్గర మూలిగే కోట్లాది ధనరాసుల వల్ల రాలేదు. కమ్యూనిస్టులు సాగించిన పోరాటాలే ప్రపంచ ప్రఖ్యాతిని చేకూర్చాయి" అని 1949లో హైదరాబాద్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో సర్దార్ పటేల్ అన్నాడన్నా, అదే సభలో కమ్యూనిస్టుల్ని అణచివేస్తాం, చంపేయమని సైనికులకు ఆదేశాలు యిచ్చామని బహిరంగంగా ప్రకటించాడన్నా అందుకు నర్సింహులు లాంటి వీరులు జరిపిన సాహస కృత్యాలే కారణం.

ఇదే కాలంలో బైరాన్ పల్లిలో వరుసగా నిలబెట్టి 84 మందిని మిషన్ గన్లతో కాల్చి చంపిన ఘటన, బాబు దొర (దేశ్‌ముఖ్ కొడుకు) నాయకత్వంలో గూండాల దాడులు, ధర్మాపురంలో లంబాడి సోదరులు ఠాను, సోమ్లా మరో నలుగురిని వారి చేతే చితి పేర్పించి వారిని అందులో వేసి సజీవ దహనం చేయటం; గ్రామాలపై బడి దోపిడీలు, స్త్రీలపై అత్యాచారాలు వీటిని ప్రతిఘటించిన ప్రజలు; ద్రోహులు, గూండాలు ప్రజల చేతిలో హతమవ్వటం లాంటి అనేక ఘటనలు జరిగాయి. నర్సింహులును మొదట అరెస్టు చేసి హైదరాబాద్ జైల్లో పెట్టి, తర్వాత మహబూబ్ నగర్‌కి మార్చారు. ఆ జైలు నుండి మరో కామ్రేడ్‌తో కలిసి పారి పోయాడు. అక్కడ నుండి ద్రోణాచలం మీదుగా విజయవాడకు చేరి కృష్ణాజిల్లాలోని ఒకగ్రామంలో తమ్మారెడ్డి గారి ఆధ్వర్యంలో జరిగిన 10 రోజుల సైనిక శిక్షణ, కొండపల్లి కొండల్లో ప్రాక్టికల్ శిక్షణ పొందాడు. ఆ తర్వాత రహస్యంగా వుంటూనే కడివెండి ప్రాంతంలో పనిచేశాడు. మానుకోట అటవీ ప్రాంతానికి వెళ్తూ దారిలో ఒక ద్రోహి కారణంగా అరెస్టు చేయబడ్డాడు (ఆ తర్వాత ఆ ద్రోహిని పార్టీ దళం ఖతం చేసింది.)

అరెస్టు కాబడిన తర్వాత మిలిటరీ క్యాంపులో గౌరవంగా చూశారు.1949, ఫిబ్రవరి 27 తర్వాత దొరికిన కమ్యూనిస్టుల్ని కాల్చివేయమని వారికి పైనుంచి ఆదేశాలు వున్నాయి. కానీ నర్సింహులు 26వ తేదీన అరెస్టు కాబడినందున అతనికి ఈ ఉత్తర్వులు అన్వయించవని నమోదు చేసి ఆ అధికారి రక్షించి నల్గొండ జైలుకు పంపించాడు గతంలో పారిపోయిన రికార్డు వుండటంతో కాళ్లకు గొలుసులు వేశారు. అక్కడ నుండి తిరుమలగిరి మిలిటరీ జైలుకు మార్చారు. అక్కడ 300 గదులున్నాయి. పైగా కట్కూరి, ఆరుట్ల, గురువారెడ్డి, ఎల్లారెడ్డి లాంటి నాయకులంతావున్నారు. అక్కడ నుండి జాల్నా జైలుకు, ఆ తదుపరి ఔరంగాబాద్ జైలుకి మార్చారు. అక్కడ 150మంది ఉండాల్సిన చోట 900 మందిని కుక్కారు. జైళ్లలో సైతం సహచరులతో కలిసి సౌకర్యాలు సాధనకు నిరాహార దీక్షలు చేసి విజయాలు సాధించాడు.

హైదరాబాద్ సంస్థానంలో కమ్యూనిస్టులు, రజాకార్లు జరిపిన నేరాలు విచారణకు 3 ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేశారు. ఈ రకంగా ఇద్దర్నీ సమానం చేశారు. ఆ ట్రిబ్యునల్ ముందు నర్సింహులు పై 4 నేరాలు మోపారు (నిందితులు వకీళ్లని నియమించుకోటానికి, కోర్టు ఇచ్చిన వకీళ్ల సహయం తీసుకోటానికి నిరాకరించారని" రికార్డు చేసి విచారణ తంతు ముగించి ఒక కేసులో మూడేళ్ల శిక్ష, మిగిలిన మూడు కేసుల్లో ఉరిశిక్ష విధించారు. ఉరిశిక్ష విధించబడిన వారిలో నర్సింహులుతో పాటు దర్యా, పెద్దిరామయ్య, కర్రె మల్లయ్య, వీర ముష్టి వీరయ్య, దేశపల్లి కొండయ్య, పైండ్ల యాదగిరి వున్నారు. వేరే కేసుల్లో 15 సం॥రాలు ఎర్రబోతు రాంరెడ్డితో సహా మొత్తం 50 మందికి ఉరిశిక్ష వేశారు.

ఇందులో 12 మందికి హైకోర్టు అప్పీలుకు అవకాశం ఇవ్వకుండా ఉరితీయాలని ప్లాను వేశారు. కానీ విషయం బయటకు పాకి ఆందోళనలు చేయటం, ఉరిశిక్షలకు వ్యతిరేకంగా ప్రతీకార దాడులు ఉధృతం కావటంతో ఆ పని విరమించుకున్నారు.

నర్సింహులు మరో ఖైదీతో కలిసి హైకోర్టు విచారణ సమయంలో మళ్లీ తప్పించుకున్నాడు. ఉరిశిక్షని హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా ఖాయపరిచాయి. ఆ తర్వాత మళ్లీ అరెస్టు కాబడ్డాడు.

పోరాట విరమణ అనంతరం పార్టీ కృషి - ముఖ్యంగా సుందరయ్య గారి శ్రద్ధ వల్ల - 50 మందిపైనా ఉరిశిక్ష - యావజ్జీవ శిక్షగా మార్చారు. పైగా 1957, 1958 రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భాలలో చాలా మందిని విడుదల చేశారు. చివరకు నర్సింహులు, గోపయ్య అనే ఇద్దరు మాత్రం మిగిలారు. సుందరయ్య గారు రక్తం కక్కుకొని మద్రాసు ఆసుపత్రిలో చేరాడు. బతికే ఆశలేదని చివరకు రష్యా పంపాలని నిర్ణయించారు. ఆయన్ని పరామర్శించటానికి ముఖ్యమంత్రి సంజీవరెడ్డి రాగా ఆయన్ని సుందరయ్య కోరిన మీదట నర్సింహుల్ని 1959 జనవరి 26న విడుదల చేశారు. ఆరకంగా పోరాట విరమణ తర్వాత 8 సంవత్సరాలకు నర్సింహులు బయటపడ్డాడు. 1968-69లో తరిమల నాగిరెడ్డి కుట్రకేసులో ముద్దాయిగా వుండి, విడుదలైన తరువాత సీపీఐలో చేరి 1993 నవంబర్ 5న హైదరాబాద్‌లో తనువు చాలించారు.

- చెరుకూరి సత్యనారాయణ.

## కష్టజీవుల గుడిసెల్లో

కష్టజీవులా గుడిసెల్లో వెలిగేటి దీపమా
కార్మికుల గుండెల్లో కొలువైన రూపమా
మాయమ్మ ఎర్రని జెండా
ఓయమ్మా ఎర్రని జెండా
వేల రంగులున్నా గానీ వెలుగు దివ్వె నీవేనమ్మా
॥క॥

పొద్దు పొడవని దేశాలున్నా
నువ్వులేని చోటు వున్నదా
అమ్మ ప్రేమకు దూరమైన.... నీ....
ఆలన లేని బ్రతుకున్నదా
అయినోల్లెవరు లేకపోయినా
మా ఆత్మబంధువు నీవేనమ్మా
॥క॥

మనిషి మనిషిని వేరు చేసేటి
కులాల రొంపి వద్దన్నావు
మతము లేని నవలోకం కోసం
కొత్త ఆశలు మాలో రేపావు
సమ సమాజ స్థాపన కోసం
సైనికులై మము నడవమన్నావు
॥క॥

రవి అస్తమించిన రాజ్యములో నీవు
ఎగిరే ఎర్రని మందార మాలవు
మార్క్సు మహనీయుని మదిలోన పూసిన
మానవాళి కవచ కుండలానివి నీవు
చెరిగిపోనీ నీ చరిత ఎవరికుందమ్మా ఘనత
నా జన్మకే మా అమ్మ నువు లేకుంటే ఉండలేనమ్మ
॥క॥

- మారెళ్ల శ్రీ తిరుపతి

# మహోజ్వల మునగాల రైతు పోరాటం

బ్రిటీష్ ప్రభుత్వం 1852లో మునగాలకు జమిందారీ హోదా కల్పించింది. 1900 సంవత్సరంలో నాయని వెంకటరంగావు జమిందారు అయ్యాడు. ఈయన కాంగ్రెసులో ఉంటూ అనేక గ్రంథాలయాలను, విద్యాసంస్థలను స్థాపించటానికి విరివిగా విరాళాలు ఇచ్చాడు. కానీ ఈయన పాలన మాత్రం మధ్యయుగాల నాటి ఫ్యూడల్ భూస్వామ్య నియంతృత్వాన్ని తలపించేది. ఈయన ఆగడాలకు అంతేలేదు. రైతులు, రైతు కూలీల పట్ల కర్కశంగా వ్యవహరించాడు. పేద రైతులు జమిందారు భూములను ఉచితంగా దుక్కిదున్నాలి. వ్యవసాయ పనులు చేసి పెట్టాలి. పంటలు పండినా పండకపోయిన, కరువుకాటకాలు, అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు వచ్చినా దయాదాక్షిణ్యాలు లేకుండా శిస్తులు వసూలు చేసేవారు. వివిధ వృత్తిదారులు జమిందారుకు ఉచిత సేవలు అందించాలి. నీటిపారుదల విషయంలో జమిందారుకు ఎటువంటి శ్రద్ధా ఉండేదికాదు. రైతులు వద్ద వున్న సారవంతమైన భూములను ఏదో వంకతో జమిందారు కైంకర్యం చేసేవాడు. ఎదురు తిరిగిన రైతులను, కూలీలను తన సొంత గూండాలను వినియోగించి దేహశుద్ధి చేయించేవాడు.

తెలంగాణ ప్రాంతంలోని రైతాంగ ఉద్యమ ప్రభావంతో మునగాల జమిందారీ ప్రాంతంలో రైతు సంఘాన్ని నిర్మించే ఉద్దేశంతో కమ్యూనిస్టు పార్టీ నండూరి ప్రసాదరావును మునగాల పంపింది. మునగాల పరగణాలోని 41 గ్రామాలలో నండూరి, జోశ్యభట్ల సత్యనారాయణ, మోటూరి పరంధామయ్యలు తిరిగి రైతులను రైతు సంఘంలో సభ్యులుగా చేర్చి జమిందారీ దురాగతాలపై వారిని చైతన్య పరిచారు. మునగాల జమిందారు రాజా రంగారావు కలకోవ గ్రామంలో తన 20 ఎకరాల పొలంలో పంట రైతులతో కోయించుకుని డబ్బులు ఇవ్వకుండా వెట్టిచాకిరీ క్రింద కట్టేశాడు. ఈ విషయం తెలిసిన రైతు సంఘం నాయకులు మునగాల వెళ్ళి కూలీ ఇవ్వవలసిందేనని డిమాండ్ చేశారు. జమిందారు నాలుగు కుండల ధాన్యం బదులు మూడు కుండలు ఇస్తానని పేచీపెట్టాడు. దీనితో రైతు సంఘం సత్యాగ్రహం మొదలుపెట్టింది. ఇదే 'కలకోవ సత్యాగ్రహం'గా ప్రసిద్ధి పొందింది. దీనితో ప్రజలు తండోపతండాలుగా కదలివచ్చి ఆందోళన చేయటంతో కలెక్టరు జోక్యం చేసుకుని రైతులందరూ ఇచ్చే పద్ధతిలో కూలీ ఇప్పించటంతో ఉద్యమం ముగిసింది.

జమీన్ రైతు నాయకులు నెల్లూరు వెంకట్రామ నాయుడు 1933 సెప్టెంబరులో మూడు రోజులు మునగాల పరగణాలో పర్యటించి 'జమిన్‌రైతు' పత్రికలో రైతుల కష్టాలను గూర్చి ప్రచురించాడు. 1938లో రైతు సంఘం గ్రామ గ్రామాన విస్తరించింది. గ్రామాలలో ఉద్రిక్తత చోటు చేసుకున్న స్థితిలో కాంగ్రెసు నాయకుడు గొట్టిపాటి బ్రహ్మయ్య రైతులకు జమిందారుకు రాజీ కుదిర్చాడు.

దానిని 'బ్రహ్మయ్య అవార్డు' అంటారు. దీనిని కూడా జమిందారు రంగారావు ఉల్లంఘించటంతో రైతు సంఘం నేతృత్వంలో సత్యాగ్రహం జరిగింది. దీనికి తోడు జమిందారు నడిగూడెం గ్రామంలో ఇమ్మడి పాపయ్య అనే రైతుకు చెందిన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించాడు. దానితో రైతు సంఘం ఆధ్వర్యంలో 15రోజుల పాటు సత్యాగ్రహం జరిగింది. జట్లు జట్లుగా రైతులు భూమి సాగు ప్రారంభించారు. దీనితో పోలీసులు రంగప్రవేశం చేసి నండూరి, జోశ్యభట్ల, మోటూరులను అరెస్టు చేసి, లాఠీ చార్జీ చేసి రైతులను చితకబాదారు. అయినా పోరాటం ఆగలేదు. చివరకు మద్రాసు ప్రభుత్వం ప్రతినిధులు వచ్చి తాము సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి సత్యాగ్రహం విరమింపజేశారు. కానీ అరెస్టు అయిన నాయకులు నండూరి, జోశ్యభట్ల, మోటూరులను 11 నెలలపాటు రాజమండ్రి సెంట్రల్ జైలులోనే ఉంచారు. బ్రహ్మయ్య అవార్డు అనంతరం రాజమండ్రి జైలు నుండి నాయకులను విడుదల చేశారు. జమిందారు బలవంతంగా లాక్కున్న, భూములన్నీ తిరిగి రైతులకు ఇవ్వబడ్డాయి. పొలాల్లోని చెట్లు రైతులకే చెందాయి. ఈత, తాటి చెట్లపై హక్కు రైతులదే. ఈ పోరాటం వల్ల గ్రామాలలో జమిందారు మనుషులు, గూండాలు సృష్టించిన భీభత్సం అంతమయ్యింది. ప్రకాశం పంతులు, ఎన్.జి.రంగా సైతం గ్రామాలలో పర్యటించి శాంతియుత పరిస్థితులు కల్పించారు. మునగాల పరగణా రైతుల హక్కులకై కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘాలు నిర్వహించిన పోరాట ఫలితంగా 4 వేల ఎకరాల భూమి తిరిగి రైతుల స్వాధీనం అయ్యింది. బచ్చు జగన్నాథం, ఉప్పలరామయ్య, నల్లపాటి వెంకట నర్సయ్య, వేములపల్లి హనుమంతరావు, కుక్కడపు రంగయ్యలు రైతు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. బండారు వెంకయ్య, సోమిరెడ్డి జగ్గయ్య, పాసంగోపయ్య, జూలకంటి బుచ్చయ్య వంటి 42 మంది అమరులు మునగాల పరగణాలో ఉన్నారు. వారి త్యాగం వృథాపోదు. సీపీఐ 24వ మహాసభల సందర్భంగా మునగాల రైతుల వీరోచిత త్యాగాన్ని మరోసారి స్మరించుకుందాం.

- చలసాని వెంకట రామారావు.

# జీవితమంతా పోరాటమే

భారత కమ్యూనిస్టుపార్టీతో అనుబంధాన్ని ఒక్కసారి నెమరువేసుకుంటే...జీవితమంతా పోరాటమయమేనని అర్థమవుతుంది. సొంతం ఫుల్‌టైమర్‌గానే పనిచేశాను. జూలై 1న సుబ్బయ్య, రామమ్మలకు ప్రకాశం జిల్లా (పూర్వ నెల్లూరు జిల్లా) పొన్నలూరు మండలం చౌటుపాలెంలో జన్మించిన నాకు 1-5 తరగతుల చదువు చౌటుపాలెం ఎలిమెంటరీ స్కూలులోనే ముగిసింది. 6-7 తరగతులు పొన్నలూరు హైస్కూలులో, 8-12 తరగతులు కందుకూరు జెడ్‌పీహెచ్ స్కూలులో, డిగ్రీ టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో కొనసాగింది. విశాఖ ఉక్కు ఉద్యమం నా జీవితాన్ని మలుపు తిప్పింది. 1966లో ఆ ఉద్యమం జరుగుతున్న దశలో 11వ తరగతి చదువుతూ విద్యార్థిగానే...అందులో పాల్గొన్నాను. నిజానికి ఏఐఎస్ఎఫ్ అందులో క్రియాశీలంగా ఉండటంతో ఆకర్షితుడనయ్యాను. 1967లో ఏఐఎస్ఎఫ్‌లో చేరా. అదే ఏడాది సీపీఐలో సభ్యత్వమిచ్చారు. 1969లో మారెళ్లగుంటపాలెం (గుంటూరు జిల్లా) చారిత్రాత్మక రాష్ట్రస్థాయి ఏఐఎస్ఎఫ్ రాజకీయ పాఠశాలకు వారం రోజులు హాజరయ్యాను. ఆ పాఠశాలలో 250 మంది పాల్గొనగా, అందులో బాలికలు 60 మంది వరకూ హాజరయ్యారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు భూపేష్‌గుప్తా దాన్ని ప్రారంభించారు. కంభంపాటి సీనియర్, జూనియర్, గుజ్జుల, నీలం, గిరిప్రసాద్, విజయ్‌కుమార్ క్లాసులు చెప్పారు. సైద్ధాంతికంగా ప్రేరణ కలిగించిన క్లాసులవి.

1969లోనే నెల్లూరు జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాను. 1970 ఫిబ్రవరిలో ప్రకాశంజిల్లా ఏర్పాటుతో జిల్లా తొలి ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలుచేపట్టి, 74 వరకు కొనసాగాను. జై ఆంధ్రా ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ సమైక్యాంధ్ర కోసం సాగిన పోరాటంలో క్రియాశీల పాత్ర నిర్వహించాను. కందుకూరు పార్టీ ఆఫీసుపై 4000 మంది దాడికి దిగితే, తుదివరకు పోరాడాలని, ఎర్రజెండాకు అవమానం జరగకూడదని భావిస్తూ మరో 18 మంది యువకులతో కలిసి ధైర్యంగా నిలబడ్డాం. దానికి నాయకత్వం నేనే వహించా. 1972లో విజయవాడలో జరిగిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యాను. దానికి గద్దం కోటేశ్వరరావు అధ్యక్షుడు, అజీజ్‌పాషా ప్రధాన కార్యదర్శి, కె.నారాయణ కూడా ఒక కార్యదర్శి. 1974లో విశాలాంధ్రను కాపాడటానికి 15 రోజులపాటు విజయవాడలోనే మకాం వేశాం.

1975-85 మధ్య కందుకూరు తాలూకా సీపీఐ కార్యదర్శిగా ఎన్నికై, 40 శాఖలు ఏర్పాటు చేసి, ఊరూరా తిరిగేవాడిని. 1985లో జిల్లా రైతుసంఘం ప్రధాన కార్యదర్శిగా, 1997-2006 వరకు ప్రకాశం జిల్లా సీపీఐ కార్యదర్శిగా మూడు టర్మ్‌లు పనిచేశాను. ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చిన తర్వాత 2006 నుంచి 2014 వరకు రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశాను. కె.రామకృష్ణ అధ్యక్షునిగా ఉండేవారు. రాష్ట్ర విభజన తర్వాత సీపీఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శివర్గ సభ్యునిగా, కేంద్రంలో ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడిగా 2021 వరకు కొనసాగాను. 2021లో ఏఐకేఎస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యాను. ఏఐకెఎస్‌కు ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తిని నేనే. అంతకుముందు వైవీ కృష్ణారావు ఆ బాధ్యతల్లో ఉన్నారు. (స్వాతంత్ర్యానికి ముందు) ఎన్‌జీ రంగాతో కలుపుకుంటే ఆ బాధ్యతల్లో పనిచేసిన మూడవ వ్యక్తిని.

2020లో ఢిల్లీ సరిహద్దులో సుదీర్ఘంగా సాగిన రైతు ఉద్యమంలో అఖిలభారత స్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలో ప్రధాన పాత్ర నిర్వహించాను. పొగాకు, జామాయిల్, సుబాబుల్ వంటి సమస్యలపై పార్టీలకు అతీతంగా ఐక్య రైతు ఉద్యమాలు నడపడంలో చొరవ తీసుకున్నాను. ఇదే ప్రయోగాన్ని హైదరాబాద్‌లోనూ నిర్వహించి, విజయవంతమయ్యాం. వరికి రూ. 1000 మద్దతు ధర కోసం పెద్ద ఉద్యమం చేపట్టాం. ప్రకాశం జిల్లా వెలుగొండ ప్రాజెక్టు మా రైతు కార్యక్రమాల్లో ఒక అంతర్భాగమైంది. 10 రోజుల పాదయాత్రతో దాన్ని విజయవంతం చేశాం. 1980 మార్చి నుంచి నవంబర్ వరకు రష్యాలో ఏడు మాసాలు రాజకీయ పాఠశాలకు హాజరయ్యాను. ఇంకా వియత్నాం, బంగ్లాదేశ్, నేపాల్‌లలో రైతు ప్రతినిధి వర్గంలో భాగంగా పర్యటనలు చేశాను.

1975లో విజయవాడలో జరిగిన 10వ సీపీఐ మహాసభలకు ఏఐఎస్ఎఫ్ తరపున కొచ్చిన్ నుంచి విజయవాడ వరకు ఎర్రజెండా జైత్రయాత్రను 15 రోజులు నిర్వహించాం. బీహార్, తమిళనాడు నేతలతోపాటు ఏపీకి నేను ప్రాతినిధ్యం వహించా. ఆనాడు నేను ప్రతినిధిని కాకపోయినా...అబ్జర్వర్‌గా చోటు కల్పించి, ఆరు రోజులపాటు ఆ మహాసభల్లో పాల్గొనే గొప్ప అవకాశం కల్పించారు. భటిండా (11వ మహాసభలు) నుంచి ప్రతి జాతీయ మహాసభలకు నేను ప్రతినిధినే. 13 మహాసభలకు ప్రతినిధిగా హాజరయ్యాను. విజయవాడ 24వ మహాసభ నాకు 14వది.

కందుకూరు తాలూకా నల్లమల అడవుల్లో అటవీ బంజరు భూముల పోరాటంలో 10 రోజులు జైలుశిక్ష అనుభవించాను. ఎన్నోసార్లు ఉద్యమాల్లో ఉండటం వల్ల చాలాసార్లు జైలుకెళ్లివచ్చాను. 55 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ వెనక్కి తిరిగిచూడలేదు. అన్ని బాధ్యతలూ ఫుల్‌టైమర్‌గానే సాగాయి. ఏఐఎస్ఎఫ్‌ను రాజకీయేతర సంఘంగా నడపడం వల్లనే ఆనాడు నేను అందులోకి రాగలిగాను...తద్వారా కమ్యూనిస్టునయ్యాను.

- రావుల వెంకయ్య

## అదానీ, అంబానీ, జైషానైనా స్వాగతిస్తాం

### రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్

**జైపూర్:** అదేమీ ప్రైవేటు కార్యక్రమం కాదు. 3,000 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అదానీ అయినా కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా తనయుడు జైషా అయినా రాజస్థాన్ అందరినీ స్వాగతిస్తుంది. ఎందుకంటే రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధిని కోరుకుంటోంది అని ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ అన్నారు. పారిశ్రామిక వేత్త గౌతం అదానీపై ప్రశంసలు కురిపించినట్లు కాంగ్రెస్‌ను బీజేపీ విమర్శించడాన్ని ఆయన శనివారం ఖండించారు. 'ఇది ప్రైవేటు కార్యక్రమం కాదు. పారిశ్రామికవేత్తల సదస్సు. 3,000 మంది హాజరయ్యారు. వారేమైన కాంగ్రెస్ వారా? ఎందుకని సమస్యలు సృష్టిస్తున్నారు. నేను దీనిని ఖండిస్తున్నాను. గౌతం అదానీ గురించి వారు మాట్లాడారు. గౌతం అదానీ, అంబానీగానీ జైషాగానీ అందరినీ మేము స్వాగతిస్తాం. మాకు ఉపాధి, ఉద్యోగాలు కావాలి. పెట్టుబడులు రాష్ట్రానికి రావాలి' అని గెహ్లోట్ స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలు అదానీ, అంబానీల సరసన జైషా పేరును గెహ్లోట్ ఎందుకు చేర్చారన్నది అస్పష్టంగా ఉంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తరచూ అదానీ పేరును ప్రస్తావిస్తుంటారు. ప్రధాని మోదీ కేవలం బడా వ్యాపారవేత్తలకు మాత్రమే సాయం చేస్తారని విమర్శలు గుప్పిస్తారు. అదానీ గ్రూపు ఇటీవల రాజస్థాన్‌లో ఐదు నుంచి ఏడేళ్ల కోసం రూ.65,000 కోట్ల పెట్టుబడులను ప్రకటించింది. 10,000 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్, సిమెంట్ ప్లాంట్ విస్తరణ, జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయం అప్‌గ్రేడేషన్‌ను అదానీ గ్రూపు ప్రకటించింది. అశోక్ గెహ్లోట్ తన ప్రసంగంలో గౌతమ్ అదానీని గౌతమ్ భాయ్ అని సంభోదించారు. ఆయన వ్యాపార సామర్థ్యంపై ప్రశంసలు కురిపించారు. ధీరూబాయ్ అంబానీ, గౌతమ్ భాయ్ వంటి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను గుజరాత్ తయారు చేసిందని అన్నారు. అదానీ, గెహ్లోట్ వేదిక పంచుకుంటున్న వీడియో వైరల్ అయింది. దీని ఆధారంగా కాంగ్రెస్‌పై బీజేపీ విమర్శలు గుప్పించింది. డబ్బులు వస్తాయని కాంగ్రెస్ తన శత్రువును మిత్రుడిగా చేసుకున్నదా? అని బీజేపీ రాజస్థాన్ అధ్యక్షుడు సతీష్ పూనియా వ్యంగాస్త్రాలను సంధించారు. ఈ విమర్శలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తోసిపుచ్చారు. అదానీకి రాజస్థాన్ ప్రత్యేక ప్రాధాన్యత ఏమీ ఇవ్వలేదని అన్నారు.

# తుది వరకూ పోరాటం

### నామినేషన్ ఉపసంహరణపై థరూర్

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల బరి నుంచి వైదొలుగుతున్నట్లు వస్తున్న వార్తలను సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ కొట్టిపారేశారు. సవాళ్ల నుంచి తానెప్పుడూ వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. ఈ పోటీలో చివరి వరకు పోరాడతానని తెలిపారు. అయితే ఇది ఇద్దరు సహచరుల మధ్య జరుగుతున్న స్నేహపూర్వక పోరు మాత్రమేనని థరూర్ చెప్పారు. ఈ మేరకు తన ట్విటర్ ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. 'కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో నేను నామినేషన్ ఉపసంహరించుకుంటున్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి. అవన్నీ అవాస్తవం. నా జీవితంలో ఇంతవరకెప్పుడూ సవాళ్ల నుంచి వెనక్కి తగ్గలేదు. తగ్గను కూడా..! ఇది పోరాటం. పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న స్నేహపూర్వక పోటీ. ఇందులో నేను చివరి వరకు పోరాడాలి. నేను పోటీలో ఉన్నా' అని థరూర్ తేల్చిచెప్పారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజున థరూర్ ఈ వీడియో పోస్ట్ చేయడంతో అధ్యక్ష పదవికి పోలింగ్ ఖాయమైంది. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి థరూర్‌తో పాటు సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. అధ్యక్ష పదవికి పోటీ చేస్తానని శశిథరూర్ ప్రకటించినప్పటికీ ఆయనపై కొంతమంది పార్టీ సీనియర్ల నుంచి వ్యతిరేకత ఎదురవుతూనే ఉంది. జి-23 వర్గంలో ఉన్న థరూర్.. అధ్యక్ష పదవికి పోటీ చేయడం సరికాదని కొంతమంది బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే ఆయన నామినేషన్ ఉపసంహరించుకోవాలంటూ ఒత్తిడి వచ్చినట్లు వార్తలు వచ్చాయి. దీంతో థరూర్ పోటీ నుంచి వైదొలిగే అవకాశముందని ఊహాగానాలు వినిపించాయి. వాటిని ఆయన కొట్టిపారేశారు. అధ్యక్ష పదవికి ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తుండటంతో పోలింగ్ అనివార్యమైంది. అక్టోబరు 17న ఓటింగ్ జరగనుంది. 19న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాన్ని వెల్లడించనున్నారు. ఈ ఎన్నికల్లో 9వేల మందికి పైగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గాంధీ కుటుంబానికి విధేయుడైన ఖర్గేకు ఎక్కువమంది మద్దతు ఉన్నట్లు తెలుస్తోంది.

### బళ్లారిలోనే రాహుల్ ఓటు

**తురువెకెరె:** భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్న రాహుల్, మరో 40 మంది కాంగ్రెస్ నేతలు అక్టోబరు 17న జరిగే పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో బళ్లారిలోనే ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నాయకులంతా ఓటు వేసేందుకు వీలుగా పోలింగ్ రోజున భారత్ జోడో యాత్రకు విరామం ప్రకటించారు. బళ్లారిలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని పార్టీ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చెప్పారు. కర్ణాటకలోని పీసీసీ ప్రతినిధులు బెంగళూరులో ఓటేస్తారని తెలిపారు. అక్టోబరు 18న రాహుల్ భారత్ జోడో యాత్ర ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో 95 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగుతుంది. తిరిగి కర్ణాటకలోని రాయచూర్‌లో ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి తెలంగాణ చేరుకుంటుందని జైరాం రమేశ్ వివరించారు.

జాత్యహంకారంపై యూఎన్‌హెచ్ఆర్సీ

## స్వతంత్ర నిపుణులుగా అశ్విని కేపీ

**న్యూఢిల్లీ:** దళిత కార్యకర్త, ప్రొఫెసర్ అశ్విని కె.పి. యూఎన్‌హెచ్ఆర్సీ ద్వారా జాత్యహంకారంపై స్వతంత్ర నిపుణులుగా నియమితులయ్యారు. ఈ పదవి బాధ్యతలు చేపట్టిన ఆరవ వ్యక్తి అయినప్పటికీ తొలి భారతీయునిగా నిలిచారు. ఆసియా నుంచి మొదటగా నియామకం పొందిన ఈమె పూర్వీకులంతా ఆఫ్రికాకు చెందిన వారు. అశ్వినిని జాత్యహంకారం, సంబంధిత అసహనంపై స్వతంత్ర్య నిపుణురాలుగా ఐరాస మానవహక్కుల మండలి శుక్రవారం నియమించింది. జెనీవాలోని ఐరాస మానవహక్కుల సంఘంలో 47సభ్యులు ఉన్నారు. ఈ నియామకానికి వారంతా మద్ద తిచ్చారు. జాంబియాకు చెందిన ఇ.టెండాయి అచియుమే తన మూడేళ్ల పదవీకాలం పూర్తికాకముందే రాజీనామా చేయడంతో అనూహ్యంగా జాత్యహంకారం, జాతి వివక్ష, విద్వేషం, అసహనం సంబంధిత సమకాలీన రూపాలపై స్పెషల్ రిపోర్టర్ (ఆర్ఎస్) ఖాళీ ఏర్పడింది. ప్రత్యేక రిపోర్టర్లు స్వతంత్ర నిపుణులు. వీరిని యూఎన్‌హెచ్ఆర్సీ నియమిస్తుంది. వీరు వ్యక్తిగత సేవలు అందిస్తారు. మానవహక్కులపై నివేదికలను నిర్దిష్ట దేశాల దృష్టి కోణంతో అందజేస్తారు. మండలి అధ్యక్షునికి మాండేట్ హెూల్డర్ల ఎంపిక కోసం కన్సల్టేటివ్ గ్రూప్ సిఫార్సు చేసిన ముగ్గురు సభ్యులలో అశ్వినితో పాటు, జాషువా కాస్టెలినో (భారత్), యూనిటీ డౌ (బోట్స్‌వానా) ఉన్నారు. అనంతరం అశ్వినిని యూఎన్‌హెచ్ఆర్సీ అధ్యక్షుడు ఎంపిక చేయగా శుక్రవారం మండలి 51వ సమావేశంలో ఆమె నియామకం జరిగింది. అశ్విని మూడేళ్ల పదవీకాలం నవంబరు 1 నుంచి మొదలవుతుంది. అశ్విని ప్రస్తుతం బెంగళూరులోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. గతంలో అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా మానవ హక్కుల సీనియర్ ప్రచారకురాలిగా పనిచేశారు.

పిల్లలను ఎత్తుకెళ్లేవాడనే అనుమానంతో

## మానసిక దివ్యాంగుడిపై దాడి

**దుర్గ్:** చత్తీస్‌గఢ్, దుర్గ్ జిల్లాలోని ఒక గ్రామంలో మానసిక దివ్యాంగుడైన వ్యక్తిని పిల్లలను ఎత్తుకెళ్లేవాడన్న అనుమానంతో ఒక గుంపు దాడిచేసినట్టు పోలీసులు శనివారం తెలిపారు. అయితే ఈ ఘటనలో బాధితుడికి ఎలాంటి గాయాలు కాలేదని, పోలీసులు సకాలంలో రక్షించారని, మానసిక వికలాంగుల కోసం బిలాస్‌పూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని వారు తెలిపారు. ఉతాయ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖోప్లి గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు దుర్గ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అభిషేక్ పల్లవ తెలిపారు. గ్రామంలో మొదటిసారిగా బాధితుడిని చూసి కొందరు మహిళలు, పిల్లలు అనుమానం వ్యక్తం చేశారని, దీంతో స్థానిక గ్రామస్థులు అతనిపై దాడి చేయడం ప్రారంభించారని తెలిపారు. 'మానసిక స్థితి సరిగాలేని వ్యక్తి ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాడని పోలీసులకు ఇప్పటికే సమాచారం అందించడంతో, పోలీసుల బృందం ఘటనా స్థలానికి చేరుకుని అతడిని రక్షించింది" అని ఎస్పీ పేర్కొన్నారు. బాధితుడిని స్థానిక ఆస్పత్రికి తరలించగా, గాయం గుర్తులు లేవని వైద్యులు నిర్ధారించారు. ఆ తర్వాత, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అనుమతితో, మానసిక వ్యాధి చికిత్స కోసం బిలాస్‌పూర్‌లోని సేంద్రి ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని, ఖోప్లీ నివాసితులైన ముగ్గురు వ్యక్తులు అతనిపై దాడి చేసినట్టు నిర్ధారించామని, వారి అరెస్టు చేశామని, విచారణ జరుగుతోందని పల్లవ వివరించారు. పిల్లలను అపహరించే ముఠా సభ్యులని ప్రజలు అనుమానించడంతో సాధువుల వేషధారణలో ఉన్న ముగ్గురు వ్యక్తులను బుధవారం జిల్లాలోని చరోడా పట్టణంలో ఒక గుంపు వారిపై దాడిచేసిన రెండు రోజుల తర్వాత ఈ ఘటన జరిగింది.

రాజ్యాంగ విధులను నిర్వర్తించకుండా

## కేజ్రీవాల్ పారిపోతున్నారు

### దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా

**న్యూఢిల్లీ:** దిల్లీలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్యమంత్రికి మధ్య వివాదాలు తీవ్రమవుతున్నాయి. తాజాగా నో హెూల్డ్ లేఖను సీఎం కేజ్రీవాల్‌ను ఉద్దేశించి ఎల్‌జీ సక్సేనా రాశారు. అందులో తనదైన శైలిలో కేజ్రీవాల్‌పై విమర్శలు గుప్పించారు. తమ రాజ్యాంగ విధులు, పాలనా బాధ్యతల నుంచి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పారిపోతున్నారని ఆరోపించారు. ప్రసంగాలు, ప్రకటనలతోనే పరిపాలన సాగుతోందని, రాజ్యాంగ బాధ్యతలను విస్మరిస్తున్నారని, మౌలిక ప్రజాహిత కార్యక్రమాలకు ప్రభుత్వం దూరమైందని సక్సేనా పేర్కొన్నారు. రద్దు అయిన దిల్లీ ఎక్సైజ్ విధానం, రాష్ట్రపతి ముర్ము పాల్గొన్న కార్యక్రమానికి కేజ్రీవాల్, దిల్లీ మంత్రులు గైర్హాజరు కావడం, విద్యుత్ చార్జీల్లో రాయితీ, టీచర్ల నియామకాల గురించి లేఖలో ఎల్‌జీ ప్రస్తావించారు. ఆప్ ప్రభుత్వ పనితీరులో సక్సేనా జోక్యం చేసుకుంటున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా చేసిన ఆరోపణల క్రమంలో ఎల్‌జీ లేఖ ప్రాధాన్యతను సంతరించుకుంది. సక్సేనా వ్యాఖ్యలకు కేజ్రీవాల్ ట్విట్టర్ మాధ్యమంగా వ్యంగ్య సమాధానం ఇచ్చారు. 'మరో ప్రేమలేఖ వచ్చింది' అని ట్వీట్ చేశారు. తన భార్య ఇంతలా ఎప్పుడు తిట్టలేదంటూ ఇంతకుముందు కూడా ఆయన ఎల్‌జీ విషయంలో ఎద్దేవా చేయడం తెలిసిందే. దిల్లీ ప్రజల జీవితాలను ఎల్‌జీ ద్వారా నాశనం చేయాలని బీజేపీ చూస్తోందని, నిత్యం ఏదో ఒక వివాదానికి తెరతీస్తోందని వ్యాఖ్యానించారు.

## కేజ్రీవాల్ హిందూ వ్యతిరేకి

### గుజరాత్‌లో వెలిసిన బ్యానర్లు, పోస్టర్లు

**అహ్మదాబాద్:** గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటుంది. అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు ప్రారంభమయ్యాయి. ప్రత్యర్థి పార్టీల మధ్య మాటల యుద్ధమే కాకుండా బ్యానర్ల యుద్ధం జరుగుతోంది. గుజరాత్‌లో అధికారం చేజిక్కించుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ చాలాకాలంగా రాష్ట్రంలో తిష్టవేసి ప్రచారం చేస్తోంది. రెండున్నర దశాబ్దాలు అధికారంలో కొనసాగిన బీజేపీని ఓడించటమే లక్ష్యంగా ఆప్ ప్రయత్నాలు ప్రారంభించింది. వరుసగా అభ్యర్థులను ప్రకటిస్తోంది. హామీల వర్షం కురిపిస్తోంది. దిల్లీ తరహా పాలన అందిస్తామని భరోసా ఇస్తోంది. ఎలాగైనా ప్రజలను తమ వైపునకు తిప్పుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. ఆప్‌పై అధికార బీజేపీ ఎదురుదాడి చేస్తోంది. నయానా, భయానా బెదిరిస్తోంది. దిల్లీలో మద్యం కుంభకోణం పేరుతో ఆ పార్టీ నాయకులపై కేసులు, వేధింపులు కొనసాగిస్తోంది. నిర్లజ్జగా సీబీఐ, ఈడీలను ప్రయోగిస్తోంది. అంతటితో ఆగకుండా తన సహజసిద్ధమైన మత కార్డును మరోసారి బయటికి తీసింది. ఏకంగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ 'హిందూ వ్యతిరేకి' అంటూ గుజరాత్‌లోని అనేక నగరాల్లో బ్యానర్లు వెలిశాయి. వాస్తవంగా ఎన్నికల ప్రచారం కోసం కేజ్రీవాల్ శనివారం గుజరాత్‌కు వస్తున్నారు. దీనికి ముందు ఆయనను హిందూ వ్యతిరేకిగా ముద్ర వేస్తూ బ్యానర్లు ఏర్పాటు చేశారు. హిందూ మతం ఓ పిచ్చి అంటూ కేజ్రీవాల్ అన్నట్లు బ్యానర్లలో రాతలు రాశారు. హిందూ వ్యతిరేక కేజ్రీవాల్ గోబ్యాక్ అని కొన్ని బ్యానర్లు కనిపించాయి. అహ్మదాబాద్, సూరత్, వదోదర వంటి నగరాల్లో ఈ బ్యానర్లు కట్టారు. బ్రహ్మ, విష్ణు, రామ, కృష్ణను తాను నమ్మనని, ఏ మత ఉత్సవాలు తాను చేయబోనని కేజ్రీవాల్ చెప్పినట్లు పోస్టర్లు వెలిశాయి. అయితే అన్ని బ్యానర్లపై ఉమ్మడిగా ఇది ఆప్ సంస్కృతి అనే పదాలు రాశారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ప్రధాన పోటీదారుగా ఆప్ ఆవిర్భవిస్తున్నట్లు కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు రాష్ట్ర ప్రజలు గుణపాఠం చెబుతారని బీజేపీ నిన్న ఎదురుదాడి చేసింది.

## మహేశ్‌కు బాలకృష్ణ పరామర్శ

**హైదరాబాద్:** మహేశ్‌బాబు తల్లి ఇందిరాదేవి పది రోజుల కిందట మరణించిన సంగతి తెలిసిందే. అప్పుడు చిత్ర పరిశ్రమ నుంచి చాలామంది వ్యక్తిగతంగా వచ్చి, మహేశ్‌బాబుకు, కృష్ణకు తమ సంతాపం వ్యక్తపరిచారు. అప్పుడు బాలకృష్ణ టర్కీలో షూటింగ్‌లో ఉండటం వల్ల మహేశ్‌ను కలవటానికి కుదరలేదు. అయితే శనివారం ఫిలింనగర్ కల్చరల్ క్లబ్‌లో 11వ రోజు కర్మ చేశారు. దానికి కృష్ణ కుటుంబానికి బాగా పరిచయం ఉన్న చిత్ర పరిశ్రమకి సంబంధించిన వారిని పిలిచినట్టు సమాచారం. అందులో నందమూరి బాలకృష్ణ కూడా ఉన్నారు. బాలకృష్ణ వచ్చి కృష్ణను, మహేశ్‌ను పరామర్శించి తన సానుభూతిని వ్యక్తపరిచినట్టు తెలిసింది. అలాగే కృష్ణతో సినిమాలు చేసిన రంజిత్ ఫిలిమ్స్ కానూరి దామోదర ప్రసాద్ కూడా వచ్చారు. చిత్ర పరిశ్రమ నుంచి మరి కొంతమంది కుటుంబాలతో హాజరైనట్టుగా తెలిసింది. మహేశ్‌బాబు మళ్లీ సోమవారం నుంచి తన సినిమా షూటింగ్‌లో పాల్గొంటాడని కూడా అంటున్నారు.

## 12 మంది సజీవదహనం

- ట్రక్‌ను ఢీకొని బస్సు దగ్ధం
- 45 మందికి గాయాలు

**నాసిక్:** మహారాష్ట్రలోని నాసిక్‌లో శనివారం తెల్లవారుజామున ముంబైకి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ట్రక్కును ఢీకొట్టి మంటలు చెలరేగడంతో రెండేళ్ల చిన్నారి సహా 12 మంది ప్రయాణికులు మృతి చెందగా, మరో 43 మంది గాయపడినట్టు పోలీసులు తెలిపారు. తూర్పు మహారాష్ట్రలోని యవత్మాల్ నుంచి స్లీపర్ బస్సు వస్తుండగా నాసిక్-ఔరంగాబాద్ హైవేపై నందూర్ నాకా వద్ద తెల్లవారుజామున 5.15 గంటలకు ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. బస్సు దుర్ఘటనలో మరణించిన వారి పట్ల సంతాపం వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, మృతుల బంధువులకు రూ.2 లక్షలు, గాయపడ్డవారికి రూ.50వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారని, గాయపడ్డవారి వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. జిల్లా సివిల్ ఆస్పత్రిని, ఘటనాస్థలిని సీఎం సందర్శించారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరుపుతామని తెలిపారు. “నాసిక్-ఔరంగాబాద్ హైవేపై మిర్చి హోటల్ సమీపంలోని కూడలి వద్ద యవత్మాల్ నుంచి ముంబైకి వెళ్తున్న లగ్జరీ బస్సు పూణే వెళ్తున్న ట్రక్కును ఢీకొట్టింది. వెంటనే, బస్సు మంటల్లో చిక్కుకుంది, ఇందులో 12 మంది ప్రయాణికులు మరణించారు. 43 మంది గాయపడ్డారు'అని పోలీసు అధికారి తెలిపారు. మృతుల్లో రెండేళ్ల చిన్నారి కూడా ఉందని, ఈ ఘటనలో బస్సు పూర్తిగా కాలిపోయిందని వివరించారు. గాయపడ్డవారిని జిల్లా సివిల్ ఆసుపత్రిలో, నాసిక్‌లోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్పినట్లు నగర పోలీసు కమిషనర్ జయంత్ నాయక్నవారే తెలిపారు. మంటలు చెలరేగడానికి ముందు, బస్సు మినీ కార్గో వ్యాన్‌ను కూడా ఢీకొట్టింది, దాని కారణంగా రెండోది బోల్తా పడిందని వివరించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఇతర సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలను ఆర్పివేశారు. అయితే ఈ ఘటనలో బస్సు పూర్తిగా దగ్ధమైందని అధికారులు తెలిపారు. క్షణాల్లో బస్సు మొత్తం మంటలు వ్యాపించాయనీ, ప్రయాణికులను రక్షించేందుకు ఏమీ చేయలేక నిస్సహాయంగా అక్కడే నిల్చోవాల్సి వచ్చిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని సీఎం షిండే పేర్కొన్నారు.

## ఎవరినీ నిరాశ పరచను...నోట్ రాసిస్తా: ఓం రౌత్

**ముంబై:** 'ఆదిపురుష్' టీజర్ విడుదలైనప్పటి నుంచి దర్శకుడు ఓంరౌత్ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నట్లు కనిపిస్తోంది. టీజర్‌కు వచ్చిన మిశ్రమ స్పందన, ట్రోలింగ్‌తో అతనిపై ఒత్తిడి పెరిగిందని బాలీవుడ్ మీడియా చెబుతోంది. ఓంరౌత్ కొత్త తరహాలో రామాయణాన్ని చెప్పే ప్రయత్నం చేస్తున్నారన్న మద్దతు ఉన్నప్పటికీ కొందరి నుంచి విమర్శలు అయితే ఇప్పటికీ తగ్గడం లేదు. ఈ ట్రోలింగ్ తట్టుకోలేక.. ఇప్పుడు ప్రభాస్ అభిమానుల్ని కూల్ చేసే పనిలో పడ్డారాయన. తను తీసిన సినిమాపై పూర్తి నమ్మకం ఉందని చెబుతున్నాడు. టీజర్‌కు వస్తోన్న ప్రతికూల స్పందనలపై ఆయన స్పందించారు. “ఆదిపురుష్' టీజర్‌పై చాలా విమర్శలు వస్తున్నాయి. అందులో పాత్రల్ని మాత్రమే పరిచయం చేశాం. రెండు నిమిషాల నిడివితో సినిమాపై అంచనాకు రావద్దు. సంక్రాంతి కానుకగా రాబోతున్న ఈ చిత్రం ఎవరినీ నిరాశ పరచదు. కావాలంటే నోట్ రాసిస్తా. తప్పకుండా ప్రభాస్ అభిమానుల్ని, అన్ని వర్గాల ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుందీ సినిమా. రాముడు పాత్ర ప్రభాస్ కోసమే రాశా. ఆ లైన్ రాస్తున్నంత సేపు నా మైండ్‌లో ప్రభాసే ఉన్నారు. ఆయన నో అంటే సినిమా పట్టాలెక్కేది కాదు" అని ఓం రౌత్ చెప్పారు. అయితే ట్రోలింగ్ తట్టుకోలేక సినిమా పక్కా హిట్ అని నోట్ రాసిస్తానని చెప్పినట్లు సినీ వర్గాల నుంచి టాక్ వినిపిస్తోంది.

## 600 స్క్రీన్స్ పెంచిన గాడ్‌ఫాదర్

హైదరాబాద్: చిరంజీవి నటించిన 'గాడ్ ఫాదర్' సినిమా కలక్షన్స్ పెరుగుతూ పోతున్నాయి. దానికి తగ్గట్టుగానే స్క్రీన్స్ కూడా పెంచుకుంటూ వెళుతున్నారు. ప్రేక్షకులు ఇచ్చిన ఈ విజయానికి చిరంజీవి తాను ఎంతగానో సంతోషంగా ఉన్నానని చెబుతూ ఒక వీడియో కూడా విడుదల చేశారు. ఈ వీడియోలో సినిమా విజయానికి దోహదపడ్డ ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు చెబుతూ, ఎన్ని స్క్రీన్స్ పెంచారో కూడా చెప్పారు. “నా సినిమా గాడ్ ఫాదర్ విజయవంతం చేసిన మీ అందరికి ధన్యవాదాలు. ఈ సినిమా రెండు రోజుల్లో రూ.69 కోట్ల రెవెన్యూ సంపాదించింది. ఇప్పుడు హిందీ వాళ్ల కోసం మేం 600 స్క్రీన్స్ పెంచుతున్నాం. ఇది నిజంగా ఒక పాన్ ఇండియా సినిమాగా చేసినందుకు నేను చాల సంతోషంగా ఉన్నాను. ఒక్క ఉత్తరాదిలోనే కాదు అందరూ ఈ సినిమాని ఇంత ఆదరించినందుకు నా ధన్యవాదాలు' అని చిరంజీవి ఆ వీడియోలో చెప్పారు. మోహన్ రాజా ఈ సినిమాకు దర్శకుడు కాగా, ఎన్వీ ప్రసాద్, సూపర్ గుడ్ ఫిల్మ్స్ ఆర్‌బీ చౌదరి ఈ సినిమాకు నిర్మాతలు. సుమారు రూ.90 కోట్లు ఖర్చు అయినట్టుగా చెబుతున్నారు. శనివారం, ఆదివారం ఈ సినిమాకు ఇంకా బాగా కలెక్షన్స్ వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## అదరగొట్టిన షఫాలీ

- బ్యాటింగ్, బౌలింగ్‌లోనూ రాణించిన వర్మ
- బంగ్లాదేశ్‌పై భారత్ ఘనవిజయం

**ముంబై:** ఆసియా కప్‌లో భారత మహిళా జట్టు మళ్లీ గాడిలో పడింది. వరుసగా మూడు విజయాల తర్వాత పాక్ చేతిలో ఓడిన టీమిండియా, కీలకమైన పోరులో బంగ్లాదేశ్‌పై అద్భుత విజయం సాధించింది. దీంతో సెమీస్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకుంది. ప్రస్తుతం భారత్ ఎనిమిది పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. గ్రూప్ స్టేజ్‌లో టీమిండియా నాలుగో విజయం నమోదు చేసింది. బంగ్లాదేశ్‌పై 59 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానం నిలబెట్టుకొంది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో భారత బౌలర్ల దెబ్బకు బంగ్లాదేశ్ 20 ఓవర్లలో ఆరు వికెట్లను కోల్పోయి 100 పరుగులే చేయగలిగింది. నిగర్ సుల్తానా (36), ఫర్గానా హక్ (30), ముర్షిదా ఖాతున్ (21) ఫర్వాలేదనిపించారు. టీమిండియా బౌలర్లు కట్టుదిట్టంగా బంతులను సంధించడంతో బంగ్లా ఏ దశలోనూ విజయం వైపు సాగలేకపోయింది. షఫాలీ వర్మ 2, దీప్తి శర్మ 2, రేణుకా సింగ్, స్నేహ్ రాణా చెరో వికెట్ తీశారు. లీగ్ దశలో భారత్ తన చివరి మ్యాచ్‌ను అక్టోబర్ 10న థాయ్‌లాండ్‌తో ఆడనుంది. పాక్‌తో మ్యాచ్‌లో విఫలమైన టాప్‌ఆర్డర్.. ఈసారి మాత్రం అదరగొట్టేసింది. మరీ ముఖ్యంగా ఓపెనర్లు షఫాలీ వర్మ (55) అర్ధశతకం సాధించగా.. కెప్టెన్ స్మృతీ మంధాన (47) కీలక ఇన్నింగ్స్ ఆడింది. హర్మన్‌ప్రీత్ స్థానంలో స్మృతీ నాయకత్వ బాధ్యతలు చేపట్టింది. ఓపెనర్లు తొలి వికెట్‌కు 96 పరుగులు జోడించారు. ఆ తర్వాత రోడ్రిగ్స్ (35 నాటౌట్) కూడా రాణించింది. అయితే రిచా ఘోష్ (4), కిరన్ నవ్‌గిరె (0) విఫలం కాగా.. దీప్తి శర్మ 10 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ బౌలర్లలో రుమానా అహ్మద్ 3, సల్మా ఖాతున్ ఒక వికెట్ తీశారు.

టీమిండియాలో

## నాలుగైదు అంతర్జాతీయ జట్లు

### దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్

**న్యూఢిల్లీ:** శిఖర్ ధావన్ నేతృత్వంలోని భారత వన్డే జట్టును తాము రెండోస్థాయి జట్టుగా పరిగణించబోమని దక్షిణాఫ్రికా లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహారాజ్ అన్నాడు. ఎందుకంటే భారత్‌లో చాలా ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారనీ, ఒకేసారి నాలుగైదు అంతర్జాతీయ జట్లను రూపొందించగల సత్తా టీమిండియాలో ఉందని కితాబిచ్చాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ తొలి వన్డేలో ఓడిపోయిన సంగతి తెలిసిందే. 'నేను భారత వన్డే జట్టును రెండో స్థాయి జట్టుగా అసలు భావించను. భారత జట్టులో చాలా ప్రతిభ ఉంది. ఏకంగా నాలుగైదు ప్రపంచస్థాయి జట్లు టీమిండియాకు ఇప్పుడు అందు బాటులో ఉన్నాయి.' అని కేశవ్ అన్నాడు. 'చాలా మంది ఐపీఎల్‌లో ఆడిన అనుభవాన్ని కలిగి ఉన్నారు. ఇంకా ఇంటర్నేషనల్ అనుభవం ఉన్నవారూ ఉన్నారు. టీమిండియాకు వరల్డ్ క్లాస్ ప్లేయర్లకు కొదవే లేదు. భారత్‌పై ఆడటం ఎల్లప్పుడూ చాలా ఆనందంగా ఉంటుంది. సహజంగానే భారత్ లాంటి టీంతో ఆడాల్సినప్పుడు మనల్ని మనం మరింత సవాల్ చేసుకుంటూ సిద్ధం కావాల్సి ఉంటుంది. ఎందుకుంటే ప్రపంచ స్థాయి బ్యాటింగ్ లైనప్‌తో భారత జట్టు చాలా భీకరంగా కన్పిస్తుంటుంది' అని మహారాజ్ అన్నాడు. ఒకప్పుడు ప్రపంచంలోనే నంబర్ వన్ టీ20 బౌలర్‌గా ఉన్న తబ్రైజ్ షమ్సీని తొలి వన్డేలో భారత బ్యాటర్లు ఈజీగా ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. అతను తాను వేసిన ఎనిమిది ఓవర్లలో ఏకంగా 89 పరుగులిచ్చాడు. అయితే షమ్సీ పేలవ బౌలింగ్‌ను మహరాజ్ వెనకేసుకొచ్చాడు. 'షమ్సీ నిజంగా పేలవమైన బౌలింగ్ కలిగి ఉన్నాడని నేను అనుకోను. బౌలింగ్ ఎల్లవేళాలా అనుకూలంగా పడాలని ఎవరూ అనుకోకూ దదు. గణాంకాలు చూసి కూడా నిర్దిష్ట అభిప్రాయానికి రాకూడదు. భారత బ్యాటర్లు ఒకరి బౌలింగ్‌లో పరుగులు దండుకోవాల్సి వచ్చింది. దురదృష్టవశాత్తూ షమ్సీ బౌలింగ్ వారికి ఆ రోజు కాస్త వీలు చిక్కింది.

ఏదేమైనా షమ్సీ ఒకరోజు బాగా ఆడకుంటే తనను తాను సాన బెట్టుకుని తర్వాతి మ్యాచ్‌లో తానేంటో చూపిస్తాడు' అని మహారాజ్ పేర్కొన్నాడు. రాంచీలో జరగనున్న రెండో వన్డే కోసం చాలా ఎదురుచూస్తున్నానని.. వీలు చిక్కితే మహేంద్ర సింగ్ ధోనీతో ఓసారి మాట్లాడానికి ప్రయత్నిస్తానని చెప్పాడు. ధోనీతో కలిసి ఆడే అవకాశం తనకు లేదనీ, కనీసం ఓసారి మాట్లాడే అవకాశమన్న దొరికితే చాలు అని కేశవ్ పేర్కొన్నాడు. కెప్టెన్సీ పరంగా, మైదానంలో అతని ప్రశాంతత పరంగా నేర్చుకోవాల్సింది చాలా ఉన్నాయి' అని మహారాజ్ కితాబిచ్చాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.